# ఆచార్యరంగాజీకి కవితామం...



సంపాదకుడు:

**దరువూరి వీరయ్య**

# ఆచార్య రంగాజీకి
# కవితా మంజరి

సంపాదకుడు:

## దరువూరి వీరయ్య

88 వ జన్మదినోత్సవ ఆహ్వాన సంఘ ప్రచురణ

రంగా గ్రంథావళి-3

ప్రథమ 1987 నవంబరు

ప్రచురణ:
ఆచార్య రంగా జన్మదినోత్సవ
ఆహ్వాన సంఘం

Sundarayya Vignana
26433
C-7941

వెల: రు. 25-00

ప్రతులకు:
దరువూరి వీరయ్య
సంపాదకుడు
క్రిసాన్ పబ్లికేషన్స్,
గుంటూరు – 522 007.

ముద్రణ:
శ్రీ అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్
సీతారామపురం, విజయవాడ–520 004.

# ముందుమాట

రైతుల—కూలీల—చేతివృత్తుల—కళాకారుల-బుద్ధిజీవుల, ప్రజాస్వామిక శ్రేయోరాజ్యం రంగాజీ ప్రధాన ఆశయం. వారి అభివృద్ధి వికాసాలకు దోహదం చేయగల రాజ్యాంగ వ్యవస్థ "కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్" ఇందుకే ఆయన ఏడుదశాబ్దాలుగా నిరంతరం, నిర్విరామంగా, నిరవధికంగా ప్రజాసేవా కార్యములు సాగిస్తున్నారు.

పార్లమెంటరీ జీవితం ఆరు దశాబ్దాలు నిండబోతున్నాయి. అటు ప్రజలలోను, ఇటు పార్లమెంటులోను కూడా ఒకే ఆశయం, ఒకే ఆదర్శం కొరకు తన జీవితాన్ని అంకితం చేశారాయన. అదే "కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్" అదే ఆయన లక్ష్యం, గమ్యం: రైతు-కూలీ—చేతివృత్తుల — కళాకారులకు చెందిన అశేష గ్రామీణ శ్రామిక జనాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సాంఘిక న్యాయం రాజకీయాధికారం సంపాదించేందుకే రంగా తపన - ఆరాటం—పోరాటం—ఆందోళనలు—ఇంకెన్నో విధాలుగా తపస్సు చేస్తున్నారు.

పై యావత్తు శ్రామికవర్గాలను జాగృతం చేయడానికి, చైతన్యము చేయడానికి, చైతన్యము కలిగించడానికి మేలుకొలుపడానికి ఇంతటి సుదీర్ఘ కాలంలో ఎన్నెన్నో సంస్థలు—సంఘాలు స్థాపించారు. వందలాదిగా ప్రతి సమస్యపై పరిశోధనాత్మకమైన గ్రంథాలు రచించి ప్రచురించారు. వేల సంఖ్యలోనే, పార్లమెంటుల్లో ప్రసంగాలు చేశారు. ప్రబోధ గేయాలు, పాటలు, పద్యాలతో కవనాల నల్లించి కదన రంగంలో, ఉద్యమాల్లో గానం చేయించారు. ప్రచారకులకు, "కిసాన్

మజ్దూర్ ప్రజారాజ్'' సిద్ధాంత వివరణకు వేసంగి వయోజన రాజకీయ పాఠశాలలు నెలకొల్పారు. వేల మైళ్ళ పర్యంతం ''రైతు రక్షణ యాత్రలు'' సాగించారు.

స్వాతంత్రోద్యమంలో చేరి కారాగారముల ననుభవించుటలో తనతో సరిపెట్టుకొన లేదాయన. తన సోదరులు, ఆదర్శ మహిళా మణి, త్యాగమయి వారి ధర్మపత్ని శ్రీమతి భారతీదేవితో సమర కుటుంబ సభ్యులనందరిని గారాగారములకు పంపించిన త్యాగధనుడు- మహామనీషి-మానవతామూర్తి రంగాజీ.

హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక–రాజకీయ స్వాతంత్ర్యములతోపాటు సాంఘిక న్యాయం సమకూర్చి శ్రేయో రాజ్య సంస్థాపన లక్ష్యంగా వుండాలంటే కూడా ''కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్'' నిర్మాణం జరగాలన్నారు రంగాజీ.

ఒక్కమాటలో– రంగాజీ-తన జీవిత కాలమంతా, తన సర్వ స్వాన్ని ధారపోశారాయన. బీదలు, పతితులు, అనాధలు అయిన అశేష శ్రామిక జనాల అభివృద్ధి కొరకు.

అందుకే ఆయన రచనలు ''రంగా గ్రంధావళి'' ప్రచురణలు ప్రారంభించాము. ఇందులో ఇది మూడవ గ్రంథం. ఈ గ్రంథం గత నాలుగైదు దశాబ్దాలుగా, రంగాజీని, శ్రీమతి రంగాజీని, వారలు సాగించిన ఉద్యమాలు, పోరాటాలను ప్రశంసిస్తూ. అభినందిస్తూ, ఆరాధిస్తూ, ఆశీర్వదిస్తూ పలువురు కవులు, పండితులు రచించిన గేయాలు, పద్యాలు, పాటలు ''ఆచార్య రంగాజీకి–కవితామంజరి'' మూడవదిగా ప్రచురించాము.

రంగా గ్రంధావళి–3 ను 88 వ జన్మదిన మహోత్సవ శుభ సమయాన 1–2 గ్రంథాలతోపాటు రంగాజీ పాద పద్మముల ముందుంచి, వినమ్రుడనై ప్రణామముల నొనర్చుచున్నాను.

దరువూరి వీరయ్య

“సంపాదకుడు”

# ఇందులో ....

సర్వశ్రీ


1. తుమ్మల సీతారామమూర్తి చౌదరి
2. జి. జాషువ
3. సి. రాజగోపాలనాయుడు
4. డా దివాకర్ల వెంకటావధాని
5. శివారెడ్డి
6. నడకుదురు రాధాకృష్ణ
7. లక్కరాజు కామేశ్వరరావు
8. పి. వి. సుబ్బారావు
9. బండ్లమూడి శివరామకృష్ణ
10. కాణిపాకం లింగన్న
11. పండిత పెన్మెత్స సత్యనారాయణరాజు
12. పండిత సత్యనారాయణ చౌదరి
13. బాలాంత్రపు వెంకట్రావు
14. జంపాల వేంకట నృసింహము

15. బోడేపూడి వెంకటరావు
16. యడ్లపల్లి దేవయ్య చౌదరి
17. పి. ఆర్. చౌదరి
18. సి. వేణు
19. కన్నెకంటి వీరభద్రాచార్యులు
20. జాస్తి వెంకట నరసయ్య
21. హెచ్. ఆర్. నండూరి
22. మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి
23. గొట్టిపాటి సుబ్బరాయలు
24. షేక్ ఆలీకవి
25. కవిశేఖర చిన్నము హనుమయ్య చౌదరి
26. బూసం మల్లయ్య
27. కర్షక కిశోర్
28. పరుశురామ్
29. కె. ఆర్. కోష్ఠి
30. నూతక్కి అబ్రహాము
31. బచ్చల మునికన్నయ్య
32. కె. సభా
33. కొసరాజు రాఘవయ్య చౌదరి
34. టి. వి. యస్. మూర్తి
35. వాస్తవానంద్
36. పరిమి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

37. ఏటుకూరి వెంకట నరసయ్య
38. కొల్లా శ్రీకృష్ణారావు
39. పైడిపాటి సుబ్బరామశాస్త్రి
40. గుత్తా వీరరాఘవయ్యచౌదరి
41. పి. రామమూర్తి
42. రావెల సాంబశివరావు
43. ఆలోకం పెద్దబ్బయ్య
44. చెరుకుమల్లి వెంకటయ్య
45. పిశ్కా కన్నయ్యనాయుడు
46. యం. వి. శాస్త్రి
47. గడ్డం విశ్వనాథరావు
48. వెల్లంకి బ్రహ్మయ్య
49. ముండ్లపాటి రామనాథరావు
50. జ్యోతి ప్రసాద్
51. బూదూరు రామానుజులురెడ్డి
52. కొత్త భావయ్యచౌదరి
53. నాగభైరవ కోటేశ్వరరావు
54 శెట్టిపల్లి
55. త్రిపురాన రాఘవదాసు
56. కొత్తపల్లి పున్నయ్య
57. వేములపల్లి రాఘవయ్య
58. కొత్త సత్యనారాయణ

59. రామానాయుడు

60. దాసరి వెంకట సుబ్బారావు

61. డాక్టరు జె. బాపురెడ్డి

62. బొడ్డులూరి నారాయణరావు

63. కవి, వర్మ

64. మధురాంతకం రాజారాం

65. విద్వాన్ వేణు

66. సోంపల్లి బాపయ్య

67. డాక్టరు చిట్టూరి సత్యనారాయణ

68. కొండవీటి వెంకటకవి

69. చిన్నము రామయ్యచౌదరి

70. వల్లభనేని కాశ్వినాథం

# సాహిత్యరంగంలో రంగా

## శ్రీ గొ్రెపాటి వెంకటసుబ్బయ్య

ఆచార్య రంగాను, ఆచార్యునిగా, ఆర్థికవేత్తగా, దేశభక్తునిగా, కర్షకోద్యమ నిర్మాతగా, మహావక్తగా ఎన్నో విధాల ఎంచుతారు.

అయినా ఆయనను సాహిత్యారాధకునిగా ఎరిగిన వారెందరున్నారు? ఆయన ఒక గ్రంథద్రష్టేకాదు, బహుగ్రంథ స్రష్ట. కవితాపోషకుడు. పెక్కు కవులకు కన కాభిషేకం చేసిన భాగ్యశాలి.

అందుచేతనే అన్నాడు అభినవ తిక్కన.—

"నిను దేశభక్తునిగా మె
చ్చిన వారలు కలరు మహి నశేష ప్రజ నీ
వొనరించిన భాషా సే
వ నెఱింగినవార లెన్ని వందలు కలరో?"

ఆయన భాషాసేవ చేయుటయేకాదు, వేంకటశాస్త్రిగారివలె కవనార్థం బుద యించకపోయినా, కవియై పుట్టినవాడు రంగా.

ఆయన ఛందోబద్ధంగా కవిత్వం చెప్పకపోయినా, ఆయన పలుకే కవిత్వం ఆయన జీవితమే ఒక రసకాండ. ఇదంతా కొందరకు ఆశ్చర్యం కలిగించవచ్చు. అసలు మన ఆంధ్రజాతి ప్రవృత్తి తెలుసుకొంటేనేగాని తెలియదు. ప్రపంచంలో నేమి, భారతభూమిలోనేమి ప్రతి జాతికి ఒక ప్రవృత్తి ఉంటుంది.

తమిళులకు కార్యదీక్షత, గుజరాతీయులకు వాణిజ్య మనఃప్రవృత్తి. మహా రాష్ట్రులకు వీరత్వం, బెంగాలీలకు భావుకత, ఆంధ్రులకు నవ్యత విశిష్ట లక్షణాలు. ఆంధ్రజాతి ఉద్వేగపూరితమైన జాతి. ఎల్లప్పుడు నవ్యత్వాన్ని కోరుతుంది. కన పడిన కొత్తదాన్ని చూచి, ఇంతలోనే అది పాతబడిపోయిందని పరిహసించి, మరొక కొత్తదాని కోసం పరాసుజాతివలె పరుగెత్తుతుంది. ఇదే మతంలోను, వాస్తు శిల్పం లోను పూర్వం జరిగింది.

భారతభూమిలోనే గాక, ప్రపంచంలోకూడా ఏ క్రొత్తది పుట్టినా తెలుగుగడ్డ మీదకు రావలసిందే.

రాజకీయంగా, జస్టిస్‌పార్టీ అనంతరం సోషలిజం, కమ్యూనిజం, రేడికలి జమ్, ఫార్వర్డు బ్లాకు ఆంధ్రజాతిలో వ్యాపించినవి.

అట్లాగే మన సాహిత్యంలోకూడ ప్రపంచంలో పుట్టిన ప్రతి పద్ధతి మన కవులు స్వీకరించారు. ప్రథమంగా రొమాంటిసిజం, అభ్యుదయ కవిత్వం, సర్రియ లిజం, బ్లాంకువర్సు, ఫ్రీవర్సు.

ఈ నవ్యతే మనది కవుంజాతిగా రూపొందడానికి కారణం. తమిళులు గాయ కులు. మళయాళీలు నాట్యనిపుణులు. ఆంధ్రులు అచ్చంగా కవులు. కవితలో కొత్త పోకడలు పోవుటలో మనకు మించిన వారు లేరు.

ప్రపంచమంతా లయబద్ధం. ఈ సంగతి ఆంధ్రులు గమనించినట్లు అన్యులు గ్రహించివుండరంటే అతిశయోక్తి గాదు. ఎందుచేతనంటే మన సాహిత్యమేగాదు, మన జీవితమే లయబద్ధం. మన మాటలన్నీ లయబద్ధాలే. మన సామెతలే సాదృ శ్యం. మన సామెతలే గాదు, మన మాటల్లోకూడా యతిప్రాస లధికంగా అప్రయ త్నముగా వుంటాయి.

ఆంధ్రులు అలంకార శాస్త్రాన్ని గాని, వ్యాకరణాన్నిగాని ఎన్నడూ పాటించ లేదు శ్రద్ధతో. వారు పాటించిందల్లా ఛందస్సు. అందుచేతనే ఛందస్సును గురించి అనేక గ్రంథాలు రచించారు.

సంస్కృత సంప్రదాయాన్ని పాటించినా, సంస్కృతంలో లేని యతిప్రాస లను మనం తెచ్చుకున్నాం.

వేయేల? పాశ్చాత్య, ప్రాచ్యభాషల్లోని కవితలో ఎక్కడా లేనంత ఛందో వైవిధ్యం మన తెలుగులో వుంది.

ఇది తెలుగువారు కేవలం కవులనటానికి మరొక నిదర్శనం.

శబ్దంమీద మనకున్నంత మోజు మరెవ్వరికీ లేదు. శబ్దాలంకారాలకు ఆంధ్రులు చెవికోసుకుంటారు. ఆంధ్రులకు భాగవతం అంత ఇష్టం ఇందుకే.

నియమపాలనమనేది మనకు సంబంధించికాదు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు మనకు జన్మతః వచ్చినవి. నిర్లక్ష్యమే మన లక్ష్యం.

వాస్తవికత మన వ్యక్త్వధంకాదు. అందుచేత బెంగాలీలవలె కలలు కనడమే మన జాతి లక్షణం. కనుకనే రాజకీయాల్లోను, వ్యాపార వాణిజ్యాల్లోను, పరిశ్రమల్లోను మనం రాణించలేము.

వాస్తవానికి భిన్నంగా చూడడమే మనజాతి లక్షణం. అందుచేతనే మనం కవులుగా రాణించగలుగుతున్నాం.

ఆంధ్రదేశంలో ఉన్నంత కవులు భారతదేశంలో ఏ ఇతర ప్రాంతంలోను లేరు. ఈ సంగతి కృష్ణశాస్త్రిగారిట్లా అన్నారు. "ఇప్పటి ఆంధ్రకవిత్వాని కున్నంత వైవిధ్యం, సంపద మరి ఏ ఇతర రాష్ట్రీ కవిత్వానికి లేదని గట్టి నమ్మకం. అసలు తెలుగునాటి సాహిత్య కేదారంలో కవిత్వపు పంట ఎప్పుడూ ఎక్కువే."

ఈ సంగతే ఆంధ్రులంతా కవులేనని పరిహాసంగా రాజాజీ అన్నాడు.

'మీ ఆంధ్రదేశంలో ప్రతివాడు కవిగానే కనపడతాడు.' అని హరీనాంధ్ర ఛటోపాధ్యాయ్ వాస్తవంగా అన్నాడు.

"కొయ్య బొమ్మలను మెచ్చు కండ్లకు
కోమలులు సౌరెక్కునా?" —గురజాడ

లోకంలో పద్యం వ్రాసినవాడే కవి అని, గద్య రచయిత కవి కాడని సాధారణంగా అంటారు.

పద్యమంటే ఛందోబద్ధమైంది. ఛందోబద్ధమైనది కంఠస్థం చేయటానికి అవకాశమున్నది కనుక పూర్వకాలంలో ప్రతిదీ పద్యములో వ్రాశారు. పద్యంలో చెప్పినంత మాత్రాన కావ్యం కాదు. ఆంధ్రనామ సంగ్రహం, లీలావతి గణిత శాస్త్రం కావ్యాలని ఎవ్వరూ అనలేరు. అవి పద్యగ్రంథాలు. కనుక పద్యాలు చెప్పిన పద్యకర్త అవుతాడుగాని కవికాడు.

కాని పూర్వం గద్యం, పద్యం ఇంత విభేదంగా లేవు, గద్యంలో ఒక విధ మైన రీతి, గతి వుండేవి.

గురుతర పద్యకవితకు నన్నయ గురువైనట్లే, గద్యకవితకూ గురువు.

"గద్యం పద్యం చమిశ్రంచ కావ్యాదిత్రి విధంస్మృతమ్" గద్యము పద్యము, గద్య పద్య మిశ్రమము అని కావ్యాలు ముత్తెరగు లన్నాడు పురాణ కర్త.

'A Versifier can not be a poet, a poet may not be a Versifier.'

"పద్యం వ్రాసినవాడు కవిగాడు. పద్యం వ్రా మాత్రాన కవికాక పోడు. కవి అంటే కవితాత్మ గలవాడు. పద్యం రాయనీ, రాయకపోనీ."—షెల్లీ.

'కవిత్వాన్ని నిర్వచించటం కష్టం. కాని కవిత్వాన్ని గుర్తించటం సులభం' అన్నాడు ఒక ఆంగ్ల విమర్శకుడు. కవిత్వం గణంలో లేదు, గుణములో ఉన్నదని గుర్తించాలి. 'రస సిద్ధాయః కవయః, రస సిద్ధులే కవులు.

పద్యరచన సుళువు. రసవంతమైన వచన రచన చాలా కష్టం. కనుకనే "గద్యం కవనాం నికషంవదన్తి" గద్యం కవులకు ఒక పిడిరాయన్నారు.

మన ఆధునిక గద్యరచనలో అద్భుత కవితా కౌశలం చూపబూనిన కొద్ది రచయితల్లో చిన్నయసూరి, అనంతకృష్ణశర్మ, రామలింగారెడ్డి, శివరామశాస్త్రి, ముట్నూరి, బాపిరాజు, చలం, రంగా ప్రభృతులను చెప్పవచ్చును.

రంగాజీ గద్య కవితకు కొన్ని పసిడితునకలు—

"అందె సుబ్బారాయుడు ఆదర్శ శ్రమజీవి. ఆయన మా యింటికొస్తే గో భూమి కొక సొంపు, భారతీదేవి కొక యింపు, నాకొక భావాల కెంపు యిచ్చి పోతాడు."— (వాహిని 22-1-1939)

"పల్కితినట పటుతరముగా! చెప్పితినట నూతన ధర్మాలను. ఆ గిల్డు సోషలిస్టు సిద్ధాంతముల, నిప్పితినట ధైర్యసాహసాలతో."

ఇట్లు క్రియపదము ముందుంచి 'పలికెడిది భాగవతమట. పలికించెడివాడు రామభద్రుండట' మాదిరిగా పలుకును. పోతన ఆయన అభిమాన కవి. ఆయన

భాగవతాన్ని బాగా చదివినాడు. సందర్భానుసారముగా ఆయన వచనలను ఉదహరిస్తాను. తెలుగు నుడికారము ఆయన సొమ్ము.

మనము మాట్లాడేది తెలుగుకాదు. తత్సమము, తద్భవ మాటలందికం. సంస్కృత శబ్దాలమీద వున్న మోజు తెలుగుమీద లేదు. కారణం సంస్కృతం బాగా చదివినవారు తెలుగులో కవిత్వం చెప్పటమే. వైదికులు సంస్కృతంలోతప్ప తెలుగులో కవిత్వము చెప్పలేదు. అసలు బ్రాహ్మణులకు తెలుగంటే శూద్రభాష. బువ్వంటే తప్పు, అన్నమనాలి. బువ్వ ఏమిటిరా శూద్రునికివలె అంటారు. వారు అన్నం తినేటప్పుడు ఆంధ్రం ఉచ్చరించరాదు. ఉప్పు అనరాదు లవణం అనాలి. ఆవుపేడ గోమయం అనాలి. కొడుకు అంటే తప్పు. కుమారుడనవలె. ఇట్లు సంస్కృత పదభూయిష్టం చేశారు తెలుగు భాషను. అందువల్ల అనేక తెలుగు శబ్దాలు లుప్తమై పోయినవి.

ఈనాటి రచయితలకు గ్రంథ రచనయందున్న అభిలాష, అర్హతా సంపాదన యందు లేదు. తెలుగువారమైయుండి తెలుగు నేర్చుకోవాలా? అన్న నిర్లక్ష్యమే అందుకు కారణం.

తెలుగు అనగా, తెలుగు మాటలు మాత్రం కావు. వాటి విన్యాసము, అన్వయము, దేశభక్తి, పలుకుబడి తెలుగుగా నుండుట.

ఆయన కేవలం గద్యరచయిత కాదు. ఆధునిక గద్య కవితా నిర్మాణానికి మెరుగులు దిద్దుతున్నవారిలో మేటి. ఆయన రచనలో తెలుగుదనము, కమ్మదనము కలిసి పసిడికి పరిమళ మబ్బినట్లుండును.

భావావిష్కరణంలో, వాక్యవిన్యాసములో తెలుగుదనం తేజరిల్లుతుంది. తెలుగు వాడకం తెలిసి వాక్యరచన చేయటంలో ఆయన ప్రతిభ అనన్యం.

తెలుగు నుడికారపు సొంపు ఆయన ఎరిగినంతగా ఎరిగిన వారెందరో చెప్పటము కష్టము.

ఆయన పలుకులు పసందు, వానిని మించిన మనస్సు, మంచితనం, ఆయనను మంచి కవిగా చేసినవి.

ఆయన సాహిత్య సంపదను గురించి, ఆత్మార్పణము గావించి 'ధర్మజ్యోతి' వెలిగించి 'రాష్ట్రగానము', ఉదయగానముచేసి 'ఆత్మకథ' అల్లి తపస్సిద్ధి గాంచిన గాంధీ ఆస్థాన కవి. అభినవ తిక్కన ప్రశంస పరిశీలించ తగినది.—

"చక్రవర్తుల ముత్యాలశాలలందు
అగ్రహారాల నడికొప్పులందు గులుకు
కవులు కనలేని తెలుగు చక్కదనమ్ము
చూఱలాడిన శారదాసుతుడ వీవు."

"పల్లెటూరంబుట్టి పల్లెల సేవించి
బీదవారి కులము పేదవారి
పలుకు గుర్తెఱింగి పసగల జాతీయ
రచనలు చేయు సుకవి రాజ వీవు.

"తెలుగు నుడికారమందున్న మెలపు నెఱిగి
తెలుగు హృదయంబందున్న తీపి నెఱిగి
తెలుగు సంస్కృతి యందున్న చెలువ మెఱిగి
తెలుగునకు నీవు సరిక్రొత్త వెలుగు లిడితి."

ఆంధ్రదేశంలో పత్రికలు ప్రజావార్తలకు రైతుల కష్టనష్టాలకు, వారి బాగోగులకు తగువిధముగా ఉపకరించటం లేదని భావించి ఆయన వాహిని, గోష్ఠి, క్రాంతి పత్రికలను స్థాపించి పత్రికా ప్రపంచంలో మార్పు తెచ్చాడు. అనేక మంది యువకులను ప్రోత్సహించి రచయితలుగా చేశాడు.

మన సాహిత్యంలో కష్టజీవులను గురించిన కథలు లేనే లేవు. రాజులు, రాణులు, గంధర్వాంగనలు, కల్పిత మానవులు కావలసినంతమంది వున్నారు.

మహాత్ముడు గుజరాతీ రచయితలకు ఒక సలహా ఇచ్చాడు. వారు ఊహాగానము చేయక, రైతు జీవితానికి సంబంధించిన సాహిత్యాన్ని సృష్టిస్తూ, వారి ఆలోచనలు పవిత్రమగునట్లున్నూ, వారి సంపద పెంపొందునట్లు ప్రయత్నిస్తూ, సజీవమగు భాషలో వారికి పాటలు, పదాలు, రచించి అభివృద్ధి పంథాలోనికి తెమ్మని తెలిపారు.

రంగాగారు కోరేదీ ఇదే.

ఆయన రైతు గ్రంథమాలను నడిపించుటలో ఉద్దేశం, ఆంధ్రకవులను ఆయన ఎట్లా ఆదరిస్తున్నది, ఆయన వాక్యాలను గమనించుదాము.

"నూతన సాహిత్యం కావాలంటున్నాం. దాన్ని ప్రసాదించేవారే అరుదగుచున్నారు. సృజించిన వారిని గుర్తించు వారంతకంటే కన్పించటంలేదు."

"ఎందుకీ నూతన పంథా? విభూత్న సాహిత్యం? ప్రజానీకపు జీవితాన్ని ఆశయాలను ప్రకటించడానికి! వానికి మెరుగు పెట్టుటకు! జనసామాన్యానికి క్రొంగ్రొత్త భావపరంపరలు, కార్యోత్సాహము, శక్తిసామర్థ్యాలను పురికొల్పుటకు."

"రాజులు రాణులుగారు, మనకు నాయకీ నాయకులుగా వుండదగ్గవారు".

"యీనాడు కష్టజీవుల కథలు కావాలి! చెమట బిందువుల మాణిక్యంపు దధితులు ప్రకటింపాలి. పొలములో భూమిపై పొరాడువారు, చేలల్లో చెరలాడువారు బీళ్లల్లోలో గోమాతలకు తోడగువారు, డొంకలలో పచ్చిచొప్ప మోతల సంగీతాన్ని విరజిమ్ముమవారు, నదుల వెంట, కాల్వలప్రక్క, రాళ్లమధ్య, అడవుల చెంత, పశు పక్ష్యాదుల కూటకు కల్గింపువారు, తోడి మానవులకు జీవితాశలను విజృంభింప చేయు వారు. ఆ కోటానుకోట్ల కొలది సాధారణ ప్రజలు, కష్టింపు కార్మిక కర్షకులు, అల సట నెరుగని బిక్కజీవులు, సున్నితమగు జీవతానుభవ మెఱుగని సుతి మెత్తని హృదయాలవారు. ఈనాటి భావ కవులకు, నూతన రచయితలకు, జననాయకులకు, ప్రజా పాలకులకు, మహా ప్రపంచ గంధర్వులకు అర్హమగు నాయికా నాయకులు".

"ఈ సత్యాన్ని మన ఆంధ్రదేశపు కవులు, నాయకులు చాలనాళ్లనుండి గ్రహించిరి. 'గురజాడ' నుండి 'బసవరాజు' వరకు 'సాహితీ సమితి' నుండి 'విశ్వ సాహిత్యమాల' వరకు 'రామిరెడ్డి' నుండి 'జాషువా' వరకు, 'శెట్టిపల్లి' నుండి 'గొట్టిపాటి' వరకు 'చదలవాడ' నుండి 'నాగరాజు' వరకు 'పున్నవ' నుండి 'గరి మెళ్ల' వరకు యీ నవ్యభారత భావాలను విస్ఫూత కాంతుల విరజిమ్ము నూతన సాహిత్య సృష్టిలో ప్రకటించుచున్నారు. ఇందున భారత దేశమున ఆంధ్రకవి నాయకులదే ప్రథమ తాంబూలం.

ఈ పంథాకు వడి, వేగము గన్పించుటకే 'రైతు గ్రంథమాల' 'ప్రథమ పుష్పము' హరిజన నాయకుడు. ఈనాటికి ఆంధ్రులకు ఆదర్శమగు వ్యక్తి. మను ష్యులలో 'సాహితీ ప్రపంచమాల' రెండవ పుష్పము, ఆంధ్రగ్రామ సీమలకు నూతన జీవకళ ప్రసాదించుచున్న 'రైతు భజనావళి' దాని 'సౌరభమాల' నానందించి యింకను ఆంధ్రులు తనవి జెందుటలేదు."

ఆకలి మంటలు పరిచయం నుండి.

మన భాషా సంప్రదాయాన్ని గమనిస్తే, ఇది గేయభాష అని తప్పక అందరూ తలంపక మానరు. తనగీతి అరవ జాతిని గాయకులుగా దిద్దినదని కవి అంటున్నాడు.

వాగ్గేయకారులగు త్యాగరాజు, దీక్షితులు ప్రభృతులు తెలుగులోనే గేయాలను రచించారు. అరవవారు కూడా కొందరు తెలుగులోనే గేయాలను రచించుట గమనింప తగినది. పాడేవారిని, వినేవారిని తన్మయం కలిగింపజేసేవి ఇవే. మన గేయాలు లయబద్ధంగా వుండి, సంగీతంతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటమే గాక, హృద్య కవిత మాదిరి మూలాన్నాయి, శబ్దాడంబరం లేక, తేటతెల్లంగా అందరకు అర్థమగును. అందుచేతనే ఇది ప్రజల పెన్నిధిగా పెరిగింది.

మార్గ కవిత రాజకీయమై పెరిగితే దేశకవిత ప్రజా శ్రేయమై వర్ధిల్లింది. ప్రజల నిత్యజీవితం ఇందులోనే పరికించగలము.

ఈ సంగతి గ్రహించి మన రంగా అనేక కవులచే గేయాలను రచింప జేశాడు. వాటి నన్నిటిని 'రైతు భజనావళి' అను పేరుతో ప్రచురించాడు.

ఏ ఉద్యమ సిద్ధికైనా సాధారణ ప్రజల కందుబాటులో వుండే మాటలు, పాటలు, గేయాలు అవసరం. ఆ అవసరం తీర్చటానికి రైతుభజనావళి 22-4-1934 న ప్రథమంగా ప్రచురణ అయ్యింది. అందులో గరిమెళ్ల సత్యనారాయణగారి 'అన్యాయ కాలంబు దాపురించిందిపుడు, అందరము మేలుకోవాలండి' అనేది తలమానికము.

తర్వాత బయలుదేరాడు. విప్లవ కవి శెట్టిపల్లి. 'అగునా జీవాలు సాగునా లోకాలు, రాజుగా మనమెంచి రైతు గొల్వకపోతే' అని సవాలుచేస్తూ "జయభేరి మ్రోగింప వో తెలుగురైతా, జయనామముల బాట సాగిరమ్మింక' అని జయలక్ష్మిని సాక్షాత్కరింప చేయసాగాడు.

అటు తర్వాత వచ్చాడు వల్లమానిన ముసలాయన, ఈ దక్షిణా పథములో జమీందారీ ఉద్యమ యుగ నిర్మాత నెల్లూరి వెంకట్రామా నాయుడు, 'నూర్కొద్ది జమీందార్ల పొందు' అంటూ. ఈ నినాదమే భారతావని అంతటా ప్రచారమై జమీందారీ విధానము రద్దుకు రాజబాట ఏర్పరచింది.

రైతాంగ భజనావళిలోని ఒక్కొక్క పాట పది ఉపన్యాసాల పెట్టు. ఇది దేశమంతటా అంతులేని ప్రచారం చేసింది. 30 పేజీల నుండి 125 పుటల వరకు

పెరిగింది. బుల్లి పదాలనుండి రణభేరి వరకు పెరిగి ప్రఖ్యాతి గాంచింది. ఎన్నో ముద్రణలను గాంచింది. దీనినుండి ఎందరో గేయాలను వేరువేరుగా అచ్చొత్తించు కున్నారు.

ఇంతేకాదు, గోగినేని వెంకటసుబ్బయ్య 'బుర్రకథలవారు', 'చిట్టాల భజన సమాజము' వారు, దివితాలూకా 'బాండువారు', 'హచ్చిన్సను' రికార్డులవారు, నానా ప్రచారకులు, రైతాంగ విద్యార్థులు రైతు రక్షకపాత్ర పళముచారు, మూల మూలకు కూడ తీసుకొనిపోయారు.

ఈ రైతాంగ మధుగుచ్ఛ మాధుర్యముగాంచే "క్రాంతి గీతాలు కార్మిక భజనావళి చేనేత భజనావళి" 'ఎన్నిక పాటలు' మొదలగునవి ఎన్నో బయలు దేరినవి.

రైతాంగ భజనావళిలోని కొన్ని గేయాలు దేశ విదేశ భాషల్లోకి కూడా అనువదింపబడినవి. ఆంధ్రులకు అజరామరమైన కీర్తి ప్రతిష్ఠలు తెచ్చినది. కాంగ్రెసు కర్షకోద్యమాలకు అఖండ బలమిచ్చి యెన్నికలల్లో జస్టీసుపార్టీని చిత్తు చేసినవి.

'ఆకలి మంటలు' 'ఆంధ్ర విద్యార్థి' మొదలగు రచనలు ఈ రైతు గ్రంథ మాలా సౌరభములే.

నిత్యం నూతన పోకడలుపోవు ఆచార్య రంగాకు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవి (1946) అలంకరించిన అనంతరం సాహిత్యముద్వారా కూడా సేవ చేయాలని అభిలషించారు.

అభ్యుదయకరమూ, విప్లవాత్మకము, జాతీయమునైన గాంధేయ సాహిత్య రచన కొరకు స్థాపింపబడినదే రాజకీయ విజ్ఞాన పరిషత్తు.

ఈ పరిషత్తుద్వారా 'జాతీయ విజ్ఞానము' అనే సాహిత్య పత్రికను స్థాపించి తద్వారా సాహిత్యారాధన చేయ సంకల్పించి, ఆంధ్ర దేశమునందలి ప్రముఖ రచయితల వ్యాసములు సేకరించి ప్రచురించిరి. దాని సంపాదకుడు ఏటుకూరి వెంకటనరసయ్యగారు.

'దోయిలి పత్ర ఫలపుష్పతోయమైన
నీయనేరని దేశమందే విధాన

పుట్టగలరు, స్వతంత్రులౌ దిట్టకవులు
లేరు లేరంచు గినిసిన లేచిరారు.' —కవిరాజు

ఆయన పర్యటనలో కనుపించిన కవులను ఆదరంతో పలకరిస్తూ ప్రోత్సాహ మిస్తాడు. అమూల్యమైన సలహాలిస్తూ వుంటాడు. కొందరకు ఆర్థికంగా సహాయం చేయడంకూడాకద్దు. కవులను, వారి పుస్తకాలను చాలామందికి పరిచయం చేశారు. మహాసభలలోను పత్రికలలోను ప్రశంసిస్తూ ప్రోత్సాహమివ్వ వలసిందని ప్రజలను కోరుతారు. ఇంతకంటే కావలసిందేమిటి ?

సాహిత్యంలోగాని, సంఘంలోగాని, సానుభూతి లేకపోతే వ్యర్థం.

రంగాగారు అధిక సానుభూతితో అనేక కవుల గ్రంథాలను చదివి పత్రిక లలో ప్రచురించటం పత్రికా పాఠకులకు పరిచయమే.

ఏటుకూరి వెంకట నరసయ్యగారి సన్మాన సంచికలో వారు సాహితీ సమా లోచన చేశారు.

పైడిపాటి సుబ్బరామశాస్త్రి గీతాలను ఎంతో సానుభూతితో వాహిని ఆంధ్ర ప్రదేశ్ అవతరణ సంచికలో ప్రచురించారు. 'శ్రీపతి భారతీదేవితో' ఒక ఆంధ్ర యువతి "అమ్మా ! మాటలే మంత్రాలు" అని చెప్పి వెళ్ళినారట. ఆనందోలికలలో ఊగుతూ శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి 'గీతావళి' గానం చేస్తూవుంటే, పదేపదే ఆ మంచి మాట జ్ఞప్తికి వచ్చింది. ఈ గీతావళిలోని ఆలోచనలన్నీ ఎటుకలో నున్నవే. యువహృదయాల్లో, ఉత్సాహపూరిత గళాల్లో, నవ్వులొలికే పెదవుల్లో యీనాడు కదలాడేవే. అయితే ఏం ? సుబ్బరామశాస్త్రి 'భారతికి' వినతి సేయుటలో హృదయాన్ని పాట లొలికించు కోవాలనే కుతూహలాన్ని నృత్యం చేయిస్తున్నై వెలికి వస్తున్న యీ శ్రుతిమంత్రాలు. మనద్వారా జాతిని ఉత్తూతగా నడిపిస్తున్నా మంటున్నై. ఈ పాటలతో మరల కాంతిచ్ఛాయలు మనలోని 'వీణెల'ను పలికిస్తున్నై అనుక్షణమూ మన మనస్సులలో మెలగుచున్న కోరికల కెంతటి అందచందాలు వారు తీర్చి దిద్దిరో గమనిద్దాం" అంటూ వారి గేయాలను ఉదహరించి అందలి ఇంపుసొంపులను పీనులకు విందొనర్చునట్లుగా చెప్పి, చివరకు ఇట్లు ముగించారు. "ఇంతటి కమ్మని కవనాన్ని యీ గీతావళి రూపంలో మన కందిస్తున్న శ్రీ సుబ్బ రామ కవీంద్రున కివే నా నమోవాకములు, శుభాశీస్సులు."

కవికి ఇంతకంటె మహాభాగ్యం ఏం కావాలి!
రంగాజీ హృదయావిష్కరణ కింకా కావాలా సాక్షి?

"నవరసమ్ములు నాట్యమాడగ
చివురు పలుకుల చెవులు విందుగ
కవితల్లి క్లాంత హృదయుల
గౌరవింపవె తమ్ముడా!"

—రాయప్రోలు

రాజకీయాల్లో రాత్రింబవళ్ళు తెల్లాడే రంగాకు కవులతో సంబంధమేమిటి? వారిని సన్మానించడమేమిటని ఆశ్చర్యం కలగవచ్చు. అందుకు ఆయన సమాధానం.

"కవీశ్వరులు, రచయితల సహాయము, సహకారము, అమితంగా కావలసి యున్నది మన ప్రజోద్యమాలకు. అందులకే మహాత్ముడు, విశ్వకవి రవీంద్రుని అంతగా పూజించెడివారు. సరోజినీదేవిని అంతగా ప్రేమించెడివారు."

మాతృభూమి 3-4-1949

అందువేతనే రైతాంగ విద్యాలయమునందు 1935 నుండి కవి సన్మానం చేయజొచ్చిరి.

నిద్రాణమైన రైతాంగాన్ని మేలుకొల్పి సాయం చేయాలనే తలపుతో 1938 లో ఆంధ్రదేశములోని కర్షక కవులను సన్మానం చేసెను.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు దేశభక్తులైన, శ్రామిక ప్రజాభిమానులై సాంఘిక విప్లవమును చతురముగ నార్జించి సుత్సాహులైన, కవులను, గాయకులను, జాతీయాభిమానమనే సాధారణ ఐక్యతా వేదికపై చేర్చి, పరస్పరాభిమానం కల్గించి, పరస్పర భావ పరిచయముల ద్వారా, భావ చేష్టల పొందిక ద్వారా, యెల్లెల్లో మన దేశాన్ని, ప్రజలను, సంఘమును అభివృద్ధి మార్గములో తీసుకొని వెళ్లటగు వీలగునో ఆలోచన చేయుటగాను శ్రీయుత పెనుమచ్చ సత్యనారాయణరాజుగారి అధ్యక్షత క్రింద 1947 సెప్టెంబరు 10 తారీఖున మద్రాసులో అపూర్వముగా సభ జరిగినది. ఇందులో అనేక ప్రఖ్యాత కవులు, గాయకులు పాల్గొనుటతోపాటు సన్మానింపబడిరి.

అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తిని నిడుబ్రోలులో 20 వేల కళాభిమానులు కనకాభిషేకం చేసిరి.

అందులో పాల్గొనిన ప్రముఖులలో ఆచార్య రంగా ప్రత్యేకత ప్రస్ఫుటమైనది. అందులో ప్రముఖ పాత్ర ఆయనదే.

కవి గజారోహణముచేసి వూరేగేతూవుంటే, కవి యెడల గౌరవము సూచిస్తూ, ఆయన పాదచారియై ఆ ఉత్సవమునకు మరొక శోభ కలిగించిన మనిషి మన రంగా. 'తపసిద్ధి'లో అభినవ తిక్కన ఈ ఘట్టాన్ని ఇట్లా పేర్కొన్నాడు.

"రంగా యంతటివాడు రివ్వుమని చే
రన్వచ్చి యూరెల్ల మా
రంగ ప్రాగ్రసరుండుగా వెలసి మ
త్కావ్య ప్రశంసల్ సభా
రంగంబెక్క వెలార్చి భూరి సుమనో
రాశిన్ ననున్ దేల్చి స
ర్వాంగణమ్మగు శోభ దెచ్చెను మద
యం బిమ్మహాలక్ష్మికిన్.
కడపన్ నిద్దురలేచి హస్తిపురిలో
కాఫీని సేవించి చే
రెండు రొట్టెన్ కెయిరో కడన్నమని, పా
రిస్ పూటకూ టింటిలో
గడుపున్నింపి హితోక్తులాడును ట్రుమన్
కన్పించు దర్బారులో
నిడుఁబ్రోవ సుతఁ డెట్లా వచ్చె జననీ!
నీశక్తిఁ గాకుండినన్."

పలనాటి వీరభారత కర్త కవిబ్రహ్మ ఏటుకూరి వెంకటనరసయ్యగారిని సన్మానం గావించుటకై యెంతో పూనికతో ప్రయత్నం గావించిరి.

కాని మన దౌర్భాగ్యముచే, ఆ కవి అకాల మరణము నొందెను. ఆయన దశాహమున జరిగిన సభకు అధ్యక్షత వహించి కవిబ్రహ్మ కవితా మాధుర్యాన్ని వేనోళ్ల ప్రస్తుతించి ఆయన స్మారక సంచిక ప్రకటించుటకు ఈ సాహిత్యారాధకుడు సూచించెను.

"కవితాపూజలు లేని దేశమును మౌర్ఖ్యం బుగ్రభేతాళతాం
డవ నృత్యం బొనరించు, మానవతయున్, నామావశిష్టంబగున్
కవిపూజా పరతంత్రమై నవయుగాంకంబైన మద్భారతం
బవతరించుత సత్యశాంతి సమతా బ్రాహ్మస్వరూపంబునన్"

—జాషువ

వ్యాసాల మాదిరి, వచన రచనద్వారా వ్యక్తులను గురించి వ్రాయటం పద చిత్రమంటారు. (Pen pictures) ఆంగ్లంలో ఇటువంటి పోకడకద్దు. ఇది మనకు నూతన మార్గం. ఈ పంథాను మనకు ప్రథమంగా పరిచయం చేయటమేగాక, ఇందులో పరిణతి గాంచిన రచయిత రంగా.

దేశ ధర్మాన్ని తమలో అంతర్నిహితం చేసుకొని, మానవుల వేదనలన్నిటినీ తమలో ఇముడ్చుకొని వారి కొరకు ఒక దివ్య తేజస్సుతో బాధపడే మహనీయులను గుర్తించలేని స్థితిలో మనమున్నాం. ఆ స్థితిని పోగొట్టి, వారికి తగు గౌరవం, ఆర్థిక సహాయము చేయాలనే తలంపుతో ఆయన అనేక పద చిత్రాలను చిత్రించాడు.

1. భయమెరుగని ప్రకాశం, 2. స్పీకరు సాంబమూర్తి, 3. ప్రజల పండితుడు విజ్ఞాన చంద్రికా విరాట్ స్వరూపుడు హరిసర్వోత్తమరావు, 4. మన చెలుకువాడ, 5. మన శనివారపు, 6. ప్రజల పాటల త్యాగయ్య మన గరిమెళ్ల 7. రైతాంగ పల్కుల బ్రహ్మన్యాపతి 8. రైతుల ప్రాణం రామానాయుడు మొదలగు దేశారాధకులను గురించిన పదచిత్రాలు ఆంధ్ర సాహిత్యములో ఆణిముత్యాలు. ఆ నామకరణంలో ఎంత సార్థకత, సానుభూతి, సౌహార్ద్రము, సౌజన్యము వున్నవో గ్రహించ తగినవి. ఆచార్య రంగా ఆప్యాయత మాటల మార్దవము, మంచి మనస్సు మనకు ఇందులో అధికంగా గోచరం కాగలవు.

ఆయన శైలి, సొంపును గ్రహించండి.

"ఎందరో పాటలు, పద్యాలు రచించినారు; పాడినారు. మరెందరో ఉపన్యాసాలిచ్చినారు. నాయకులైనారు. ఉద్యమము నడిపినారు. పెత్తనానికి వచ్చారు. అట్టివారిలో నే ఒక్కడనే కాని, అప్పటి మూలకందమగు పలుకుల నిచ్చిన వారే ముఖ్యులు. అటుల తన పలుకే బ్రహ్మవాక్కుగా ప్రసాదించిన మహనీయుడు, ఆంధ్ర కవిశేఖరుల ప్రాణధనము మన రామానాయుడు ...సొత్తునకేమి ? ఆయనకు

క్రోటీశ్వరులం కందరాని సొత్తు సంప్రాప్తమగుచున్నది. నాబోంట్లందరు ఆయన సొత్తే."

ఆచార్య రంగా రాజకీయ జీవితం 1923లో ప్రారంభమైనది - ఆనాటి నుండి ఆయన ఎందరినో కలుసుకొంటున్నాడు. ఎందరితోనో కలిసి పనిచేశాడు. వారి తత్వాన్ని, దృక్పథాల్ని మార్చుట కెంతో కృషి చేశాడు. "కాంతులు వెలెగ్రక్కు-విలువగల మణులెన్నో చీకటులచిమ్ము సముద్ర గర్భమున దాగియున్నవి. సౌందర్య మున కాలవాలమగు కుసుమము లెన్నో నట్టడవి యందు నిరర్థకమగు చున్నవి." అని 'థామస్‌గ్రే' అనినట్టు ప్రతిభావంతులెందరో గలరు. వారు తమ కార్యాలను లోకానికి చాటాలని చేయరు, వారిది కేవలం సేవా ధర్మమే. అందులో అనేకులు చేయూత లేక చిక్కి శల్యావశిష్టులై యుందురు. వారికి చేయూతనిచ్చి వారి సేవ పొందాలి.

ఇటువంటివారిని గురించి ఆయన అనేక వ్యాసాలద్వారా లోకానికి వెల్లడించారు.. వారికి చేయూతనివ్వ లోకాన్ని హెచ్చరించాడు.

"పేరమెరుగని రైతు రక్షకులు" (1-10-1937 చిత్రగుప్త) అనే మకుటంతో గ్రామాల్లో ఉచితంగా దీక్షతో వైద్యం చేయువారి నెందరినో లోకానికి వెల్లడించారు. అందులో వడ్డూరు రాజులు, పిట్టపాలెపు వైద్యులు, నిడుబ్రోలులోని ఓరుగంటి రత్తయ్యల దీక్షాదక్షతలు వేయిముఖాల వెల్లడించాడు. ఇటువంటి ఘన వైద్యులెందరో మన గ్రామసీమలలో కలరు. వారు పేరు ప్రఖ్యాతులకై గాని, ధనధాన్యాదులకై గాని ప్రాకులాడక పలువిధముల వండితులకు సేవ చేయుదురు. అటువంటి వారిని లోకానికి వెల్లడించి మన వైద్యాన్ని కాపాడుకోవాలి. పెద్ద పెద్ద వారిని గురించి, రాజకీయ నాయకులను గురించి వ్రాయువారు కలరుకాని, పల్లెల్లో అనామకులై, అనాథ సేవ చేయుచున్న సేవకులను గురించి వ్రాయువారరుదు. అటువంటివారిని అభివృద్ధి పరచాలనే ఆచార్యుని అభిప్రాయము.

ఇటుల రైతు రక్షకులు, నిరాడంబర ప్రజాసేవకులు, నామరూపాలు లేక నశించిపోయిన కాంగ్రెసు సత్యాగ్రహపరులను గురించి, ఇంకా ఇతర సేవకులను గురించి విశేషంగా ఆయన చిత్ర గుప్తలో (1936-40) అనేక వ్యాసాలను ప్రచురించాడు. ఇంకా ప్రజాబంధు, వాహినిలోకూడా వ్రాశాడు. ఆ వ్యాసాలన్నీ బహు ఇంపు, సొంపు గలవి. అవి నిజంగా వ్యాసాలవలెగాక, కథలుగా కనుపించును.

పారకుని కెంతో ఆనందం కలిగించును. వర్ణనలలో ఆయనవన్నె గాంచాడు. శీర్షికలను పెట్టుటలో సిద్ధహస్తుడు. ఆ వ్యాసాలన్నీ సమగ్రంగా సంగ్రహంగా వుండి సౌజన్య, సౌహార్ధములతో రసన ముంచితములు వుండును.

ఉన్నవవారి మాలపల్లి మన నవలలో మకుటాయమానము.

భాషలో, భావంలో అది సరికొత్త సృష్టి. దానిని గురించి అనేకులు వ్రాశారుగాని మాలపల్లి హృదయావిష్కరణ చేసింది రంగాగారే. ఆంధ్రపత్రికలో 1944 జనవరిలో నాలుగు దీర్ఘ వ్యాసాలద్వారా వ్యాఖ్యానించారు. వారి వ్యాస పరంపరలో ఫలశ్రుతి ఇట్లు పలికారు. ఇదియ లక్ష్మీనారాయణగారి సాంఘికతత్వం. ఇయ్యది తనంతట తాను, భారతీయ ప్రజాసామాన్యపు కష్ట పరంపరను గూర్చి కరుణా భరితమగు శ్రీ లక్ష్మీనారాయణగారి హృదయము, సత్యమార్గాన్వేషణలో కన్పడు సందేశము. శ్రీ లక్ష్మీనారాయణగారిక్కి అటు పాశ్చాత్య దేశములందలి సాంఘిక వాదము తెలియును. యిటు మన దేశపు ప్రజల మనస్తత్వమూ, అవ సరములూ తెలియును. మధ్య గాంధి మహాత్ముని దివ్యబోధ వారి హృదయమందు పీఠము గొనియుండెను. వీరి దీర్ఘ విచారపు ఫలితమే దూరదర్శకమగు, మార్గదర్శ కమగు సాంఘిక తత్త్వము. ఇయ్యదియ్యే యీ కాలపు మన దేశమునకు అవలంబ నీయము. రామదాసు, సంగదాసు, జ్యోతి వగైరాల ధర్మ పథము ననుసరించి, వెంకటదాసు యొక్క కార్య చతురత, ఉత్సాహ పరంపర నుపయోగించి, రామా నాయుని కార్య కారితనము చేయూతగొని, కార్మికులకు తగు సేవచేస్తే "నాది హృదయ రాజ్యమని భారతీయ సాంఘిక సేవకుడు పలుకగలడు".

గ్రంథాలు చదివినందువల్ల ప్రయోజనం, దానిలోని పరమార్థాన్ని గ్రహించి తదనుగుణ్యంగా ప్రవర్తించటమే.

మాలపల్లి చదివి చేయవలసిన కార్యాన్ని బోధించి మాన్యత గాంచాడు మన రంగాజీ.

'కవితా వనితా లతా నిరాశ్రయః న శోభయంతే' అన్నారు. అందుచేతనే ఆనాడు కవులు రాజులను ఆశ్రయించి వారి కంకితమిచ్చారు మన మార్గ. కవిత రాజులను ఆశ్రయించి అభివృద్ధి గాంచినదే.

నేడు గ్రంథకర్తలు పెద్దలచేత తమ గ్రంథాలకు పీఠికలను వ్రాయించుట పరిపాటైనది. ఇందులోను ఆయన ఆరితేరినవాడే. ఆయా పుస్తకాలను ఆమూలా

గ్రంథా చదివి అందులోని మెరుగులను పాఠకులకు పరిచయం చేస్తూ రచయితలకు ఉత్సాహ ప్రోత్సాహమిచ్చాడు. ఆకలిపంటలు, కష్టజీవి, కర్షక చరిత్ర, పల్లెపట్టున మొదలగు గ్రంథాల కెన్నిటికో పరిచయ వాక్యాలు పసందుగా వ్రాకిన ప్రసిద్ధుడు.

వివిధ గ్రంథాలపై అభిప్రాయాన్నిచ్చి ఆయా గ్రంధకర్తలకు ఉత్సాహ ప్రోత్సాహమిచ్చుట ఆయన సాహిత్యారాధనలోని మరొక మార్గము. 'మన స్వాతంత్ర సంగ్రామంలో పద కవితం' అనే మకుటంతో ఒక గొప్ప వ్యాసాన్ని మాతృభూమిలో 29-3-49 న ప్రకటించాడు. సాహిత్యాన్ని విమర్శిస్తూ చక్కటి వ్యాసాలు అప్పుడప్పుడు పత్రికలలో ప్రకటిస్తూ వుండేవాడు.

నిరంతర సంచారి అయిన రంగా, ఇన్ని రచనలు ఎట్లు చేశాడా అని ఆశ్చర్యము కలుగుతుంది. ఆయన తాపీగా ముట్లూరి కృష్ణారావుగారివలె కూర్చుండే వ్రాయడు. పట్టాభిగారివలె, మహాత్మునివలె, రైళ్ళలో ప్రయాణము చేస్తుండేటప్పుడు కూడా వ్రాస్తాడు. వ్రాసింది మళ్ళీ మళ్ళీ వ్రాయడు. వీరేశలింగంగారివలె ఒకేసారి, అదేచిత్తు, అదే సాపు. పూర్వం బాణుడు బహువేగముగా వ్రాసేవాడని ప్రసిద్ధి. అట్లాగే రంగా శరవేగముగా వ్రాయగలడు. అందువేతనే ఎన్ని రచనలు చేయ గలిగాడు.

ఆయన గ్రంథాలు దాదాపు 30 వుంటవి. నాకు తెలిసినంత వరకు తెలిపెద.

'హరిజన నాయకుడు' ఇదొక నవల. ఈ హరిజన నాయకుడు సంఘంలో, సాహిత్యములో ఆదర్శ పురుషుడు. సాధారణ రైతాంగముకూడా సులభముగా గ్రహించేటట్లు వివిధ దేశాల రాజ్యాంగ వ్యవస్థలను గురించి 'ఆధునిక రాజ్యాంగ సంస్థలు' అని రెండు సంపుటాలు రచించాడు. రాజకీయ విజ్ఞాన వికాసానికి ఇవి ఎంతో తోడ్పడెను.

పాకిస్థానును గురించినదే వీరి 'పాకిస్తాన్' ప్రపంచం నేడు రెండు భాగాలుగా విడిపోవుచున్నది. కొందరు రష్యాలోని కార్మిక నియంతృత్వాన్ని కోరుకుంటున్నారు. మరి కొందరు అమెరికా, ఇంగ్లాండుల ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షిస్తున్నారు.

రష్యాలోని ఆర్థిక పద్ధతిని, అమెరికాలోని ప్రజాస్వామ్యాన్ని తీసుకొని 'రైతుకూలీ ప్రజారాజ్య' మనే తృతీయ పంథాను సూచించి సంక్షోభిత ప్రపంచము

నకు ఆశాజనకమగు నూతన మార్గము వెలువరించినదే వారి 'రైతుకూలీ ప్రజా రాజ్యము' అనే రచన.

దీనిని మహాత్ముడుకూడా ఆశీర్వదించిన సంగతి సర్వజన విదితం.

రాజకీయ నాయకుల్లో గ్రంథకర్త లరుదు. ఆచార్య రంగా అనేక గ్రంథాలు రచించాడు. ఆయన గ్రంథాలు ఆయన వివిధ విషయ విజ్ఞానాన్ని విశదం చేయును. వాటిని స్థూలంగా ఇట్లా విభజించవచ్చును.

### ఆర్థిక పరిశోధనకు సంబంధించినవి.

ఆయన ఆర్థికవేత్త- ఆర్థిక పరిశోధనలలో అందెవేసిన చెయ్యి. ప్రథమంగా ఆయన రచనలన్నీ ఆర్థిక పరిశోధనకు సంబంధించినవే.

డెల్టా ప్రాంతాలలోను, మెరక ప్రాంతాలలోను, జమీందారీ ప్రాంతాలలోను రైతుల స్థితిగతులనేగాక, దక్షిణ దేశంలో వ్యవసాయ కూలీల ఆర్థిక పరిస్థితులు, నీలగిరివారి ఆర్థిక పరిస్థితులు, చేనేతవారి ఆర్థిక పరిస్థితులు మొదలగు రచనలు చేశాడు.

1. Economic Organisation of Indian Villages I (Deltaic villages) 1926
2. ,, ,, (Dry villages) 1928
3. The Tribes of Nilagiries—Their Economic and Social Conditions 1928
4. The Hand-loom Industry, 1930
5. The Economic condition of the Zamindary Ryots 1933
6. Labour in South India 1934.
7. A Guide to Rural Economics 1938.
8. Agricultural Indebtedness, Remedy etc. Measures.

### రైతులకు సంబంధించింది.

1. Modern Indian peasant 1936
2. Kisan Speaks, 1937.
3. Peasants and Congress, 1937.
4. Philosophy of the Kisan Movement 1939.

Sundarayya Vignana Kendram
Library
26433

5. Kisan Hand Book, 1939.
6. Whether Indian peasant? 1942
7. Kisans and Communists, 1942
8. The peasant and Co-operotive Movement, 1959.

పి. ఆర్. పరుచూరి. రంగాగారు కలిసి వ్రాశారు. సహకార వ్యవసాయం రైతు నాశనానికి మూలమని వివిధ దేశాల్లో సహకార వ్యవసాయం ఎట్లు విఫలమైనదో వెల్లడించారు.

### జాతి వర్గ సూత్ర సంబంధాలు

1. World Role of Natonial Revolution 1942-44.
2. Outlines of the National Revolutionary path, 1942-44
3. Credo of World, 1942-44
4. Colonial and Coloured peoples 1942-44.

మొట్టమొదట రంగా సోషలిస్టు. 1942లో జాతీయవాదిగా మారాడు. అప్పుడు మార్క్సిజాన్ని ఖండిస్తూ గ్రంథరచన నారంభించాడు. మార్క్స్ జాతీయత పనికి రాదని అంతర్జాతీయత అవసరమని, కార్మికులే విప్లవకారులని, రైతులు విప్లవ వ్యతిరేకులని ప్రతిపాదించుచు దానిని ఖండిస్తూ ప్రపంచ సంతతను మనదేశంబును జాతీయత ఎట్లు విప్లవ పంథాయో వెల్లడించాడు పై రెండు గ్రంథాలలోను.

మూడవ గ్రంథంలో ప్రపంచంలోని రైతులు ఎట్లు ఉద్యమాలను నడిపి విప్లవకారులైంది వెల్లడించాడు.

నాల్గవ గ్రంథం వలసరాజ్యాల్లోని రంగుజాతులను గురించి పతిత ప్రజలను ప్రేమతో సహా తర్జుమా చేశాడు.

ఆయన జాతీయవాదే కాదు అంతర్జాతీయవాదికూడా. ఆయన వలన జాతుల స్వాతంత్ర్యరంగం 1942లో స్థాపించి, వివిధ దేశాల్లోని ప్రజాభిప్రాయాన్ని, వలసదేశ స్వాతంత్ర్య సంపాదనకు సుముఖంగా కృషి చేశాడు.

ఈ పుస్తకాన్ని పాన్ ఆఫ్రికన్ కాంగ్రెసువారు ప్రత్యేకించి ప్రకటించు కొనుట దాని ప్రశస్థానాన్ని చెప్పుచున్నది. 'దీనిని క్రైస్తవులు బైబిలు ఎంత పవిత్రమని భావించుకొంటున్నారో అంత పవిత్రంగా పతిత ప్రజలు భావించి

పూజించుకొంటున్నా'రని పాన ఆఫ్రికన్ కాంగ్రెసు నాయకుడు శ్రీ రాబర్టు పీటర్ అబ్రహామ్ ఉద్ఘాటించుతూ దీనిని ఆయన సమీక్షిస్తూ ఇట్లు అన్నాడు:

"భారతదేశపు సమరాంగణపు బురుజునుండి రాజాజీ నూతన ఉద్యమానికి ఒక సిద్ధాంతాన్ని సృష్టించాడు.

వీరి అంచనాన్ననుసరించి ఈ నూతన ఉద్యమానికి వలస ప్రజలనుండి వస్తున్న బలం బ్రహ్మాండంగా వుంది. నిజానికి ఈ రంగు జాతుల వలస ప్రజల స్వతంత్రోద్యమానికి అత్యద్భుతమైన స్తోమతు చిక్కింది."

'ఈ ఉద్యమం వలస దేశాలను కదలిపొండు' (Quit the Colonies) అనే నినాదాన్నిస్తున్నది.

'ప్రపంచ కార్మికులారా ఏకంకండు' అని మార్క్స నాడు నినాదమిస్తే, 'ప్రపంచ పతితులారా ఏకం కండని' నేడు నినాదమిస్తున్నారు రంగాజీ.

ప్రపంచ పతిత దాస్య నిర్మూలనా మహాసృష్టి కర్తలలో ఆయన ముఖ్యుడు.

### వి వి ధ ము లు

1. The Indian Adult Education.
2. The Forests.
3. Why Kısans and Artisans support Gandhian plan.
4 Beware of American 'Manifest Destıny'.
5. Support for Basıc Education Khaddar A. I. V. I. and hand Produced Rice etc.
6. Lıfe and thought of a political Race etc.
6. Life and thoughts of political prisoner (స్వీయచరిత్ర)
7. Students Role in Colonial Revolution and National Congress.
8. Whether students ?

ఆయన గ్రంథ రచననుబట్టి ప్రథమ దశలో ఆయన ఆర్థిక పరిశోధకుడు. ద్వితీయదశలో ప్రచారకుడు. తృతీయ దశలో సూత్రకారుడు అని స్ఫురించును. ఆయన ప్రథమదశలోని గ్రంథాలవల్ల కర్షక కార్మికుల కష్టాలు— తన్ని వారోణోపా ఖ్యానాలు చెప్పి, లోకానికి కనువిప్పు కలిగించాడు.

ద్వితీయ దశలో గ్రంథాలవల్ల రైతు ఉద్యమ అవశ్యకత, తత్వం, ప్రజల ప్రబంధాలు, ప్రయోజనాలు వివరించి, అనేక మందిని ఆకర్షించాడు

తృతీయదశలోని గ్రంథాలవల్ల కేపిటలిస్టు దేశాల సంగతి ఆలోచించి, వలస రాజ్యాలలో జాతీయ విప్లవ పంథాయే తరుణోపాయమని రైతులు విప్లవ వీరులని విశదపరచాడు.

రచయితలు రెండురకాలు. ఉద్గ్రంథాలు రచించేవారు, సాహిత్యానికి నూతన జీవనము యిచ్చేవారు. ఆయన ఆంగ్ల సాహిత్యంలో ఉద్గ్రంథాలు రచించి ప్రపంచ ప్రజలను ఆకర్షించాడు.

ఆంధ్ర సాహిత్యములో నూతన జీవనమును తెచ్చిన వారిలో రంగా, గారొకరు.

# జాతీయ గీతము

జనగణమన - అధినాయక జయ హే భారత భాగ్యవిధాతా !
పంజాబ సింధు గుజరాత మరాఠా ద్రావిడా ఉత్కళ వంగ
వింధ్య హిమాచల యమునా గంగా ఉచ్ఛలజలధితరంగ
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిష మాగే, గాహే తవ జయగాథా!

జనగణమంగళదాయక జయ హే భారతభాగ్యవిధాతా
జయహే, జయహే, జయహే, జయ జయ జయ జయహే
అహరహ తవ ఆహ్వాన ప్రచారిత, శుని తవ ఉదార వాణీ
హిందు బౌద్ధ శిఖ జైన పారశిక ముసలమాన క్రిస్తానీ
పూరబ - పశ్చిమ ఆసే తవ సింహాసన పాశే, ప్రేమహార హయ గాథా!

జనగణ - ఐక్యధాయక జయ హే భారతభాగ్యవిధాతా !
జయ హే, జయ హే, జయహే, జయ జయ జయ, జయహే।
పతన - అభ్యుదయ - బంధురపంథా, యుగయుగధావిత యాత్రీ,
హే చిరసారథి, తవ రథచక్రే ముఖరిత పథ దినరాత్రి
దారుణ - విప్లవ - మాఝే తవ శంఖధ్వని బాజే, సంకటదుఃఖత్రాతా !

జనగణపథపరిచాయక జయ హే భారతభాగ్యవిధాతా
జయ హే, జయహే, జయహే, జయ జయ జయ, జయ హే॥
ఘోర తిమిరఘన నివిడ నిశీథే పీడిత మూర్ఛిత దేశే
జాగ్రత ఛిల తవ అవిచల మంగళ నతనయనే అనిమేషే।
దుఃస్వప్నే ఆతంకే రక్షా కరిలే అంకే, స్నేహమయీ తుమి మాతా !

జనగణదుఃఖత్రాయక జయ హే భారతభాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయహే, జయ జయ జయ, జయహే
రాత్రి ప్రభాతిల, ఉదిల రవిచ్ఛవి పూర్వ ఉదయగిరి భాలే,
గాహే విహంగమ, పుణ్య, సమీరణ నవజీవనరస ఢాలే
తవ కరుణారుణ - రాగే నిద్రిత భారత జాగే తవ చరణేనత మాథా

జయ జయ జయహే, జయ రాజేశ్వర, భారత భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయహే, జయ జయ జయ హే॥

# రంగా!

తెలుగులెంక
శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి

నిను దేశభక్తుఁగా మె
చ్చిన వారలు కలరు మహి నశేషప్రజ; లీ
వొనరించిన భాషా సే
వ నెఱింగినవార లెన్నివందలు కలరో!

చక్రవర్తుల ముత్యాలశాలలందు
నగ్రహారాల నడిబొడ్డులందుఁ గులుకు
కవులు కనలేని తెలుఁగు చక్కందనమ్ము
చూఱలాడిన శారదాసుతుఁడవు వీవు.

పల్లెటూరఁ బుట్టి పల్లెల సేవించి
బీదవారి కులము పేదవారి
పలుకు గుట్టెఱింగి పసగల జాతీయ
రచనసేయు సుకవిరాజ వీవు.

తెలుఁగు నుడికారమందున్న మెలపు నెఱిఁగి
తెలుఁగు హృదయంబునందున్న తీపి నెఱిఁగి
తెలుఁగు సంస్కృతి యందున్న చెలువ మెఱిఁగి
తెలుఁగునకు నీవు సరిక్రొత్త వెలుఁగు లిడితి.

మోసులెత్తిన వేలుపుంబాస మీఁది
తగులమునఁజేసి తెల్గును దెగడువారు
వ్రాయుదురు గాక తెలుఁగు కావ్యమ్ము లినుప
ముద్దలే కాని యవి లడ్డుముద్ద లగునె.

('శబల' 16-3-1941)

# తారహారము

(విజయవాడలో రంగాజీ కాంస్యవిగ్రహ ప్రతిష్ఠాపన సందర్భము)

నెవ్వలు సైఁచిసైఁచి ధరణీ ప్రజయాఁకలి దీర్చుకర్షకుల్
గవ్వకు రువ్వకేని కొఱగాక తపించుతఱిన్ ద దాపదల్
దవ్వులుసేయ నిల్చిన యుదాత్తచరిత్రుఁడ వీవు నీ కథల్
కవ్వముపాటలై శ్రుతిసుఖంబు నొసంగును రంగనాయకా!

తెలుఁగుంగడ్డనె కాదు భారతమునందే కాదు సర్వక్షమా
వలయంబందును "రైతుపాలఁగలఁడెవ్వం" డన్న నిన్నేకదా
తొలుతం జెప్పెద రిట్టినీవు తెనుఁగుందోఁబుట్టువై మా తపం
బులు పండించెతెః వానికిన్ దగినకాపుం జూపె నీ సేద్యముల్.

పదుగురిబిడ్డ లేర్పడి శుభమ్ము లభమ్ములు సందడింపఁగాఁ
జదికినరైతె కార్మికుఁడు, చేవలుదేలిన కార్మికుండె రై
తిదిగద నగ్నసత్యఁ మిక నీప్రజలోఁ దెరగట్టి కయ్యముల్
మొదలిడువారు వెఱ్ఱు లని మూదల చేసిన నిన్ను మెచ్చెదన్

కాఁపులు కూలివాండ్రు నొకకాఁడికిఁ గట్టిన రెండు గిత్తలై
రాపిడిలేనిబాటలః బరస్పర బాంధవసౌహృదమ్ములన్
జూపిననాఁడె నాఁడెములు చొప్పడు వీరి కటుంచు వేఱిమిం
జోపి వెలుంగునిచ్చు జగజ్జోతికి నీకు నీవే నివాళికల్.

మట్ట బిగించి పాఱగొని మాగిలిచెక్కక చెట్టునీడలో
గట్టుననిల్పి చుట్ట లెగఁగాల్చుచు నిక్కట నేర్తువేని నీ
పుట్టి మునుంగు నీబ్రదుకు బోరగిలంబడు నంచు సేద్యపుం
గుట్టెఱిఁగించి కాఁపు నెసకొల్పితివే! తడికయ్యలో దిగన్.

కాఁపుఁదమునమ్ము సార్థకముకావుటకున్ దటినీసమంత మెం
తో పొల ముండుఁగాక పతితో మడికింజని కంకణమ్ములన్
రాపిడిసేయుచుం బసిఁడిరవ్వలగాజులు గుల్క నోర్మికిన్
బ్రా పయి నాటువేయవలెఁ బైదలి యన్న నినున్ గణించెదన్.

ఎకరా లేఁబదిలేవు ముప్పదియులేవే యంచు నిట్టూర్చు క
ర్షకులారా! చిఱుదోఁటతోఁ బదుగురన్ రక్షించు పూరింటి హా
లికునిం జూడుఁడు చెమ్మటల్గురిసి వెల్లిందీర్చు నేర్పున్న ఖం
డ్రిక లేలా తలవ్రేఁగటందు విది ధాత్రిం దేర్చు సూత్రమురా!

ఇది సర్వోదయరుక్ప్రసార మిది వహ్నిజ్వాలికామాలి కా
స్పద నిర్భాగ్యనరప్రపంచముఖ వర్షావారివాహచ్ఛటా
భ్యుదితాసారము ధర్మపూర మఖిలాంహోవాసనాదూర మి
య్యది భావేపరమర్షిబోధిత మహీయస్త్యాగసారమ్మురా!

విత్తము పంచిపంచి యొక విశ్వకళాపరిషత్తు శేముషీ
మత్తకుఁ జేరుగన్న గురుమండలి నిల్పి జగాన కెంత వి
ద్వత్త నొసంగు నంత కొకవందమందుగులు హెచ్చుగాఁదమ
శ్చిత్తి యొనర్చి తీవు పలుసీమల వేసవిపాఠశాలలన్.

ఆచార్యుం డన నీవ! నిన్గొలిచి విద్యాచాతురి న్గన్నవా
రేచాయం గనుఁగొన్న నుందురుకదా యీసీమ; నీశిష్యకుల్
సాచివ్యమ్మున గ్రామపాలనమునన్ సామర్థ్యముల్ నింపి చాం
ద్రీ చారు స్థిరకీర్తికిం గుదురులై దీపింతు రీ ప్రొద్దులన్.

అంతేవాసులపెంపు నీ పెనుపుగా హర్షింతు సేవారత
స్వాంతుల్ దాంతులు ముద్దు సేయఁదగుత్రోవం బోదు వేదిక్షునన్
శాంతిచ్ఛేదకవాదముల్ వొదమినన్ సైరింప-వుర్వీహిత
క్రాంతిప్రేరక ధర్మపీఠమవు రంగా! నీవు ముమ్మాటికిన్.

ఒకటికి రెండుమార్లు సుగుణోత్తరునిన్ నినుఁగేంద్రమంత్రి
పీఠిక నిలుపం బెనఁగిన పటిష్ఠుల కింతయు లొంగవైతి సే
వకు నధికార మడ్డుపడవచ్చు నహంకృతి గూర్పవచ్చు నన్న
కిటుకు గంటివే! యిటు లొనర్చుట కెందఱు నేర్తు రిమ్మహిన్.

క్రొత్త తెలుంగు రాష్ట్రమునకున్ సమకూడిన చీడ లెన్నియో
తుత్తుమురై నశింపఁదఱితో మొనకట్టినజెట్టి వీవు నీ
సత్తయుఁ దేశభక్తియుఁ బ్రసన్నతయుం బ్రతిలేని శౌర్య సం
పత్తియుఁ ద్యాగరక్తియును బ్రస్ఫుటమయ్యె నిటన్ మహామతీ!

నెయ్యపుబల్మి నీవ కననేర్చితి వేటికి లేనిపోని రా
కయ్యము లంచుఁ దమ్ములను గౌఁగిటఁజేర్చితి వాంధ్రకీర్తు లాఁ
బెయ్యల మందలై పరువు పెంచిన యంచలబారులై కడున్
దియ్యనివై మహిస్థలికి నిందికి నిద్దపుడాలు దిద్దంగన్.

ఇంతటి నీకుఁ దెల్గుఁబ్రజయెల్ల ఋణంపడె నన్నమాట క
త్యంతర మెవ్వఁడాడు? నఖిలాంధ్రము నాలుకోట్ల గొంతులన్
బంతులుదీరి గద్యములఁ బద్యములన్ నినుమెచ్చు నేఁడు నీ
కాంతులు నాఁచికొన్న ములుఁగఱ్ఱలె రేపటి రాజదండముల్.

అన్నవు నీవు నాకు నటులయ్యును దమ్మునికంటె లేఁతగాఁ
గన్నుల కింపుగూర్చెదవు "కారణ మెయ్యది దీని" కంచు నా
కున్న మనీషతోఁ దఱచియొక్క రహస్యము గంటి గెల్పులన్
బన్నములన్ సమాన పరిపాటి గణించి గడింతు వీసిరిన్.

ఇది యాత్మోన్నతి లేని వారిసిరి కానేకాద; గీతాజనుఁ
పదమై కృష్ణుడు నిర్వచించిన "స్థితప్రజ్ఞత్వమే" దీనితీ;
రదిరా! నీ వజరుండ వౌట యొక తెక్కా? యేఁబదాఱేమి? నీ
బ్రదు కెన్నెన్నియొ పుట్టుపండువులతోఁ బ్రత్యగ్రమౌ నగ్రజా!

యావద్భారత రాజ్యతంత్రముల నీయాప్తుల్ హలారాధ నా
జీవుల్ కష్టసుఖాభిదర్శనులు రక్షింపన్ బ్రజా గ్రాసవా
సోవైక్లబ్యమొకింతలేమిఁ గనుగొంచున్ దుష్టియున్ బుష్టియున్
బూవుల్ పూవ సుఖింపవయ్య! తెనుఁగుంబుణ్యాంబు
గణ్యాంబుగన్.

నా పల్కుల్ "వితగావు కా" వనుచునన్నా! తెన్నడానుండి నీ
వే పంపించినవాఁడ వుత్తరము లేదే గుర్తు? గర్వచ్యుతిన్
నీ పల్కుం దలఁదాల్తు నీ కలిమికై నీ బల్మికై కూర్చు నా
యీ పద్యావళి సార్థమై భువనసాహిత్యమ్ము సంధిల్లగన్.

సాహిత్యంబును మానవాభ్యుదయ బీజం బన్నసత్యంబు నీ
యూహం దోఁచుటఁ, దద్వికాసమున కీ వుద్యోగముంజేఁత, వా
చా హేవాకవిశిష్ట శిష్టరచనల్ సాగించుటంజేసి నీ
స్నేహంబున్ వరియింత్రు మాదృశకవుల్ శ్రీభారతీ వల్లభా!

నీ జత కెందఱో కవులు నిచ్చలు వత్తురు కావ్యగోష్ఠిలో
రోజులు రోజులే మఱచు రూపము నీది-గుణాగుణజ్ఞతా
రాజితబుద్ధి నీది-రుచిరం బగు తర్కము నీది-కావునన్
రాజులఁ గొండపల్లి బొమరాజుల గన్గొనఁ బొక్కతీరునన్.

కవి యెవ్వఁడో ప్రజాభ్యుదయకాముకధీపరిణద్ధుఁ డెవ్వఁడో
ప్రవిమలవృత్తిదీప్తి పరిభాసురుఁ డెవ్వఁడో నిగ్గుదేన్చు వా
రవనిక్కి నేతలై వెలసినప్పుడె ధర్మవు గెల్చు గారడీ
రవరవ లిచ్చటం బనికిరావు కులమ్ములు గావు నిచ్చెనల్.

శరవేగమ్మునఁ గమ్మ వ్రాసెదవు భాషాదేవి మంజీరమం
జురవంబై మధుకోశమా నదియు-నెచ్చో నేర్చి తీపల్కు? నీ
పరమప్రేమలుగన్న పల్లియల సంపాదించితో, భారతీ
తరుణీ సంతతసాహచార్యముల నందంగంటివో తెల్పవే!

భారతిపొత్తు నీ మధురభాగ్యము-దక్షిణ భారత క్షమా
భారము నోర్చినట్టి గణపత్యవసింద్రుని ముద్దుపట్టి రే
భారమఁ జూతు మా వదినగారి ముఖమ్మునఁ-గాకతీయ రో
చీ రమణీయమై తెలుఁగుసీమ వెలుంగుత! మీకతమ్మునన్

ఇది బృహదాంధ్ర రాష్ట్రమున కీకవి నిన్ బురికొల్పుమాట-నేఁ
డాదవిన పొట్టిరాష్ట్రమున కున్నతి నీఁదగుమాట-తెల్గు సం
పదకు దివాణమై పొదలు 'బస్తరు' నుండి 'కోలారు' దాఁక నొ
క్క దొరతనమ్మె సాగుట జగద్ధిత మౌ ననుమాట సోదరా!

నాలుగుకోట్ల తెల్గు లోకనాయఁకరమ్మున వెల్గునాఁడు పాం
చాలముఁదొట్టి ద్రావిడ, మసాముదొడంగి మరాటదాఁక నీ
నేలకు సాటివచ్చు నవనిం గనుగొందుమె? యాంధ్రజాతికీ
మేలు ఘటింపు మంచుఁ బ్రణమిల్లెద దుర్గకు నిష్టభర్గకున్.

జనని భవాని యీవర మొసంగుట నిక్కము గోలకొండలోఁ
దెనుఁగుమహారథుల్ కొలువుదీరుట నిక్కము-పెద్ద లందఱున్
నిను సముదారవాక్యసరణిన్ బతిమాలి ప్రధానమంత్రిఁగా
నునుచుట నిక్క-మీవు జయ మొందుట నిక్కము నిక్కమగ్రజా!

('వైరవంట' 10-9-1955)

# షష్టిపూర్తి పండువు

చిరతభక్తి గౌరవ విశిష్ట వచః కమనీయ సాహితీ
భరముల గద్యపద్య సుమబంధములన్ రచియించి నేఁడు నీ
యఱువదియేండ్ల పండువున కాయితమైతిమి నెయ్యతియ్యముల్
పఱపి పరిగ్రహింపవె! యుపాయన మీయది రంగనాయకా!

అఱువదియేండ్లు మానవునియాయువునం దొకమెప్పుమెట్టు, త
ద్గరిమము నెల్లవారలును గాంచరు లోకహిత క్రియాధురం
ధరు లనవద్య శీలరుచిధాములు విశ్వజనీన వైదుషీ
పరిణతు లౌ భవాదృశులె పాత్రులు తన్మహనీయలబ్ధికిన్.

అన లడంగి నింగిదెన కఱులుసాఁచిన రైతుపట్ల నీ
చేసిన సేవకున్ విలువ చెప్పఁగఁ జాలినవాఁ డెవండు? నేఁ
డీనకలావనిన్ హలికుఁ డేలుచు నుంట యథార్థ; మాతఁ డీ
వాసికి వచ్చుటెల్ల గుణవన్మణి! నీ కృషిచేతనే కదా!

నీకు సుదాత్తపీఠ మిడనేరదు! లోక మటంచు మామనం
బాకులమౌనుగాని జగదద్భుత నిర్మమతానిరూఢ యో
గాకృతి వైననీ విట రవంత కలంగవు క్రుంగ; వీతపం
బేకొనకొమ్మ జుటించవు లిచ్చి నినున్ దనియింపనున్నదో!

నీ కఠిన వ్రతమ్మునకు నిగ్రహచండిమ కండయై పురం
ధ్రీకుల రత్నమై వెలయు దేవిని భారతి నుగ్గడింతు న
స్తోక శుభానుషంగ పరితుష్టిని మీరిఁక సర్వదేఁడు లీ
లోకము వారికిన్ గనువెలుంగులు కండని పల్కరించెదన్.

('సమదర్శి' 12-10-1960)

# ఆచార్య రంగా

జి. జాషువ

తను రక్తంబు కిసాను రైతుల హితార్థంబై యహోరాత్రుల
ప్పన గావించు కిసానువీరుడవు నిస్స్వార్థుండ నీ వుద్భవిం
చిన యానంద దినంబునం బులకరించెన్ దేశ మోరైతుమం
డనః రంగాభిధః వర్ధిలందగు ననంత బ్రహ్మకల్పాంతమున్.

రైతురంగా యన్న ఖ్యాతి కుళ్ళాయిగా
        దాల్చిన దీన బాంధవవిభుండు
బాపూజి దివ్య జిహ్వా ప్రశంశలనంది
        చెరసాల ముద్ర దాల్చిన ఘనుండు
ఆచార్య పీఠంబు నరకాల నెగజిమ్మి
        తల్లి నారాధించు త్యాగధనుడు
జాతీయ కళల కాస్కారంబు గల్పింప
        నుబలాటపడు రసజ్ఞోత్తముండు

అన్య దేశయాత్ర లాదరించి విశాల
చిత్తవృత్తి గడన చేసినట్టి
ప్రతిభ చరితుడైన రంగా మనీషి వ
ర్ధిల్లు గాతః నుతుల పల్లకీలః

# రైతుల నేతకు జోతలు

పి. రాజగోపాలనాయుడు

నేడు పూజ్య రంగాజీ జన్మదినం
రైతాంగానికిదొక పర్వదినం
వారొక గొప్ప మనస్వి
అంతేగాదు వారొక గొప్ప తపస్వి
ఎన్నడూ రైతాంగంకోసమే వారుజేసే ఆలోచన
గ్రామీణ ప్రజల అభ్యుదయం కోసమే వారుకనే కలలు

అంగ్లేయులు పోతేగాని మనకభ్యుదయంరాదని
రైతాంగాన్ని కాలరాస్తున్న జమీందార్లు, జాగీర్దార్లు,
మొఖాసాదార్లు పోరని
స్వాతంత్ర్య పోరాటంలో చేరమన్నారువారు
గ్రామీణ ప్రజల్ని
జమీందార్లకు వ్యతిరేకంగా పోరాటం జరప
మన్నారు వారిని.

ఆంగ్లేయులు పోయారు
జమీందార్లు జాగీర్దార్లు ఊడిపోయారు
కోట్లాది రైతులు స్వతంత్రులయ్యారు
రైతాంగ వ్యవస్థ బలపడింది.

అధికోత్పత్తి కావాలన్నారు ఆచార్యులు
అందుకని పంచిపెట్టమన్నారు ప్రభుత్వ భూమిని పేదలకు
ఫలితంగా రైతులయ్యారు కొన్ని కోట్లమంది
దేశంలో ఇనుమడించింది రైతుల సంఖ్య

బ్రిటిషువారుపోయినా పోలేదు వారు పెట్టిపోయిన
ధాన్యాల కంట్రోళ్ళు
వాటి నెదిరించమన్నారు వారు
ఎదిరించారు రైతులు. సాధించారు కొంత విజయాన్ని.
జమీందారీలుగా మార్చాలన్నది ప్రభుత్వం రైతుల భూముల్ని
నష్టపరిహారం లేకుండా కాజేయాలనుకున్నది వారి ఆస్తుల్ని
తిరుగుబాటు గావించారు రంగాగారు
వారి ననుసరించారు రైతులు

రక్షించబడింది సీలింగులోపలి భూమి
పెట్టాలన్నది ప్రభుత్వం సమిష్టి వ్యవసాయాన్ని
వెళ్ళాలన్నది రష్యా ధోరణిలో
కాదుకాదన్నారు రంగాగారు
అడుగు ముందుకు సాగనివ్వనన్నారు
తోడుజేసుకున్నారు రాజాజీ మొదలైన యోధుల్ని,
రాజకీయ ఋషీశ్వరుల్ని
ఆగక తప్పలేదు ప్రభుత్వం
మానక తప్పలేదు సమిష్టి వ్యవసాయ విధానాల్ని

కనీస వేతనాలు కావాలన్నారు రంగాగారు కూలీలకు
కనీస ధరలు కావాలన్నారు ధాన్యాలకు
పంటల భీమా అవసరమన్నారు
కరువులు, కాటకాలు, వరదలు హెచ్చు మనదేశంలో
అందువల్ల భీమా పెట్టలేమన్నది ప్రభుత్వం
ప్రయత్నించి విఫలమయింది ప్రభుత్వం
మనది పేదదేశం
ప్రకృతి వైపరీత్యాలను అరికట్టలేని దేశం

ఆలోచించారు ఆచార్యవర్యులు
ప్రపంచ సంస్థ కప్పగించారనుకున్నా రాబాధ్యతలను
వ్రాసారు ఐక్యరాజ్య సమితికి
బీదదేశాలలో వస్తున్న కరువు కాటకాలను
తదితర వైపరీత్యాల నరికట్టమని
అప్పుడా దేశాలలో పంటభీమా పెట్టి రైతులను
రక్షించడం సులభమని
ఆ సలహా మంచిదన్నారు వారు
అందుకోసం ప్రయత్నిస్తామని హామీ నిచ్చారు.

ఇదొక మైలురాయి రైతాంగ చరిత్రలో
దీనిని సాధించారు పూజ్య రంగాగారు
ఫలిస్తున్నది వారు మనకోసంజేస్తున్న మహాతపస్సు
మనం ఔనన్నా, కాదన్నా తోడయినా వీడిపోయినా
మనకోసమే కృషి సాగిస్తున్నారువారు
మనకోసమే ఒంటరి ఐడుతున్నారు
కాని వెనుకంజవేయక ముందుకే పోతున్నారు

వారి ఆత్మశక్తి అలాటిది
దానినెవరూ ఓడించలేరు
వారిదే అంతిమ విజయం అవుతుంది.
మనకు ఘన విజయం కలిగితీరుతుంది.

# ఘన యశోధుర్యుఁడు

డా॥ దివాకర్ల వేంకటావధాని

శ్రీలారోగ్యము దీర్ఘమాయువు యశ
    శ్శ్రేయమ్ము లందిచ్చి, దే
వాళీ మౌళి మణిప్రభాలసిత పా
    దాబ్జుండు. సర్వేశ్వరుం
డేలుంగావుత గోగినేనికుల వా
    ర్ధీందున్, రైతుబంధున్, ప్రజా
వ్యాలోలున్, ఘను, పంచసప్తతి శర
    ద్భ్రాజిష్ణు రంగాహ్వయున్.

మాతృధరిత్రి దాస్యమున
    మ్రగ్గి కలంగెడివేళ బాంధవ
వ్రాతము నర్థమున్ తుదకు
    ప్రాణములన్ విడనాడ జంకకా
మాతృవిముక్తి కంతయు స
    మర్పణ చేసిన వీరపుత్త్రి పు
త్త్రీతతి నీ అభిఖ్య తొలి
    రేఖననిల్పి తురంగలించెడిన్.

అచార్యుండవు విద్యలందు విబుధేం
    ద్రాచార్య వర్యున్ లస
ద్ధీచాతుర్యమునందు మించెదవు నే
    తృత్వంబునన్ గానరా

రేచాయన్ నినుఁబోలుదక్షులు వచో
హిస్వామి! సార్థక్యముం
దోచెన్ నీజని ధన్యమై ఘన యశో
ధుర్యుండవౌ దన్నిటన్.

సభల నీ వుపన్యాస మొసంగు నప్డు
దరటిపండొల్చి పెట్టినయట్టు లెల్ల
రాజకీయార్థికాది మర్మములు చెప్పి
శ్రోతలకు జ్ఞాన మోదముల్ చూఱయిత్తు.

నిరతం బీవొనరించు సేవల సమున్మేషంబు ప్రాపించి బం
ధుర కీర్తింగొను దేశమాత దయచే, తుష్టాత్మమై మేటి యా
దరముంజూపు జనాళి దీవనలచే, దార్ఢ్యంబు నారోగ్యముం
బరమానందమునొంది యొప్పు మనఘాత్మా!
రంగనాథాహ్వయా

# చిన్ని కాన్క

శ్రీ శివా రెడ్డి

రైతు ఆత్మబంధు రంగన్న చారిత్ర
వినని కననివాడు తెనుగునాట
లేడు, సంగ్రహంగ లేశెస్తు మాటల్లొ
విన్నవిస్తు చెవికి విందుజేస్త

స్వాతంత్ర్య సమరయోధుడు,
జాతికి తలమానికమ్ము, జగమెఱింగిన వి
ఖ్యాత చరిత్రుడు, మిగుల పు
నీతుడు ఆచార్య రంగ నేమని పొగడన్.

ఎగబడడు పదవుకోసము,
దిగజారడు స్వార్థమునకు దినబత్తెముకై
మొగమాటపడడు యిప్పటి
యుగ పురుషుడు రంగ సైర వుక్కుపిడురా

ఎవరయ్యా! నీ విధమున
పవలనకను, రాత్రియనక ప్రజకోసము యి
ట్లు వెతలజెందెడు పురుషులు
భువి నూటికి కోటికొకరెవో రంగన్నా

నవనీతము నీ హృదయము
భవతారకమోయి నీదుభాషలు రచనల్
యువకులలో వృద్ధులలో
యెవరయ్యా నీకుసాటి ఎన్నిరంగా!

కాలానికి యెదురీదెడు
ఘోలాటుడ వీవు, సింహస్వప్నము మంత్రాం
గాలకు యీ గోముఖ వ్యా
ఘ్రాలకు నీవంటె గుండె గాబర, రంగా!

తెలుగు ప్రజకు గొప్ప వెలుగు జేకూర్చావు
భిక్ష పెట్టినావు బీదసాద
రైతుకివు, ఆంధ్ర రాష్ట్రి మాద్యంతమ్ము
నీకు అప్పు ఎంతో బాకీ రంగ!

చాకిరి జేసేదొక్కడు
పైకి బోయ్యి రాజ్యమేలు ప్రభువొక్కడు యీ
లోకము తీరింతేలే,
కాకులు యీ తెనుగు జనత కర్మంతేలే!

జగమెఱిగిన బ్రాహ్మణుడవు
అగణితమగు నీ ప్రశస్తి ఆంధ్రావని, ని
న్నొగడుట చర్విత చర్వణ
మగునని వుపసంహరింతునయ్యా రంగా!

బక్కచిక్కినోడు బడిచెప్పె అయ్యోరు
మల్లెపూల పద్దెమాలగట్టి
అంపినాడు నీకు ఆచార్య రంగన్న!
స్వీకరించు యిదొక చిన్ని కాన్క

# సమతా మూర్తి

## శ్రీ నడకుదురు రాధాకృష్ణ

లోకారాధనమే తలంచి నిజహృల్లోకాప్త రామామణిన్
లోకారాధన సేయఁబంప, జన సందోహమ్ము నీరాజనా
నేకోత్సాహ మతింజరింప ధరణిం, దేవోత్తమా నీకముల్
మూకోన్మత్త చరిత్రులై వరలె, నా మూలంబు లూటాడగన్.

వాసనలన్ జయించి, ఋషివర్గముమెచ్చ మహర్షివై, సదా
భాసుర కర్షక స్మృతులు వ్రాసి, ధరామర కీర్తి చంద్రికల్
వాసము సేయఁగా నెసఁగు, భావి తరాల కరాల దీపికా
భాసిత కర్మయోగివర ! భారతజాతికి జీవ మీవెరా !

విజ్ఞాన విశ్వంపు వీచికల్ వెదజల్ల
        రామకృష్ణుఁడిడిన హేమపథము
సహగమనంబను జాడ్యంబు మాన్పిన
        రామమోహనరాయ ప్రగతి పథము
నవ సమాజ విధాత నవభావ నిర్మాత
        కందుకూరి చనిన క్రాంతి పథము
విజ్ఞాన తేజుఁడై భేదభావముదుల్పఁ
        ద్రిపురనేని గనిన దీప్తి పథము

మార్గదర్శకమ్ములుగాగ, మహిని నిలిచి
సాంఘికాచార దోషముల్ సమయఁజేయఁ
గంకణమ్ముఁ దాల్చినయట్టి కర్మవీర !
మనుము చిరకాల మీ భూమి కనఁగ యశము.

సత్యాగ్రహ సమర స్రష్టఁ హింసామూ ర్తి
కర్షకో త్తము మెచ్చె, గాంధితాత
అతుల ప్రజ్ఞాశాలి యమర యశస్కుఁడు
రైతు రాజును మెచ్చె, రాజబాబు
వీక్షణామాత్రచే భీకర శాలియౌ,
వర కృషీవలు మెచ్చె వల్లభాయి
పాశ్చాత్య తంత్రముల్ ప్రవచ్చిన సింహంబు,
మురిసి కృషికు మెచ్చె, బోసుబాబు

విశ్వ విఖ్యాత నేతలే వినుతిఁ జేయ
జగతి కాధార భూతమౌ చరిత వ్రాయు
కర్షక సమాజ వర్థిష్ఠుఁ, గాంచె నెపుడొ
విశ్వ జనపాళి హృదిమెచ్చి, ప్రీతి నిచ్చి.

జన్మభూమిలోని జాగీర్ల నీనాంల
మాల్ గుజారిదార్ల మట్టుపెట్టఁ
దల్లక్రిందులైరి తాలూక బార్లంత
గొల్లుమనె జమీలు గోగినేనిః

కంపిల్లెన్ పరరాజరాజ్య రచనా కాకృత్యకుద్యంబులున్
డెంపొప్పన్ జనమండలఁగడున్ శిక్షాతితీక్షంబుగా
సంపన్నంబగు తెల్లవారిని, సభాస్థానంబులందుండి, దౌ
ష్ట్యంపుం ఘాతుకముల్ సహేతుకముగా, సర్వంబు
ఖండింపఁగన్.

రక్కసి మూఁకలై భరతరాజ్యమునన్ రుధిర ప్రవాహముల్
దిక్కుల నింపునాఁ డతుల ధీవిభవంబున రక్తదాహులే
దిక్కును మొక్కులేని గతి దేశములంబడ, వారి ఘోరణుల్
ముక్కలు ముక్కలౌనటుల ముట్టడిచేసితి రంగనాయకా!

కావడి కుండలుంబగిది కార్మిక కర్షక సోదరుల్ ధరన్
జీవన వీధిలోఁగలిసి, జీవితభారపుఁ జక్రయానమున్
బావనబుద్ధితోఁ దలఁచి, భారతదేశ రథాంగులై చనన్,
బూవుకు రెండు కాయలని, ముందఱె పల్కితి భారతీధవా!

కుమ్మరి చేతిలోఁ గలుగు కోమల రేఖల సొంపులన్, సదా
కమ్మరి హస్తమున్ గరుడుగట్టిన కాయలలోతులన్, విశా
లమ్మగు దృష్టితోఁగని తలంపునఁ జొచ్చిన కర్మయోగులన్
నెమ్మదిఁ బ్రోచితయ్య! నవనీత హృదంబుజ! రైతుబాంధవా!

జగతిలోన మిమ్ము ఛాత్రసమాజముల్
కొలుచుచుండ్రి మూర్తి కొనలు సాఁగి
పరమ పుణ్యులైన భారతీ బాంధవా!
-జగతి నిలుతు, సూర్యచంద్రులట్లు.

# అభినందన సుమమాల

## శ్రీ లక్కరాజు కామేశ్వరరావు ఎం. ఏ., బి యిడి.

హలమును చేతబట్టి వ్యవసాయముచేయు కులంబునందు సం
చలనము కల్గజేయగను జన్మము నెత్తినవాడవయ్య మా
తెలుగు ధరిత్రి పున్నెముల తియ్యదనాలు ఫలించు దీక్ష, ని
త్తెలుగుల శేముషీ విభవ తేము పెంపు రహించి మించగన్.

చిఱుత ప్రాయమునందు సీమ విద్యా రహ
స్యాంబుధి మథనాన నలరినావు
ఆచార్య పట్టంబు త్యజియించి దీక్షమై
జనసేవ సేయంగ సాగినావు
ఆంగ్ల నిరంకుశ పాలిత భారతీ
సుదతి దుఃఖము బాప స్రుక్కినావు
ఆంగ్లాధికార ధిక్కారంపు ఫలితాన
ఎలమిమై చెఱసాల కేగినావు
ఆసేతు శీతనగాంత పర్యంతము
దేశ హితముగోరి తిరిగినావు

బహుళ గాంధేయ సూత్ర ప్రవక్త వగుచు
రాజకీయ విద్యాలయ రక్తి మెరయ
గ్రామసీమల సౌభాగ్య గరిమ కలిత
రైతు కూలీ ప్రజారాజ్య రక్షితముగ
సమసమాజ సిద్ధాంతపు స్రష్టవైతి
విశ్వ విఖ్యాత విజ్ఞాన వేత్తవయ్య !

సహకార పరపతి సంఘాల నిర్మాణ
దీక్షమై నిరతమ్ము తివిరినావు
కాంగ్రెసు సంస్థ సంఘటితమై కృషిజేయు
తీరుతెన్నులు సరిదిద్దినావు:
వ్యవసాయ కూలీల వ్యాకులంబును బాప
సంఘ నిర్మాత గాజాలినావు
చేనేత కార్మిక శ్రేయస్సు సాధింప
నేతనై నీతిగా నిలచినావు

ఇంత కృషిజేసి మాకెల్ల నెంతో జేయ
మొదటి శ్రేణికి నిన్నెంపు మోజులేదు
మాకు, రెండవ దానిపై నీకులేదు,
రాజకీయ బేరాలతో రాజి పడవు;
పదవి కాంక్షితో నారాట పడుటలేదు·
రమ్య గుణ సంగ ! ధీ భృంగ ! రైతు రంగ !

కర్షకోద్యమ నిర్మాణ కౌశలంబు
ఘనత మీరగ వరలిన కర్మవీర !
పేరు మాత్రమే మిగిలిన పెద్దవయ్య !
కూర్మి మిగిలెను మా కింక ! కూలి రంగ !

పండిన రాజకీయ పరిపాటవ జన్య విశిష్ట వైఖరీ
మండిత బోధనా విధుల మాన్యతరంబుగ మార్గదర్శివై
దండి గురుత్వ బాధ్యతల తాలిమి మీరగ నిర్వహించగన్
మెండుగ శాంతి సౌఖ్యముల మేల్తర జీవిత ముజ్జ్వలించెడున్:
నిండుగ నూరు వర్షములు నిష్ఠలమై జను, రైతు బాంధవా !

# ప్రశంస

శ్రీ పి. వి. సుబ్బారావు ఎం.ఏ.

దెబ్బదైదేండ్ల ముందొక ధన్యజీవి
పృథివి పొన్నూరు పురమందు వెలసె, ఘనుడు,
జాతి కీర్తిని వెలిగించె నేతగాను,
అతడె యాచార్య రంగాజి యలఘుమూర్తి

పారతంత్ర్యమునందు భారత ప్రజలెల్ల
భాధ లనుభవించి మ్రగ్గువేళ
భారతీయులనెల్ల బానిసలుగ జేసి
తెల్లవారేలుచు తిరుగువేళ
పరజాతి పాలన వాసికెక్కిన తల్లి
భారతి బాధలు పడెడివేళ
హేయ దాస్యమునందు హీనులై, దీనులై
హిందువు లెల్లరు నేడ్చువేళ

పూజ్య రంగాజి జనియించె పుణ్యమూర్తి,
నేతలే లేక భారతి నెమకువేళ
భరతమాత కన్నకలలు పండెననగ
దివ్య యశముల వెదజల్లు తెనుగునేల.

ఆర్థిక శాస్త్రాన నాచార్యు డైనావు
అందరి మన్నన లందినావు
రాజకీయాలలో రాణిల్లినా వీవు
శిష్యుల నెందఱో చేర్చినావు
కర్షక జనులెల్ల హర్షించు విధమున
క్రొత్త పార్టీ నెలకొల్పినావు

నేతలెల్లర నీ రాజనీతి మిన్న,
జాతి కంతకు మిన్న నీ ఖ్యాతి యెన్న
దేశదేశాల వ్యాపించె దివ్యయశము
రమ్య గుణముల విలసిల్లు రంగయార్య !

రైతుల సేవయే రంగాజీ ! నీ ధ్యేయ
మంచు మసలితీవు మక్కువలర
గ్రామీణ ప్రాంతాల కర్షకు లెల్లరన్
తీయని బోధనల్ తీర్చినావు
అఖిల భారత కర్షకాళి సమస్యలు
నీవి యంచును బాప నిల్చినావు
సర్వ ప్రపంచము గర్వించు భంగిన
నీవు నంతర్జాతి నేతవైతి

నీకు సాటిలే రెవ్వరు నిక్కమంచు
బహుముఖ ప్రజ్ఞ దీవంచు పలుకు భంగి
ఖండ ఖండాంతరాల విఖ్యాతి వెలిగె
రమ్య గుణముల విలసిల్లు రంగయార్య!

సప్తగిరుల నేలు సచ్చీల వెంకన్న !
భక్తకోటి గాచు భవ్యదేవ !
అందజేయుమయ్య, ఆయురారోగ్యముల్
రంగనాయకునకు రమ్యమలర.

( 1970 )

# రైతులే రాజులు

శ్రీ బండ్లమూడి శివరామకృష్ణ

కన్నది భారతాంబ నిను కర్షకజాతి సముద్ధరింపఁ చే
కొన్నది మాత భారతి గుణోత్తమ! నిన్ సహధర్మమూర్తిగా
అన్నది భారతావని అనన్యపు రైతుల నేతవంచు నే
డన్నది యెల్లలోకమును హాలికకోటికి రక్షవంచునున్

సృష్టియొనర్చినాడవు విశిష్టపు వర్గము రైతులంచు నీ
పట్టును వీడలేదు నిజప్రాజ్ఞత నెందరు గేలివేసినన్
'దిట్టలు రాజ్యమేలదగు ధీరులు రైతు' లటంచు చాటినా
వట్టి సహాయహీనుల కనన్య చరిత్ర రచించినాడవే

"భారత రాజధాని కొలువందు కృషీవలు డీవయుండగా
భారత రైతులన్ మరువ భావము లేరికి సెల్లు" నంచు ఆ
సాంద్ర యశోవిశాలుడల జహ్వారుపండితు డన్నమాట ని
న్నారసి గాదటయ్య కరుణారస మానస రంగనాయకా!

మార్క్సు మహాశయుండపుడు మానవలోకమునన్ననించి 'ఓ
కార్మికులారా! యేనిముగ గండు ప్రపంచము నేలగా' నన
"కర్షకులార! లెండు, మిముగాదన నెవ్వరు నోపరీభువిన్
మీరలు రాజ్యమేలదగు మేటు" లటంచును రంగబాబనెన్

ఇంతిమొగాడు తేడగల దింకను వీరల బోల్చిచూడగన్
ఆతడు గోరినాడు భువి నచ్చగ కార్మికరాజ్య మొక్కడే
ఈతడు గోరినా డవని నెల్లరు మెచ్చగ రైతుకూలి ధీ
మంతుల రాజ్య మీపుడమి మానుగ శాంతి యహింసలేర్పడన్.

(1946)

# ప్రశిష్యుని గీతాంజలి

శ్రీ కాజిపాకం లింగన్న

రంగాగారికి జేజేలు-
రైతు బాంధవునకు జోహార్లు.

రైతు బాంధవుడు రంగా,
నీతి కోవిదుడు రంగా,
కీర్తి కన్య ప్రఖ్యాత భారతికి-
సేవ జేసిన జాతి నాయకుడు

ఆంధ్రుల దాజకీయ గురువు,
అపర తిమ్మరసు, చాణక్యుడు
కపట మెరుగని నిర్మలమూర్తి,
జవహరుకు సరివచ్చు యోధుడు ।

అక్టోబరు నవంబరులు,
అక్కచెల్లెళ్ళు- అజేయవీరులకు-
జన్మలిచ్చిన చల్లని తల్లులు,
గాంధీజి పినతల్లి బిడ్డలు-
నెహ్రూ, ఇందిర, రంగాలు॥

పార్టీలను ప్రక్కకు నెట్టి,
మురాతత్వమును-మూలనుబెట్టి,
గంగాగారిని విలువగట్టితే-
అతడు రైతులకు కన్నతండ్రి

అతడు పేదలకు అన్నదమ్ముడు,
అతడు శ్రామికుల ఆప్తమిత్రుడు,
అతడు కూలిజన ప్రియబాంధవుడు,
అతడు స్త్రీలకై భారతి నిచ్చెను,

అతడు మానవతకే హారతినిచ్చెను,
పట్టాభి, ప్రతాళం కోవకు
చెందిన నాయకుడు రంగా;
రంగా ఎరుగని రంగములేదు.
రంగా నెరుగని రంగములేదు॥

ఎన్ని నష్టములు ఎదురువచ్చినా-
దేశసేవయే రంగా లక్ష్యము,
ఎన్ని కష్టములు ఎదలో నిలచిన-
మాతృసేవయే తన ఆదర్శము.
ఎన్ని బాధలు తనలో మెదలిన-
నిస్వార్థ సేవయే తన మార్గము.
ఎన్ని వేదనలు భరించుచున్నా-
దానముజేసె తన సర్వస్వము.
ఎన్ని నిష్ఠురము లున్నప్పటికీ-
త్యాగమొక్కటే తన రహస్యము,
ఎన్ని దుఃఖములు పైపై కొచ్చిన-
సర్వస్వదానమే మనిషి నిమిత్తము.
హర్షుడు సర్వస్వ దానం చేశాడు
తదుపరి రంగా చరిత్రకెక్కె-

Sundarayya Vignana K...
Library
264

రంగాగారికి జేజేలు
రైతు బాంధవునకు జోహార్లు.

నాకు మార్గ దర్శకుడు,
రాజగోపాలు నాయుడు
అయినప్పుడు ఆయన గురువు
నా గురువునకు గురువు.

' శృంగారింపగదమ్మ మస్తమున వాసిం గన్న మా రైతురా
డ్రంగా, అర్వదియేండ్ల యుత్సవపు ముద్రాభద్ర చిహ్నాంబువి
శ్వాంగీకార పవిత్ర సత్యరమలధ్యషించు వార్తా సుధా
గంగా వాహినిపై గడింపుము మహోకల్పాయు రభ్యున్నతుల్ ॥

శ్రీ జి. జాషువ

# శుభాకాంక్ష

పండిత పెన్మెత్స సత్యనారాయణరాజు

రంగత్తుంగ యధార్థభావ విలసద్రాజ్యాంగ చిత్‌హాసినీ!
సాంగోపాంగ విభాసితాఖిలకలా సారాంధ్రరుక్భాషిణీ
రంగానంతతపోవిభూతి ఫలావాక్ లక్ష్మీప్రభామోహినీ
శృంగారోన్నత రాజితోత్సవకథా శ్రీపూర్ణిమావాహినీ!

ఇరువదియైదువత్సరము లిక్షురసంబులఁ బోనివ్యాసముల్
సురుచిర మల్లికాలసిత శోభల జిమ్ముచు వాడవాడలన్
వఱదలు వాఱ, తెల్గుపలునాడులు బీడలులేక పంటలన్
గరిమవహించి నీవలన గాంచెను తుష్టినినవ్య వాహినీ!

తెలుఁగుంభూమి సమస్త సస్యములతో దీశక్తితో దీప్తితో
పలుకుంబోటి విలాసలాస్యములతో భావాలతో యుక్తితో
తలఁపుల్‌పండి స్వతంత్ర యోచనలతో దైనందినాభ్యున్నతిన్
వెలుఁగంజేసిన నీకు స్వర్ణమహమౌన్ శ్రీఘంబుగా వాహినీ!

ఎక్కడ చూచినన్ చెఱకు లెక్కడ చూచిన శాలిసస్యముల్
ఎక్కడ చూచినన్ కవిత లెక్కడ చూచిన వేణుగానముల్
ఎక్కడ చూచినన్ సురభు లెక్కడ చూచిన రాజకీయముల్
తక్కువయేమి నీ తెలుగురాజ్యజనాళికి పూజ్యవాహినీ!

రంగనిషష్టిపూర్తికిని రాజితమౌ భవదుత్సవానకున్
పొంగుచు నాంధ్రజాతి నలుమూలలనుండియు వచ్చిహారతుల్
బంగరుపళ్ళెరాలనిడి వారిజమాలలువేసి పూజలన్
సాంగముగా నొనర్చు నిదెచాపుము కంఠము నీవు వాహినీ!

# ప్ర శం స

పండిత- సత్యనారాయణ చౌదరి

హరి హరి! యాంధ్ర దేశ మపహాస్యము పాలయిపోవఁ
జొచ్చె నిల
దఱు యువ నాయకోత్తముల దందడి సందడిలో మునింగి; యె
వ్వరు పనిఁబూని దేశ మొక పద్ధతిలో సరిదిద్ద నేర్చువా
రరయఁగ లేరె? దేశమున కాఱడి తెచ్చుట యిచ్చగింతురే?

తల కొక గడ్డపట్టి పెదదారులు త్రొక్కి 'పరాయి'వారి త
ప్పులు పెకలించి ఢీకొనుచుఁ బోయిన దేశ మదెట్లు కోలుకోఁ
గలదు? త్రిలింగ నాయకులు కత్తులు నూఱుట మాని
యైక్యమున్
గలిగి మెలంగినప్పుడె జగంబున, వారికి 'నుప్పు' పుట్టెడున్॥

'సహకారంబను' సూత్రమందొక మహాసారస్యముం దెల్పి య
వ్వహమున్ గొప్ప నినాద మిత్తురు 'ఘనాపారుల్'
మహా నాయకుల్
కుహనా లాభము లేవో లెక్కలకుఁ బెక్కులు
చూపఁగా వచ్చు ని
మ్మహిలో నాచరణంబె ముఖ్యమని యే మాత్రంబు
నూహింతురే।

వాహిని ! నీవు సర్వపరివారము సిద్ధము చేసికొంచు న
న్నాహములోన నుండుటయె న్యాయము; రైతున
కేది లాభమో
ద్రోహమొ చెప్పఁగాఁగలుగు ధోరణి నేఁడు గతించె, నీకె యీ
సాహస మున్నదమ్మ జవసత్త్వము లింకను నీకుఁ గల్గుతన్ !

సేద్యము నేఁడు సర్వజన సేవ్యము కావలెనంచు దేశమం
దుద్యమ ముద్భవించినది, యూరక కన్నులు
మూసికొన్న - సా
రథ్యము మానుకొన్న నపరాధము చేసిన యట్లె యెంచుటే
తథ్యము కాన వాహిని! యథావిధిఁ గత్తిని నూఱియుంచుమా !

రైతన నెవ్వఁడో యెఱుఁగరాని మహామహు లేకమౌచు నా
పాప మనోజ్ఞమైన యొక బాటను సృష్టి యొనర్చి దానిలో
నైతిక సూత్రమున్ విడిచి న్యాయమొ గీయమొ
దాని లాభమున్
జాతమటంచు గోచులెగఁజుట్టిరి వాహిని ! కాచుకొమ్మిఁకన్ !

నీ వుదయించి నేఁటికిఁ గనీసము 'పావు శతాబ్ది' యయ్యె, దే
శావసరమ్ము లిమ్మగ స్వయమ్ము గ్రహించి ప్రబోధమిచ్చి సౌ
ఖ్యావహమైన బాట కొక హద్దును జూపితివమ్మ వాహినీ !
నీవిఁక ధన్యురాలవు మనీషులు మెత్తురు నీదు వైఖరిన్,

# ఆశీర్వాదము

కవి రాజహంస, కవి కులాలంకార
## శ్రీ బాలాంత్రపు వేంకటరావు

శ్రీశుతి కృపా కటాక్షము
లాశీస్సులు గాఁగ నాయురారోగ్య సుఖా
ధీశుఁడయి రంగనాయక
దేశారాధకుఁడు జయసుధీమణి యగుతన్

గురికొన్న ప్రజా వాహిని
నిరుపమ కృపనేలి వాహినీ పతివైతో!
పరబల విదళన దీక్షా
నిరతిన్ రంగయ్య! వాహినీ పతివైతో!

పల్లె పల్లెలకును బంపితి వాహిని
వాహినీశుఁడంచు వన్నెఁగంటి;
మనసు పేరిపొలము మంచి పంటలు పండి
రంగయనుచు నిన్ను రైతు పొగడ—

దేవు పెండ్లిసేయ! దేశసేవ యొనర్ప
నెల్లవారుఁ బెద్దలే యనంగ
నెల్లరును స్వతంత్రులే యని పలుకంగ,
పేరుపెట్టి వేఱ పిలువ వలెనె?—

తొల్లి స్వతంత్రతా ప్రియులతో బలుకాడఁగనోడి కొందఱే
పల్లవొ పాడుచుండ్రి, తమ పాలకవర్గముఁ దూఱి యిప్పుడా
పల్లవియే సత్వంత్ర పదభారతి కారతి పాటగఁజేసి నీ
వెల్ల స్వతంత్ర పక్షమున కేలికవైతివి రంగనాయకా ।

అర్థ విద్యల కాచార్యుఁ డగుటెకాక,
భారతీ పతివైతివి ప్రజలు మెచ్చ;
ఆశ్రితాఖిరక్షకు హాలివగుటెకాక,
రంగనాయకుఁడవైతి ప్రజలు మెచ్చ

తొలి షష్టి దేశ సేవా
ఫలమైన స్వతంత్రపక్ష పతివను నుతితో
మలిషష్టి నఖిల భారత
నిలయాధ్యక్ష పదవి నుతినింగను రంగా ।—

ఆశయమ్ములక్షరాకృతిఁ దనరంగ
దేశవాసి భారతియె యొసంగ
వాంఛితార్థసిద్ధి వాహిని కొనరంగ
వాహిని పటుధాక వరలుఁగాక ।

# మంగళాశాసనము

సుధీ మిత్ర
శ్రీ జంపాల వేంకట నృసింహము

ఉన్నత విద్యనేర్వఁ బరమోత్సుకుఁడై పరసీమకేగి భా
వోన్నతి గష్టజీవులకు నూడిగమున్బచరించు శక్తి సం
పన్నతఁ గాంచిమించి ప్రతిభన్దన జీవిత సర్వము న్పరిజా
భ్యున్నత కార్యసాధనకు నొప్పనసేసి పరార్థ జీవియై
సన్నుతి పాత్రవర్తనఁ బ్రశస్తి వహించి నిరంతర శ్రమన్
గ్రన్నన రైతులోకమును గార్మికవర్గము నుద్ధరింపఁ దా
నన్నివిధంబులన్ జతన మద్భుత లీలఁ బొనర్చి ధీరమూ
ర్తి న్నిజ భాగ్యవృద్ధి గణుతింపక భారత భాగ్యవృద్ధికై
పన్నుగఁబాటుసేయు యువభారత నాయకు రంగనాయకున్
వన్నెచెలంగ దివ్య శతవర్షము లాయువు సౌఖ్య సంపదన్
బ్రన్నని లోకసేవకగు పాటవమున్ సమకూర్చి లోకమం
దెన్నికకెక్క సర్వజగదీశ్వరుఁ డోమును శాశ్వతంబుఁగన్

భారతి తోడునీడయయి భారతసేవకు దోహదమ్మిడన్
భారతదేశ దీనజనబాంధవుఁడై శ్రమజీవులైన సం
సారుల రైతులన్ మెతుకుచాలని కూలిజనంబుఁ బ్రేమనిం
డార సముద్ధరింప వెతలందెడు ప్రాజ్ఞుఁడు రైతురంగ తా
నూరిమిపేర్మిమించు బుధకోటి సమాదరణమ్ము గాంచుతన్.

పాలన కర్షమా ధనికవర్గ మటంచనగొంద జెట్టిటూ
కూలిజనమ్మె యేలుటతగున్ ధర నంచనగొంద శాస్త్రతో
హాలికా కార్మికాది ప్రజలందరతోడి సమష్టి పాలనన్
గ్రాలుజగమ్ము శాంతిపరిరక్షను నార్థికపాటవమ్మునన్
మేలున సౌఖ్యసంపదలమెండున నంచు బ్రపంచమంతటన్
మూలలమూలలం దెలియ ముఖ్యముగాఁబ్రచురించు సత్వసం
శీలుని రంగనాయకు విశిష్టసుబోధసుధాస్రవంతి యు
ల్లోలవిలాస విస్తృతవిలుంఠన సత్వర వాహినిం బ్రజా
జాల మనఃప్రదేశముల సత్ఫలదంబులఁజేసి ఖండఖం
డాల జనమ్ము పహ్వారె బహో యన వర్తిలఁ జేయు నెల్లెడన్

కర్షకుల దైన్య మణగించు కల్పతరువు
కార్మికావళి దనియించు కామధేను
వను ప్రసిద్ధిని దేశసేవను రహించి
రంగనాయక సతము క్రాలంగదోయి.

జన సమాజమును సామ్యసామరస్య
శాంతిసౌభాగ్య జీవిత సరణిఁ గాంచు
నీ ప్రబోధ వినూత్నసందేశ మలరు
నఖిల ఖండాంతర వ్యాప్తి యన్.జి. రంగ !

రాజగోపాల గురుడును రామచంద్ర
రెడ్డి తోడుగ రైతుల గడ్డు బెడఁద
నుడుపఁ గృషిసేయఁ బ్రజలెల్ల కడఁక నీకు
సాయ మొడగూర్తురిగాక నిశ్శంకరక్తి

యౌవనారంభ దశనుండి యశుభవదేండ్ల
వయసుదాక నిరంతర భరతదేశ
సేవ నెగిడిన నీభవ్య జీవితంబు
సర్వజనతతి కాదర్శసిరణి యగుత,

శతసమ లికనుండి సర్వసౌఖ్యాలతోఁ
బేదజనులపాలి పెన్నిధివయి
స్వార్థపరుల కపట చర్యలఁ గెడపగా
శక్తినొసఁగు నీకు సత్యశక్తి

శ్రీలస్మీఱుచు భారత
లోలుండయి దేశసేవ లోక ఖ్యాతిన్
గ్రాలంజేసెడి రంగనిఁ
బాలించుఁ బరాత్పరుండు భద్రము లెసగన్.

## శ్రీ బోడేపూడి వేంకటరావు

స్వార్థలేశంబు లేదు సేవాభిరతిని
గర్వవాసన లేదు విజ్ఞాన మహిమఁ
బాశిలుమాలిక లేదు కర్తవ్యసరణి
రైతుబందూ ! శతాయుష్ప్రాప్తిరస్తు.

ఒరుల పొగకలకు నుప్పొంగ వింతయు;
తెగడికలకు వెఱచి బెగడిపోవు.
అత్మధర్మ నిరతి నావంత వీడని
రైతు బాంధవ ! నిరామయోస్తు.

ఆదర్శవాద భావావేశ ముప్పొంగి
కల్పించు వృత్తివైకల్యములను
పరభావనాచింత ప్రాభవో న్మేషముల్
పచరించు సిద్ధాంతపద్ధతులను
స్వార్థసంపాదనోద్యత మహోద్యమములు
పొనరించు నిస్తులవ్యూహములను
పేరుకై పాటాడు పెద్దటికమ్ములు
రూపించు వివిధావరోధములను

క్రుంగి కృశియించి హూలారి గోడు గుడిచి
దిక్కు తెలియక తారాడి దెసలుచూచు

రైతుపాలిటి జీవనజ్యోతి వీవ
రైతురంగా ! జయోస్తు నిరంతరంబు.

నాయకాగ్రమణివి నాయకస్రష్టవు
దీనజనులపాలి దిక్కునీవు
జంకు గొంకు లేని సత్యప్రవక్తవు
తెలుగువెలుగులకును వెలుగు నీవు.

పదవులకై యొకప్పుడును బాతరలాడవు పీడితప్రజా
హృదయ మహాధిరాజ్యపద మెల్లను గైవసముం బొనర్చి య
ర్వది శుభవత్సరంబులగు ప్రాయమునందు నిత్యగౌరవ
స్పదముగ నేలుకోఁ గలుగు ప్రాజ్ఞత నీయది రైతునాయకా !

నీకు జయంబు, ధర్మమహనీయ భవత్ప్రతిపాదితోద్యమ
శ్రీకి సుమంగళంబు, పరిశీలిత మానవధర్మ తత్త్వసు
శ్లోకము మీస్వతంత్ర కలిలోకమహోన్నతి, భవ్యవైభవో
త్సేకము విజ్ఞతామహితశేవధి కివ్వే నమస్సుమాంజలుల్.

# రైతు బాంధవా!

శ్రీ యడ్లపల్లి దేవయ్యా చౌదరి

చక్కని పొండితీగరిమ సౌఖ్యములీనెడి భోగభాగ్యముల్
చిక్కని వాగ్ఝరీపటిమ శీలము ధర్మము నీదు సొమ్ములై
మిక్కిలిగా లభించినను మేటితనం బిసుమంత జూపకే
మక్కువజేసి యెల్లరకు మంచిని గూర్చితి వాదరంబునన్.

చేసినదానికిన్ ఫలము చిక్కక స్రుక్కెడి పేదవారిపై
గాసిలిచెంది వారినొక గాటికి ద్రోలియు సంఘశక్తిచే
భాసిలునట్టి యుద్యమ మపారముగా నెలకొల్పి వారికిం
బాసటయై సదానిలచి ప్రస్తుతులందితివయ్య ! నేర్పుమై.

భారతభూమి సేద్యమున బాగుగ చెల్లిన కారణంబుచే
గూరిమిమీఱ హాలికుని గూలిని సాలెను సర్వవేళలన్
హారతిబట్టి కొల్వదగునంచు ప్రబోధము సేయ నెల్లరున్
మేతలెఱింగి శ్రామికుల మెచ్చిరి గౌరవమిచ్చి నేటికిన్

ప్రవిమల దివ్యగీతముల బల్లెలవారిని మేలుకొల్పగా
కవులను ప్రోత్సహించెదవు గాయకులన్మది మెత్తువాదృతిన్
దవిలెడి వారి యిక్కటుల దార్కొని కబ్బములన్ రచించి నీ
భవము తరింపజేసితివి భాగ్యవిహీనుల ఱుత్తులాఱగన్.

గోరిన పంటలెల్ల సమకూర్చు నహోయిక రైతుస్వత్వమున్
దూరముసేయ బాలకులు తూకొనుచుండ, నెరింగి ముందుగా
గారణమెంచి రైతుకండగండ్లను జాటవె రైతుబాంధవా!

కరమొనగూర్చు శ్రామికుల కష్టపరంపరలెల్ల దీర్పగా
దొరకొని నిల్చి వాస్తవపు త్రోవల ద్రొక్కుచునున్న వాహిని
న్నిరువదియైదువత్సరము లింపుదనర్పగ బెంచి రైతుకా
దరువుగ నిల్పితీవు నిరతంబు స్మరింపగ నెల్లవేళలన్

నీవుంగూర్చెడి యుద్యమంబులకు
బూన్కింజూపి ప్రోత్సాహమున్
భావంబందుననిల్పి నీ కృషికి శోభన్దిద్ది చేదోడుగా
సేవంజేయుచు భారతాంబ యశమున్ చేకూర్చ నూరేండ్లుగా
పూవుందాని విధాన మీరలుభయుల్ పొంగారుడీ మేల్పడిన్

# శుభాకాంక్షలు

శ్రీ పి. ఆర్. చౌదరి

శ్రీలకు నాకెరంబయి వశీకృత సర్వ జాగత్ప్రజామనో
జాల తపోమహామహిమ శౌర్యపరాక్రమ ధర్మశాస్త్ర స
చ్ఛీల పతివ్రతాత్వ గుణసిద్ధుల రాజిలు భారతావనిన్
గ్రాలెడి దైవతత్వమిలఁ గాచుత మిమ్ముల రంగనాయకా!

ఏనాడీ భరతావని స్గృషికు నీవీక్షించితో జాలితో
నానాడే యతఁడర్థదృప్త విషమాయా మీలితాత్మజులన్
దావై విప్పి కనుంగొనందొడఁగె నానాందార్ద్రి మార్గాప్తికై
నా, నీ నేతృత శేషుకైనఁ బొగడన్ గా శక్యమే పూజ్యుడా!

బాల దివాకరుండుదయ పర్వతమెక్కఁగ నెల్ల చీకటుల్
దూలినరీతి నీ నిఖిలలోక హితోక్తి మయూఖశక్తికే
మూలనో డాగె బూటకపు బూతులనేతల కుట్రలత్తమో
జాలము, విచ్చె దుర్వ్యథిత సంఘ హృదబ్జము లెల్ల మాన్యుడా!

హృదయము నిర్మలంబు, ముఖమిందు నిభంబు,
సుధాద్రవస్రవ
త్సదియ జగత్సమత్వసముదంచిత వాక్తతిజ్యోత్స్న, సత్సఖా
సదుల ముఖంబుల న్కుముదజాలము లెట్టుల విచ్చుకుండు, దు
ర్హృదయ తమస్సు లెట్లు నశియించక యుండెడు,
రంగనాయకా!

పులితోల్కప్పుల గాడిదల్ ధనికతా భూతంపు దుర్దాసులై
వెలకుంబోయిరి వేలు లక్ష లయి న స్వీరత్వమున్వీడ కు
జ్జ్వల వృద్ధిన్విలసిల్లెదీవు కలుపుల్వ్యాయంగ సస్యంబు వ
ర్ధిలున ట్లెవ్వరు నిన్నుఁబోలగల రీ దీక్షావివేకస్థితిన్.

చెక్కలభజన వారొక్కమై నెగబ్రాకఁ
బెంపు సొంపులు వీడి పేదపడుచు,
తగవుకై కాల్దూకు దౌర్జన్య భూతాల
ధాటితో నొక కొంతదారి తొలగి,
మారు వేసాలకున్మరగిన మారి నం
ఘీయుల పొత్తుతో న్యాయమడిగి,
లంచాల లక్ష్యంబులై బ్రతికెడు ప్రజా
ద్రోహుల భారాన క్రుంగిపోయి,

యొన్న దేశమ్ము గాపాడనున్నతమతి
వృద్ధుడయ్యును శ్రమియింతు విద్ధచరిత!
గోగినేని వంశపు మణి! యోగి! రంగ
నాయకా! నిన్నుబోచు శ్రీ నాయకుండు.

# నివాళి

శ్రీ సి. వేణు

అందుకో అందుకో
అంజలి శతంబు
  మీ
కాయు రారోగ్యంబు
లమరు నతంబు.

అరువదేడులు ఆరిగినను
అందాలు డిందని యువకుడు
రైతాంగ జనతకు వయస్సు మనసు
అంకిత మ్మొనరించినాడు.

మధుర మంజుల విధుర నాదము
మారు మ్రోగును గళమున
వెండి పువ్వుల రాసిబోతువు
చికిలి చిన్నారి నవ్వున.

కాపు కన్నెలు యిచ్చుచుండిరి
శ్రమ శ్రపపు నివాళి
మీ షష్ఠి పూర్తినిగాంచి పొంగెను
ఆంధ్రదేశపు జనాళి.

"రంగాజీ" జూడగ వ్యక్తిగారు
రైతాంగ జనతా శక్తియతడు
నమ్మినాలక్ష్యమ్ము కొఱకై
పోరునడిపే వీరుడాతడు.

రైతు నేత శిరమ్ముపై
మాణిక్య మకుటము మలచిపెట్టి
వ్యక్తి హక్కుల రక్షణముకై
తనువు ధనమును "మీదు" కట్టి

తేనె తీయని తెలుగు పలుకుల
తీరులరసిన తెలుగువాడు
తేనెటీగను బోలురైతుల
శ్రమను తూచు "షరాబు" ఇతడు.

సర్వతాగ్రమునుండి క్రిందికి
పాటపాడుచు పారు నిర్ఝరి,
సూటిగా ఎదహత్తి ఆలోచనల
రేపును అతని వాగ్ఝరి,

బూజుపట్టిన పాతభావము
లన్న రోతను పొందువారు.
మార్పు నీయన కోరువారు
మార్పుకై పోరాడువారు.

తెలుగు పలుకుల కులుకు నడకల
భావసుమముల నేర్చి కూర్చితి
చందురునికొక నూలు పోగని
"కవిగ" ఆశీస్సులను పంపితి.

అందుకో అందుకో
అంజలి శతంబు
మీ
కాయు రారోగ్యంబు
లమరు సతంబు.

# లోకబాంధవుడు

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు
(పల్నాటి సోదర కవులు)

అకళంకాత్ముఁడవై -మహామహుఁడవై -యానందభావుండవై
సకల జ్ఞాన కళావికాసఖనివై సత్యాంతరంగుండవై
యొక దీక్షంగొని సోదర ప్రజల కభ్యుత్థానముం గూర్చు నా
యక చూడామణి వీవు
నిక్కువము రంగా! నీకు జోహారువుల్

పదవుల్ కోరవు కోరనేరవు-ప్రజంబాధించు మార్గంబు నం
బద మానింపవు - సత్యమున్ విడవు -
పాపం బంటఁగాఁ బోవు - సం
పద నార్జింపఁ దలంప వో సుగుణదీపా! "రైతుకూలీ ప్రజా"
హృదయంబుల్ భవదీయ సూక్తులకు
హాయింజెందు నెల్లప్పుడున్.

అరువదియేండ్లు నిండినవియా! మహితాశయ! నీకురూపమా
తరుగుటలేదు - వాక్పటిమ తగ్గుటలేదు - శరీరసారమా
విరుగుటలేదు - భారత సవిత్రి కడుంగడు మెచ్చి-యే సుధా
వరమిడి కూర్మిఁ బేర్మి నినుఁ వర్ధిలఁజేయుచు నుండెనో గదా!

ఒక పక్షంబును రెచ్చగొట్టి కపట వ్యూహంబులం బన్ని వే
రొక పక్షంబును మట్టుపెట్టఁ గల భావోద్రేకివా కాదు - వే

దికలన్ నిల్వడి నీవు వెల్వరచు గాంధీ సూత్ర సందేశముల్
సకల ప్రాణుల నుద్ధరించుఁ గద !
విశ్వశ్రేయముం గూర్చుచున్

ఏయెడ నిల్చనన్ మఱియు నెయ్యది నిల్చినవేమి దాని నా
ప్యాయము దోఁప నాయకుఁడవై
నడిపించుచు నున్ననేమి ? రం
గా ! యమలాంతరంగ ! సుముఖమ్ముగ
దేశము దిద్దు నీవు గాం
ధేయుఁడవే ! చరాచర విధేయుఁడవే ! నిజమెంచి చూచినన్.

వివిధ కులస్థులన్ వివిధ వృత్తుల నందిన సోదర ప్రజన్
వివిధకళా ధురంధరుల వృద్ధికిఁ దెచ్చిన నిన్ను రైతు బాం
ధవుఁ డనుచందురేల తగునా యిది -
కాదు కృపాత్మ ! లోకబాం
ధవుఁడవు నీవు నీవలె బుధప్రవరుల్ వచియింతు రెప్పుడున్.

ఇప్పుడు నీ హితోక్తుల గ్రహింపక పోయినఁ బోవుగాక-ముం
దిప్పటికైన లోకము గ్రహించి విచారముఁ బొంది కుందుటల్
తప్పదు - నీవు చూసిన విధానము సర్వజనాను కూల్యమై
యొప్పక పోదు - నిత్య విజయోన్నతులందకపోదు దీనిధీ !

మేలిదు నంచు నాయకులు మెచ్చి సృజించిన తిండి గింజ కం
ట్రోలు పయానమై విషమ రూపముఁ దాల్చి ప్రజాసమూహముం
దూలఁగఁ గొట్టు వేళల నెదుర్కొని దానిని రూపుమాపి మ
మ్మేలిన వీరశేఖరుఁడ వీపుగదా! నిజమున్ గ్రహించినన్.

కల్ప వృక్షము కర్షక గ్రామణులకెల్ల
కూలి రైతులకు ముంగొంగు పసిండి
పారిజాతము కళాకార వారములకు
బుద్ధి జీవులకు సంపూర్ణ ధనము
కామధేనువు కార్మికవతంసములకెల్ల
మహితోద్యమములకు మహిత బలము
అమృత భాండమ్ము విద్యార్థి సంఘములకు
యువ మహోద్యమముల కూత కఱ్ఱ

దర్పణము గాంధితాత సిద్ధాంతములకు
చేతి వృత్తుల వారికి జీవగఱ్ఱ
నీదు సందేశ మెంత వర్ణింపఁ గలను
సహజ కరుణాంత రంగ ! ఆచార్యరంగ !

సంతస మందుచుండిరి విశాల గుణాశ్రయ ! నేడు ఖండ ఖం
డాంతర వాసులంత భవ దభ్యుదయ ప్రతిభా విశేషముల్
స్వాంతములన్ దలంచి—మన జాతికి నీతికి వన్నెఁ గూర్చు సి
ద్ధాంతములన్ వచింతువు! మహాత్ము విధానము నుద్ధరింపఁగన్.

పరిపాలనము బదాబదలై చనినదాక
మడమఁ ద్రిప్పని మహామహుఁడ నీవు
కష్ట నష్టముల లెక్కఁ బెట్టబోక ముం
దడుగు వైచిన నాయకుఁడవు నీవు

మహిత నిర్మాణ కార్యక్రమంబుల యందు
గడిదీరు గాంధి శిష్యుఁడవు నీవు
దేశమాతను తీర్చిదిద్ద సర్వస్వమున్
ధారవోసిన త్యాగ ధనుఁడ వీవు

అట్టి నీ షష్టిపూర్త్యుత్సవాళియందు
పేద తమ్ముడు భక్తి నర్పించుకొనెడు
పద్యముల నందికొమ్ము! దీవనల నిమ్ము
సహజ కరుణాంత రంగ! ఆచార్యరంగ!

# పంచరత్నాని

## శ్రీ జాస్తి వెంకటనరసయ్య

దేయాస్తా మాయు రారోగ్యం సర్వోదయ సమున్న తిం
రంగా నాయక పూజ్యాత్తు పార్వతీ పరమేశ్వరౌ॥

రంగా త్యాగీ దేశభక్తః విశ్వ కర్షక రక్షకః
భారతాంబా సుపుత్రేషు అవాప మహతీం ప్రథాం॥

సామ్యవాద ప్రచారేణ, సర్వ శ్రేయోభిలాషయా
కష్టజీవి సురాజ్యాయ రంగా వాంఛతి సర్వదా॥

అహింసా సత్య ప్రేమాది సర్వ సద్గుణ భూషితః
జనానాం శ్రేయసే రంగా శ్రద్ధయా యతతే సదా॥

అనేక గ్రంథ కర్తాయం బహుభాషా సుపండితః
రంగా దేయాత్ వర్షశతం ప్రజానాంజ్ఞానసంపదం॥

# కానుక

తుమ్మల సీతారామమూర్తి

ఇంత నేర్చినేర్చి యున్నాళ్ళు ప్రజలకై
నలఁగినలఁగి యింత కలఁగి కలఁగి
రైతు కల్పకమ్ము రంగా గడించిన
పంట యెంత? తృప్తి పడుట యెంత?

అతఁడు కర్మ ఫలము నాసచేయని మహా
యోగి యన్నసత్య మెప్పుకొందు.
నంత మాత్రం దీక్షనా మన కర్తవ్య?
మింతమాత్ర మరయ రేమి ప్రజలు?

దేవునకు బువ్వ లేదా?
నైవేద్యము పెట్టునేమి నరుఁ డర్చకుఁడై?
సేవకుని శక్తి తక్కఁగ
నేవంవిధ ధర్మమునకు హేతువు కలదా?

వేల్పుపట్లఁ బోలె విశ్వ ప్రజాళికై
బడలు నరునిపట్ల భక్తివలదె?
యేరుదాఁటి తెప్ప తెగ్గొనరించిన
బాటసారి కెంతబైసి దక్కు?

కానిండు! చిరాయుర్బల
మీనేతకుఁ గలదులే! మహీయస్థానం
ఖీనేతకు నున్నదిలే!
భానుని మేఘములు సతము బాధింపువులే!

(1958)

# ఆ చా ర్య రం గా

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు
(పల్నాటి సోదర కవులు)

హలముంబట్టి-పొలమ్ము దున్ని-ప్రజ కాహారమ్ము నందించు వే
ల్పుల శాఖం బ్రభవించి-నీత నియమంబున్ గల్గి-విద్యా సము
జ్జ్వల భాగ్యం గడించి-ప్రపథమ కర్తవ్యము నూహించి-ని
శ్చల దీక్షన్ ధరియించి-శాంతి సమర స్థానంబునన్ దూఁకి-య
న్నలకున్ దమ్ముల కండవై నిలచి-నాస్త్రా క్రీతులం బోసి న
వ్వుల తాతయ్యయొసంగు దీవెనల పువ్వుల్ దాల్చి-
సర్వోద్యమం

బులలోఁ బాల్గొని-కష్ట నష్టములతోఁ బోరాడి-కారాగృహం
బులలో బాదలఁజెంది-ధర్మ విజయంబున్‌గాంచి-వీరుండవై
నిలువం గల్గిన తెల్గు బిడ్డఁడవు—సన్నిర్మాణ కార్యక్రమం
బులలో భాసిలి—మాతృసంస్థకు జపంబుం‌ హర్చి స్వాతంత్ర్య రే
ఖలతో—భారత రాజ్యలక్ష్మికి నలంకారంబులన్ గొల్పి—చె
న్నలరం జేసిన దేశ నాయకుఁడవన్నా! నీవు—నీ మేలు కొ
ల్పులతోఁ గన్నుల విప్పుచున్ నిదుర మబ్బుంబాసి
నీ యంద దం

డలతో సంఘములన్ సృజించు కొని యానందంబుఁ
గన్నార లో

యలఘాత్మా! పతితుల్ దరిద్రులయి యల్లల్లాడుచున్ దూరమై
వెలికిన్ జిక్కిన సోదరుల్ హరిజనుల్—వేసారుచున్ వేళ కా
కలమున్ మెక్కుచు-మూకలై యడవులం గారాడుచున్—
గొండ కో

నలలో నుండెడి సోదరుల్—నానాశ్రమల్ చెంది యెం

దలకున్ వానల కోర్చుచున్—వలయు పంటంగూర్చి
చున్నట్టి — కాఁ

పులు—నవ్వారికిఁ గూర్మి సాధన చయంబున్ దీర్చు
సత్కార్మికుల్

కలకాలమ్మును జెమ్మటల్ కురియ—తెక్కల్
ముక్కలై పోఁ గృషిన్

నలుపంగల్గెడి కూలిరైతులు—నిరాశన్ జెందుచున్ గీలు బొ
మ్మలుగాఁ దోఁచెడు సోదరీమణులు—సామ్యస్వాంతులై వృత్తిని
ద్యులతో నుండెడి కష్టజీవులు—కృపాత్మా! "రైతుకూలిప్రజా"
బల రాజ్యాశయ మన్వదీయ మనియున్ బాపూజి బోధించె-నీ
కలనాఁడే—హరి యర్జునం బిలిచి—గీతార్థంబు విన్పించి—లోఁ
గల సందేహముఁ బాపినట్లు—విని లోకంబంత హర్షించే నీ
పలుకుం జెందక-యమ్మహామహుని సిద్ధాంతమ్ము దేశంబునన్
నెలకొల్పంగల వెప్పుడో నిజము తండ్రీ! భారతీదేవి తో
డలరంగల్గు పతివ్రతా తిలక నీ యర్ధాంగి-ధీరాత్మయై
నిలువంగల్గు-ననేక రంగములలో నిష్ఠాగరిష్ఠాత్ములై
విలసన్మూర్తులు-శిష్యులుండిరి-ప్రజా విశ్వాసమున్ గొన్న నీ
బలగంబున్నది-సర్వ ఖండములలో భావింప-నీ యందు మా
యలు మర్మములు దూర నేరవుగదా! ఆచార్య రంగా! అ చం
చల దీక్షా వియాం తరంగ! విజయ స్తంభమ్ములన్ నాటి-మ
మ్మలరింపంగల నాయకుండవయి—సన్మానంబులన్ గాంచు—నీ
విలువం జాటఁదరంబె మాకు-దయతో వీక్షించి-దీవింప-నా
పలుకుం బువ్వులదండ, గైకొనుము! నీపైఁగూర్చి నర్పింతు-వ
ర్థిలు నీ జన్మదినోత్సవంబు-లభివృద్ధిన్ గాంచు నీయాత్మ శ
క్తులు-నీప్రేమ సుధామహా మధురసూక్తుల్-దేశముప్పొంగన్.

# "పర్వదినము"

హెచ్. ఆర్. నందూరి

ఇది సుదినం
రైతులోక పర్వదినం

మర్మ మెరుగని
కర్మ వీరుల
చెలిమి బలిమికి
వెలుగు లేక
వెతలు జెందే
గతుగు బ్రతుకులో

సర్వ శ్రామిక
శ్రేయమైన
రైతురాజ్య సి
ద్ధాంత కర్త
ఉద్భవించిన
దివ్యదిన మిది

ధాత్రీ బిడ్డల
దీపావళే యిది.

"రంగా కింక నితఃపరబనఁగ నిర్లక్ష్యమ్ము ప్రాణంబు రై
తాంగంబన్న, స్వపక్షమాతఁడొక పల్కాడంగ నే రీతి ను
ప్పొంగం జొచ్చునో, శత్రుపక్షమటులే బొమ్మాడెడిన్ వాని వా
గ్భంగిన్ విశ్వమె గింగిరాల్ దిరిగిపోవన్ సాగు
నొక్కొక్కడన్."

—మాధవపెద్ద బుచ్చి సుందరరామశాస్త్రి

# కార్యసిద్ధి

గొట్టిపాటి సుబ్బరాయలు

మట్టిలో నుండి రత్నాలు తెట్టిగట్టి
కడలి తరగల ముత్యాల కళ్ళమూడ్చి
భరత భాగ్యాధికమునకు మెఱుగుబెట్టి
ధన్యుడైతివి రైతాంగ మాన్య రంగ!

గుబురు మీసాలలోనుండి గుస్తరించు
మిసిమి నవ్వులు నీలోన మెండుకొన్న
నిండుదనమును పండిచి దండిగుణము
నాటిపెంచితి నీ తెల్గుతోట రంగ!

పసిమిజిందెడు వాక్యాల పల్లియలను
పసిని బట్టియు చేపట్టి భావతుష్టి
అర్థపుష్టియు గుణదృష్టి నందగించి
జీవముప్పొంగ జేసితి నీవు రంగ!

తెలుగు నుడికారమున నింత విలువ బెంచి
తెలుగు రైతును దీప్తిని మలచి నిలిపి
తెలుగు ప్రజల హృదంతర దేశమందు
తెలుగు చదువు పెక్కు వేవేండ్లు రంగ!

నీవగు సేవయు, శైలియు,
భావనలో కార్యవిధుల ప్రత్యేకమ్మై
ధీవిజ్ఞాన ప్రభవై
జీవితమెక కావ్యసిద్ధి జెందెను రంగా!

# పంచరత్నములు

షేక్ ఆలీకవి

మానవాభ్యుదయ సమ్మార్గితోన్నత కళా
    మహిత హాలిక వంశమండనుండు
విద్యావివేక సంవృత భావ ప్రాక్రృతీ
    చీ ఖండ జ్ఞాన విశిష్టయశుడు
కార్మిక కర్షక కష్టౌఘతిమి రమ్ము
    పరమార్పఁజాలిన భాస్కరుండు
స్వీయ దేశౌన్నత్య శిక్షా మహర్షి గాం
    ధీ పథమ్మున గ్రాలు ధీవరుండు

దేశదాస్య విముక్తికై తెగువనాంగ్ల
బలము నెదిరించి మించిన పండితుండు
గోగినేనా న్వయాంబుధి కుముదహితుండు
కవిత లెఱిగినవాడు రంగా గురుండు

నగుమోమున్నల గాంధి టోపి భువనానందమ్ముఁ జేకూర్పగాఁ
దగు వేషమ్మున, స్వీయ దేశచరితా ధర్మమ్ము మూర్తిత్వ మిం
పుగఁ గన్పించెడు కట్టుబొట్టులః సుధాపూర్ణమ్ములౌ వాక్కులన్
ప్రగతిన్ జూపెడు నూత్న భావములతో
రంగాహ్వయుండొప్పెడున్

రైతుల కష్టనిష్ఠుర పరంపర మాటికి మానసమ్మునన్
కోత జనింపఁజేయ, తనకుంగల సర్వము వీడి దీక్ష, చే

యూత నొసంగి ముందుకు జయోత్సుకతన్జని రైతు
సంఘముల్
ఖ్యాతిగ కూలిసంఘములఁ గల్పనజేసిన ధీరుడాతడే

ఆతండార్యుఁడు రైతురంగ, ఘనవిశ్వాసమ్మునన్ గర్షక
వ్రాతమ్మున్ గరిఁజేరిఁదీసె; శతధా విజ్ఞాన వైదగ్ధ్యముల్
చేతో మోదమెలర్ప గూర్చి ధర సృష్టించెన్ మహాగ్రంథముల్
స్వాతంత్ర్యోద్యమ రంగ విక్రమ కళాసాహిత్య సంపత్తులన్

ప్రవిమల భావమ్ముల మా
నవ సేవకుఁ గడగి జీవనమె యంకితమౌ
టవసరమును గురు కార్యో
త్సవ శీలుడు "రంగ" కగుత సర్వశుభమ్ముల్

"భారత సౌభాగ్యంబున్, కారయరైతు, అతని సుఖములం
గోరి శ్రమలందు రంగా, పేరు మరువకోయి
ఆంధ్రవీరకుమారా"

—"ఆంధ్ర వీర కుమారా" అనే
శ్రీ బి. యస్. మూర్తిగారి కావ్యము నుండి

# ఆచార్య రంగా కీర్తి తరంగాలు

కవి శేఖర

చిన్నము హనుమయ్యచౌదరి

శా॥ శృంగారైక సరస్వతి రసశ్శ్రి యేర్పడన్ వేద వే
దాంగమ్ముల్ పఠియించుచుండ విని బ్రహ్మానందము
జెందుచున్
రంగత్ప్రిమజగమ్ములన్ నిరతమున్ రక్షించునా
బ్రహ్మ మా
రంగాగారికి రాజ్యశౌరికిడు దీర్ఘాయుస్సు భాగ్యోన్నతుల్

సీ॥ కూలిబాబుల పాలి కొంగు బంగారంబు
రైతు రాజుల నవరత్న రాశి
చేనేత పనివారి శ్రేయో మహాస్వర్గ
అల గాంధి సూత్రాల కండదండ
ఖండఖండాంతర ఖ్యాతికుగ్రాణంబు
జాతీయ కళల కుజ్జ్వల పతాక
కవి చకోరములకు కంకి వెన్నెల పంట
బహుళ భాషలకు నివాస భూమి

తే॥గీ॥ హరిజనుల కష్టముల బాప సహరహంబు
కంకణము గట్టుకొన్న సత్కర్మ యోగి
గోగినేనన్వయ క్షీరసాగరేందు
డైన రంగాకు నగుత నిత్యాభ్యుదయము

క॥ దేశమ్మునకు జ్వాల సం
దేశమైనట్టి బ్రతుకుదెరువున జను నీ
రాశీ భూతల సద్గుణ
డాశీస్సుల కెన్నిటికిని నర్హుండయగున్.

తే॥గీ॥ బాపుజీ మున్నుగాగల పరమ సాధు
వరులు కట్టిన స్వాతంత్ర్య భవనమందు
వెలుగునొక కొన్ని మేందివ్వియలలోన
నిండు జోతి రంగాగారు నిశ్చయంబు

* * * *

మ॥వడివంకల్ గనరాని బాటల మహాప్రస్థానముల్ సేయు ని
ప్పుడు మారైతులపైన జీవిత రథమ్ముల్ ఫ్రాన్సుముస్సైన పే
ర్వడు దేశాల జరించెడున్ భరత దివ్యత్కీర్తి కల్యాణి చె
ప్పెడి దేమున్నది కార్యశూరుడవు నీవే శ్రీ జి. రంగాభిధా

# నవ రత్నములు

శ్రీ బూసం మల్లయ్య

తే॥గీ॥ ఎప్పుడెయ్యది యేజీవి కెంత యవస
రమ్మొ తాన యెఱుంగు పరాత్పరుండు
రంగనాయకులకు నేఁటి ప్రాయమందు
నెద్దివలయునో దానినే యిచ్చుగాక

తే॥గీ॥ స్వాగతము గొనుమయ్య ఆచార్యరంగ
నాయకాః మాదుపూర్వ పుణ్యమున నదను
షష్టియె నేఁబది ట్రొమ్మిదవ దగు జన్మ
దిన మహోత్సవ మిప్పుడ దిరపసందు

తే గీ॥ తెల్లదొరల ప్రభుత్వంపు తీరు బెండు
వడ స్వరాజ్య రథమ్మును నడపినావు
సారథివి రథికుఁడవు కర్షరుల పాలి
యేడుగడవీవు బెడద లార్పెదవు నీవు

తే॥గీ॥ రసికుఁడవ రచయితవు నిర్మల యశః ప్ర
పూర్ణుఁడవు త్యాగరతుఁడవు బోధకుఁడవు
శాంతుఁడవు విమర్శకుఁడ వాచార్య బిరుద
వర్ధితుఁడవౌర రంగాజీ వందనమ్ము

తే॥గీ॥ ప్రేమదై వార నెప్పు డోపిన కొలంది
సాయమొనరింపనట్టి సంస్థ యొకఁడున్నె

ఆంధ్రమండలమునగాక అన్యసీమ
లందు నీ పేరు ప్రఖ్యాతు లలముకొనియె

తే॥గీ॥ అఖిల భారతదేశ నాయకులలోన
నొక్కరుఁడవయి సమదృష్టి నొప్పినావు
ఆంధ్రుఁడవుగాన మాకు నాయకుఁడ వీవె
యనుచు సంతోష వార్నిధి మునుకలిడమె

తే॥గీ॥ ప్రాకె నీ కీర్తి లతలు నిస్వార్థపరుఁడ
పైసలుపు దేశసేవా విహారములను
ప్రాచ్య ఖండాలలోన ప్రవర్ధమాన
మగుచు నుతులందుకొనుము మహానుభావ

తే॥గీ॥ నేరుపరి తీరుపరి గోగినేని రంగ
సమరసజ్ఞుఁడు విజ్ఞుఁడాచార్యరంగ
రంగరంగా యటంచు కర్షకులు కార్మి
కులు నుతింతురు నీల సద్గుణ గణములు

తే॥గీ॥ వికల సంస్థల నెవ్వఁడాదుకొను ననఁగ
వ్రేల నిను జూపుదురు చేతి వృత్తి జనులు
పలుకుబడికంటె మించు సంపదలు గలవె
మనుము నూరేఁడు లారోగ్య మహిమతోఁడ

# ప్రతిన

కర్షక కిశోర్

నడవండోయ్
నవ కర్షకులారా
నా దీ దేశం
నవభారత
నడుములుగట్టి
"సాంఘిక న్యాయం
సత్యాహింసలు
చాటి చెప్పను
కర్షక-కూలీ
గ్రామిక రాజ్యం
'భారతిదేవి
భారత భువిపై
రైతుల' రంగా
నవంబరేడు
రైతుస్వామ్యపు
కర్షక-కూలీ
కలిసికట్టుగా
నారీలోకము
నడుములు గట్టి

కదంద్రొక్కుచు
నడువండోయ్
యువ కర్షకులారా
నాదీ జాతని
నిర్మాణానికి
జగతికి ప్రగత"ని
నడువండోయ్
శ్రేయోరాజ్యం
స్థాపనజేయగ
ప్రొఫెసరు 'రంగా'
పుట్టిరి యువక
పుట్టినరోజు
పండుగనాడు
రక్షణ కొరకై
యువకుల్లారా
ప్రతిన చేయగ
నివాళు లివ్వగ
నడువండోయ్
కదలండోయ్

# అక్షరాలా ఆచార్యుడు

"పరశురామ్"

మెదడున్న వాళ్ళంతా
ఆలోచించలేరు.
కనుక మెదడుంటే చాలదు.

నోరున్న వాళ్ళంతా
మాట్లాడలేరు.
కనుక నోరుంటే చాలదు.

ఒళ్ళున్న వాళ్ళంతా
పనిచేయలేరు.
కనుక ఒళ్ళుంటే చాలదు.

మెదడు సవ్యంగా ఆలోచించాలి.
నోరు నిజంగా మాట్లాడాలి.
ఒళ్ళు సరిగ్గా పనిచేయాలి.

ఇలా దేనికదే పని
చేసినా చాలదు,
మళ్ళీ మూటికీ
ఇంటర్లింకులున్నాయి!

మెదడు సవ్యంగా ఆలోచించినదాన్ని
నోరు నిజంగా మాట్లాడాలి.
నోరు నిజమని పలికిన దాన్నే
ఒళ్ళు సరిగ్గా పనిచేయాలి.

ఇదే మనోవాక్కర్మల ఏకత్వం
ఈ మూటిలో ఏదో ఒక్కటే
ఉన్నవాడు ఎలాగో బ్రతుకుతాడు.

మెదడొక్కటే పనిచేసేవాడు
దొరో, దొంగో కావచ్చు
సరే, నోరున్న వాడిదే
రాజ్యమని మనకి తెలుసు.

ఒళ్ళొంచి పనిచేసేవాడు
ఒక పూటైగా గంజి తాగుతాడు
ఇక మొదటి రెండూ వుండి
మూడోది లేనివాడు
కేవలం సిద్ధాంతి.
అతగాడు చెప్పేవాడేగాని
చేసేవాడు కాడు.

మొదటిది లేకుండా
మిగిలిన రెండూ వున్నవాడు

చెప్పాలా వాడి సంగతి
చాలామంది వాళ్ళేగదా!

మొదటిది, మూడోది ఉన్నవాడు
పాపం వాడికి నోరులేదు
అయినా అతడుత్తముడే!

ఇకపోతే మూడూ వున్నవాడు
అతడేగదా ఉత్తమోత్తముడు.
మిగిలిన వాళ్ళందరికీ గుహూత్తముడు

ఎందరున్నారిలాంటివాళ్ళు?
ఎక్కడో శతకోటికి
ఒక్క ఆచార్యరంగా !

అక్షరాలా ఆచార్యుడు!
అందుకే అందాము
'ఆచార్యా! దీర్ఘాయురస్తు!'

# శతాయుష్మాన్ భవ!

శ్రీ కె. ఆర్. కోష్టి
బి. ఎస్‌సి; (లండన్)

ముప్పాతిక వయసొచ్చినా
మునిగే జనాలకోసం
ముందుకురికే చురుకుదనం!
సుఖానుభూతికి చిహ్నంగా
చిరునవ్వెప్పుడు చిందే వదనం!
పరులకోసమే పాటుపడగా
పుట్టెడు బాధల బ్రదుకుతో
పుట్టాడీ పురుషుడు పుడమిని
పుట్టిందీ దేశం కోసమే!
అందర కాయన
ఆప్తమిత్రుడు,
నీతికి నిలిచే నేత,
జాతిని కొలిచే భ్రాత!
ఎల్లవేళలా, అన్ని తావుల
చల్లగకాచే ఇల్లాలు...!
గురు పీఠానికి సరియగు
పరమోత్తమ జీవితము!
ఈ పుట్టినరోజు పండుగనాడు
నే గట్టిగ కోరే వరమేమంటే
నిండుగ నూరేళ్ళుండగ,
మెండుగ మళ్ళీ పండుగ!

(1975

# స్వార్థ మెరుగని త్యాగమూర్తి

### శ్రీ నూతక్కి అబ్రహాము

అతని ఆశయముల నాంధ్రోర్వి పండించె
అతని కీర్తి దేశమాక్రమించె
అతని త్యాగబుద్ధి కఖిలోర్వి గర్వించె
అతని దివ్యచరిత కృతులనించెః

మన యాంధ్రలక్ష్మికి మకుటాగ్రమున వెల్గు రమణీయ
కాంతుల రత్నమతడుః
మన తాత గాంధీజీః మనసులో తిరుగాడి సిద్ధహస్తుండైన
శిష్యుడతఁడుః
మన యాంధ్ర రైతుల కెనలేని యండగా ధీటుడై నిల్చిన
మేరువతడు ః
మన తెన్గు కీర్తిని వినజెప్పి యన్యుల వినుతులందిన
మానవధనుడతండు ః

యశము పసలూర నార్జించి దిశలు మెఱయ
తెనుగు పొలతికి వన్నియల్ దిద్దియవని
విశ్వవిఖ్యాత పురుషుడై వెలుగునతడె
రైతు రంగాజీః యనగవరాల బాబుః

అతడొక ధన్యజీవి మహదాశయముల్ తన కంఠహారముల్
హతమగు రైతుబిడ్డలకు నార్తశరణ్యుడు నాప్తబాంధవుం

ఆచార్య రంగాజీకి

దతద సమాన ప్రజ్ఞగల ఆంధ్రుడు దారుడు ఆంధ్రజాతికే
రతనమువంటివాడు కవిరాణ్మణులేనియు పల్కలేని అ

య్యతులిత దేశభక్తిగల స్వార్థ మెఱుంగని త్యాగమూర్తికిన్
నతులొనరించి కర్షక జనమ్ములు కోర్కెలుపండి నిండ "మా
బ్రతుకులు తీర్చిదిద్దిన ప్రభాకరు"డంచు జయంతి యుత్సవం
బతి ఘనమొప్పగా సలుప నాఘనుడుర్వి సుఖించుగావుతన్‌॥

ధాత్రియుప్పొంగ కీర్తి కాంతాలలామ
చెలగి ఆచార్యరంగాకు సిరులు గురియ
నుర్వి యేబదేడవ జయంత్యుత్సవమును
సలుపు కొనుచుండె రండు పూవులను గురియ॥

సన్నుత కార్యదక్షుడు ప్రజామత మెంతయు దీర్చిదిద్ది ఆ
పన్నులబ్రోచు సద్గుణుడు భారతమాతకు నిగ్గుదెచ్చి మా
కన్నుల పండువౌ నతుల కర్షకులంబున ఉద్భవించి అ
త్యున్నత విద్యలందిన మహోన్నతు డుర్విసుఖించు గావుతన్‌

పదవి తృణమ్ముగాదలచి భారతజాతి విశిష్ట కీర్తులన్‌
ముదముగతీర్చి దిద్దవలె ముందుతరాలకు భాగ్యభోగ్యముల్‌
కొదువలులేక కూర్చవలె కూటికి కుందెడు పేదవానిపై
పొదిగెడు లేములమ్మ పరిపూర్తిగ బచ్చిన మేలటంచు తా
మదిని తలంచు ధీరుని ఉమాపతిబ్రోచెడు నెల్లవేళలన్‌॥

పుడమిదేవికి బువ్వబుట్టించి పస్తులన్ మాన్పించు మనపాలి
మంచి రైతు।

ఆంగ్లేయ పెత్తనం బంతరింపగజేయ ప్రతిన బూనిన దొడ్డ
రైతు బిడ్డ।

యెండలో వానలో యే ప్రొద్దు కష్టించు దీనజనుల
కామధేనువతడు।

ముక్కోటి ఆంధ్రుల మక్కువల్ దీర్చెడు కమనీయ
సుమవల్లి కల్పవల్లి।

తెలుగు దొరసాని మెడలోని కలువదండ
భారతీయులపాలి మేల్పసిడికొండ।
అనగనొప్పారు రంగాజీ। ఘనుడ నంగ
చాటరా రండు సకలోర్వి సంతసించ।

జయమగుగాక। మా తెమగుజాతికి నాయకుడైన వానికిన్।
జయమగుగాక। కర్షకుల సారథియైన కుశాగ్ర బుద్ధికిన్।
జయమగుగాక। మాదునయశాలికి మాకమనీయ మూర్తికిన్।
జయమగు రాచకీయముల సారమెఱింగిన వానికిద్దరన్।

# నవంబరు ఏడు

శ్రీ బచ్చల మునికన్నయ్య

పరిభ్రమించే భూగోళంలో
పరిణామం లేకుంటుందా?
పరిణతి చెందే ప్రపంచంలో
ప్రజా ప్రభుత్వం మూగౌతుందా?

నాడు మావో, నేడు జేపో
నానా దేశాల నాయకుల
రాజకీయాల చతురంగం
రాచబాటగా మారుతుంది.

నవ్య భారతదేశమందున
భవ్యమైన ప్రజాజీవన
హృదయనాడుల రమన, సిరల
స్రవంతి వేగ సాగిపోతుంది.

ఆరోగ్య, విద్య, వైజ్ఞాన
సాంస్కృతిక సౌభాగ్య వృక్షం
పంచవర్ష ప్రణాళికలతో
పుష్పించి వేగ ఫలించుతుంది.

తుంగభద్ర, నాగార్జున
ప్రాజెక్టుల విద్యుచ్ఛక్తితో
ఆంధ్రరాష్ట్ర రాజ్యలక్ష్మి
అల్లారుముద్దుగ వెల్లివిరుస్తుంది.

కరువు రాక్షసి అరువులేక
తెరువు గానక, తెప్పరిల్లక
బ్రతుకు జీవుడ నంచువేగ
పారిపోవ సాహసిస్తుంది.

రైతుకూలి ప్రజారాజ్యం
రామరాజ్యపు తేరులందు
పయనమించ ప్రతినబూని
పరుగు లిడుతుంది

ఎప్పుడెచ్చటః ఎట్లు అంటుః
మీరు సందియ మొందుచుండిన
వినుడి విజ్ఞులు చెప్పినట్టి
వేదవాక్యము వీనులలరగ

''దేశమునకు గుండెకాయ
ధీరుడైన రైతుకాదాః
రైతుకూలి ప్రజల చేర్చి
రాజ్యమేలగ చేయరాదాః''

అనుచు ఎలుగుఎత్తి చాటిన
ఆచార్య రంగనాయకులు
చిరంజీవిగ శతవర్షములు
చెలువుమీరగ వర్ధిల్లిగ

తెలుగుదేశపు వెలుగుజోతులు
తేజరిల్లగ నాల్గు చెరగుల
సర్వలోకము శాంతిప్రదమై
సౌఖ్యశోభల తులతూగును.

# గుండెలో నాదం!

కె. సభా

ఎవరెన్ని చెప్పినా
ఎందరేమన్నా
ఎలుగెత్తి చెప్పగల
నేనొక్క సత్యం
గొంతెత్తి పాడగల
గుండెలో నాదం!

ఎన్నడో ఒకనాడు
ఈ క్రాంతి గీతం
ఈ విశ్వ మంతటా
విన్పించ గలదు
తెలుగు నేత్రాలను
తెరిపించ గలదు
వాడవాడల సుధల
వర్షించ గలదు
పల్లీయ హృదయాల
ప్రవహించగలదు

శ్రామిక వర్గాలు
సామరస్యముతో
స్వాతంత్ర్యముల నంది
శాంతి సుఖములతో
వర్ధిల్లు నాకాంక్ష
వరసిద్ధి కొరకు
విశ్వేశు నర్చించు
విజ్ఞాన ధనుడు
విశ్వమును సేవించు
వినయ శీలుండు
నా రైతు రంగాను
నాగేలు గాచు
నాగేటి వెనువెంట
నడయాడు నట్టి
నవ కర్షకుల కోట్లు
భువిని సైనికులు!

ఎన్నడో ఒకనాడు
ఉన్నదా నాడు
దైవశాసన మొందు
తప్పించ లేరు
కుటీల సీతులకెల్ల

గోరీలు కట్టి
సత్య పతాకమ్ము
జలదాల కెత్తి
రైతు కూలీ ప్రజా
రాజ్య రథమ్ము
వసుధపై పయనించ
వచ్చు మున్ముందు

ఆనాటిదనుక నీ

వమ్మృతము పోసి
ఆయురా రోగ్యముల
నభివృద్ధి జేసి
విజ్ఞాన ధీశక్తి
వికసింప జేసి
బాపూజి దీవెనలు
ఫలియించు నట్లు
ఆశీర్వదించు స
ర్వే మహేశ!

# రంగ! స్వస్త్యస్తు!

కళాప్రపూర్ణ
పండిత పెన్మెత్స సత్యన్నారాయణరాజు

ఆరు వారాలు నాకంటె నధికుఁడౌట
అన్న నాకయ్యె రంగాజీ, యతని వృద్ధి
అన్ని రంగాలఁ గోరు నీ చిన్ని తమ్ముఁ
డగు తెలుఁగురాజు "రంగః స్వస్త్య" స్తటంచు.

# మంచి మనిషి

శ్రీ కొసరాజు రాఘవయ్యచౌదరి

భారత రైతువాణి
పలికిందెక్కడినుండి?
జమీన్ రైతు రేక తొలుత
వినిపించిందెచటి నుండి
అది రంగా వాక్కునుండి
అది తూరుపు దిక్కునుండి

వ్యక్తి గౌరవాన్నిబట్టి
మంచి నడవడినిబట్టి
ఏ పార్టీ వాడైతేనేం?
ఏ కులమ్ము వాడైతేనేం?

స్వాతంత్ర్యానికి సర్వం
త్యాగం జేసిన జోదుకు
రైతు కూలి హక్కులకై
పోరాడిన బాంధవునకు
జన్మ దినోత్సవ మంటే
సంతోషించని దెవరు?

కలకాలం మనవలెనని
అందరు రంగాగారికి
అభినందన లంపుతారు
ఆశీస్సుల నింపుతారు.

# అంబరంలో సంబరాలు

శ్రీ టి. వి. యస్. మూర్తి
బి. ఎస్‌సి.

నింగిలోని చుక్కలన్ని
పొంగిపోతున్నాయి:

ఆనందంలో
అంబరమంతా
అరుణ వర్ణమైంది
ఆచార్యవరుడు
భారతవీరుడు
మన రంగాను చూచి::

జగతితలంలో
తిరుగులేని ఖ్యాతిబడసి
అన్నదాతలైన
రైతాంగానికి
ప్రియసోదరుడని,
దీన బాంధవుడని-
రంగాను చూచి
నింగిలోని నక్షత్రాలు
సంబరపడుతున్నాయి,
చక్కగ నవ్వుతున్నాయి,

'భారతి'నే సహధర్మిణిగా
శక్తి సంపదలను
ధార వోసిన
త్యాగధనుడు మనరంగా:

అందుకనే
ఆనందంతో
అంబరమంతా
సంబర పడుతోంది.

# శుభాకాంక్షలు

"వాస్తవానంద్"

సీ. ఆచార్యుడితడు 'భీష్మాచార్యు'డనగ తా
నధికార పదవుల నందలేదు
కర్షక శ్రేయమే గమ్యంబు గా నెంచె
మర్మ మెఱుఁగని సత్కర్మయోగి
తుచ్ఛ పదవులకు స్వచ్ఛంద సేవను
క్రయము గావించని ఘను డితండు
రాజకీయపు చదరంగ మందెన్నడు
కుట్ర సేయని నీతి కోవిదుండు

గీ. విమల చరితుడు, నీతినియమ, భరితుఁడు
పూజనీయు డనఘుడు రంగాజి యితడు
జన్మ శుభదిన శతములు జరుగునట్లు
దీవెన లొసగు మమ్మ ఓ తెలుగు తల్లి!

# పంచరత్నములు

భాషాప్రవీణ
శ్రీ పరిమి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీ రమణీయ భారత విశిష్ట చరిత్రకు మూలకందమై
సారవిచార విద్యలకు సాగరమో యన సాటివారిలో
పేరునుగాంచి జన్మదిన వేదికనందిన "గోగినేని రం
గా" రమణీయ ధీరునకు కామితముల్ సమకూరు గావుతన్.

భారత రాజకీయముల వాసిని గాంచిన ధీరకోటిలో
కీరతిగాంచి యే పదవికిన్ తలపూనక దేశసేవనే
గోరుచు నాయకాగ్రణులకున్ సరిదూగుచు రైతురాజ్యమే"
ధారుణి "రామరాజ్య"మను ధర్మమునిల్పిన "రైతునాయకా"

మిన్నెల్ల విరిగి తామీద గూలినగాని సత్యంబు వీడని
శాంతమూర్తి
లోకవిరోధంబు లోగొనజూడ యధార్థంబువీడని యార్యవరుడు
శ్రామిక రైతు విచార సమస్యల దీర్పంగదలచిన దీక్షితుండు
దేశ దేశములందు ధీరాగ్రణులచేత జేజేలుగొన్న విశేషవిదుడు

సుగుణరత్నాకరుండు విశుద్ధ చరితు డార్య జన పూజితుండు
ప్రజాభిమాన
సాగరుడు రాజకీయ విశారదుండు భారతీరమ్య భావైక
భావితుండు.

దేశోన్నతి తనయున్నతి దేశాభ్యుదయంబు తనమదిన్
లక్ష్యముగా
దేశ పురోగతి నెంచిన దేశికుడే రైతురంగ ధీనిధి ధరణిన్.

వివిధ దృక్పథాల విశ్వవిఖ్యాతినిగొన్న "గోగినేనిగోత్ర శశికి"
రమ్య సుగుణనిధికి రంగా మనీషికి మహిత పద్య
రత్న మాల నిడుదు.

కలముం ద్రిప్పుము విశ్వమానవ కళాకాంతుల్ ప్రదర్శింపఁగా
హాలముం బట్టుము లోక జీవన సమస్యాస్ఫూర్తి రేకెత్తఁగా
నిలువుం గోతకు సమ్మతించి జడమై నిద్రించు దుర్జాతితోఁ
దలక్రిందై దపమాచరింపు ఘనుడే ధన్యంబు నీ జన్మకున్.

* * * *

అందని దివ్యభూముల కహర్నిశ మిట్లెగ బ్రాకుచుందు వీ
వెందుల కోయి? నందనములేల? యసంగత దేవతాప్సరో
బృందములేల? చందనములేల? మరందములేల? జీవికా
నందమొనర్చు రైతు భజనమ్మున నీ కృతి నింపగూడదా?

కవిబ్రహ్మ
ఏటుకూరి వేంకటనరసయ్య

Sundarayya Vignana Kendram
101
Library
Ac. No. 26433

# అక్షరాంజలి

కొల్లా శ్రీకృష్ణారావు

కల డీ నాటికి రైత బాంధవుడు రంగాయంచు దేశమ్ము చే
తుల మోడ్చెన్, జయవెట్టి శ్రామికులు సంతోషమ్ముతో
దివ్య మం
గళ నీరాజన మిచ్చి రాదృతి, జగత్కల్యాణ కాంక్షాను షం
గుర పాదాబ్జములొత్తి చిత్తముల విజ్ఞుల్ నిల్పి పూజింపరే।

ప్రతి మాసమ్మున వచ్చు వేతనము సంప్రాప్తించు
నైశ్వర్యమున్
బ్రతిరోధించియు స్వేచ్ఛగోరి భరత స్వాతంత్ర్య సంలబ్ధికై
బ్రతుకుంగారకు నప్పగించితివి సర్వస్వమ్ము వోనాడి ఈ
గతి సేవించిన వారలాంధ్రమున రంగా! లేరు ముమ్మాటికిన్

కలవరమంది ముందుగతిగానని వానిని తిండిలేక ప
స్తుల దురపిల్లువాని పరితుష్టిగ నిస్తుల సాహితీ సుధల్
చిలికెడు వాని నొక్కదరి జేర్పగ కంకణ మూను మిమ్ము నా
తలపుల నక్షరాంజలుల దన్పుట ధన్యుడ నైతి నింతకున్.

# ఆ చా ర్య రం గా

"క వి సా మ్రా ట్"

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

రంగా! యంచును, రైతు లోకమది, నోరారంగ నింబిల్చుటల్
సంగీతమ్మయి పోవ-జాతకమునన్ సంవత్తి లేకుండ, నా
రంగత్తుంగ తరంగమౌ పదవి, దూరానందునే నిల్చె పో!
హంగా! నీకును సర్వముంగలదు, వహ్వా! శక్తియున్ గాఢమే.

తెలుగుంగడ్డనే కాదు—దేశమున-నా దేశమ్ము నేకాదు, వా
దార్థుల దాకెన్ భవదీయ కీర్తి—యిదియే దోసమ్ము
నౌనేమో! శి
ష్యులు పెక్కండ్రు మహాపదమ్ము గనుచున్ శోభింతురౌ
నీవు వా
రల దీవింతువు, స్వచ్ఛమైన యెదదన్, రంగా! మహాయోగివై.

కాంతా కాంచనముల్ దురాశలకు నిక్కంబై కాణాచు, లా
వంతైనన్ మఱిలోంగ నట్టిరుకదా! న్యాయమ్ము పాలింతు, రా
యంతస్థున్ నిలునట్టి వారలను, రంగా! నీవు నొక్కండు గా
మంతుం గాంచితి, ధన్యజీవివి కదా! మాన్యుండ వేనాటికిన్.

# రైతునేత రంగాజీ

## గుత్తా వీరరాఘవయ్య చౌదరి

సూటి మాటయుండి తేటభావం బుండి
కాంతియైన మోము కళగయుండి
చిన్నతనమునందె చాలా చురుకనిపించి
ఒడుపుచూపి చదివె విడువులేక॥

లక్ష్యసుద్దికొరకు లండను తానేగి
ఆక్స్ఫర్డు పట్టమంద గలిగి
అచటి విద్యార్థులలో ఆదర్శమూర్తగుచు
పిదప పట్నమేగి ప్రొఫెసరాయె॥

అనతికాలమందె అధిక త్యాగము చేయ
కాంగ్రెసందు దూకి కృషిని సలిపి
రైతు ఉద్యమాల రాటుదేలుట కొరకు
గ్రామగ్రామ మేగి కలది బలికె।

అరువదేండ్లు తనదు అధిక త్యాగమందు
నీతినిజాయితీ నింపియుండి
ఎనుబదేండ్ల వయసు అధిక మించినకూడా
దీక్ష వదలనట్టి దేశనేత॥

# చిరునవ్వులు చిందించే ఓ అమ్మా

శ్రీ పి. రామమూర్తి

చిరునవ్వులు చిందించే ఓ భారతీ
నిను మరిచే దెలాగమ్మా
రంగాజీ యిచ్చిన దీక్ష
నీ ద్వారా మాలో దృఢ మయ్యేదమ్మా

రంగాజీ చెప్పిన పాఠాలను
మాలో నీవే జీర్ణం చేశావమ్మా
అలనాటి రంగాజీ రాజకీయ యుగంలో
జరిపిన ఆ వైభవమంతా నీదే గదమ్మా
రంగాజీ దిద్దిన రూపురేఖలకు
జీవం బోసిందంతా వే గదమ్మా
రంగాజీ రాజకీయ యుగంలో
యోధుల నెందరినో సృజియిస్తే
వారికి యిచ్చిన నిలకడ నీవే గదమ్మా
మీ పుణ్య దంపతులిరువురు జేసిరి
యెంద రెందరో యోధులను సేనానులను గదమ్మా
ప్రతి రంగంలో మీరిచ్చిన మద్దీపన
ఫలించిన ప్రతి ఫలమే, మేమమ్మా
శిల్పం చెక్కే శిల్పి రంగాజీ అయితే

రాణించే రంగులు పులిమింది నీ వమ్మా
రంగాజీ రాజకీయ పరిజ్ఞానం ప్రబోదిస్తే
అందుకు అవుసర నిపుణత నీవందించావమ్మా
స్వాతంత్ర్య రణ రంగంలో శంఖం పూరించే
శాస్త్రీయ పద్ధతులు పట్టింది మీ దంపతు లేనమ్మా
హరిజన నాయకుని ఆది గ్రంథంగా రంగాజీ రచయిస్తే
హరిజన బిడ్డల నెందరినో నిజ బిడ్డలుగా దీశావమ్మా
దళిత జాతి వుద్దరణే మీ దంపతులదమ్మా

ఇంతకు నా పరాత్పరునకే దయగల్గిన రైతురాజ్య మ
త్యంత విభూతిఁ బెంపెసగదా? మన కర్షక సార్వభౌముడే
అంతములేని యీ భువన మంతకు శాసనకర్తయై నిర
భ్యంతర పాలనం బొనరుపంగల భాగ్యము కల్గుటెన్నడో.

కవిబ్రహ్మ
ఏటుకూరి వేంకట నరసయ్య

# సుఖీభవ

రావెల సాంబశివరావు

ఆరుగాలము కష్టపడినను
తెరువు తెన్నది తెలియరాకను
అరువు బరువుకు కుంగిపోయెడి
అన్నదాతకు ఊతమెవ్వరు?

రైతురాజ్యపు పురోగతికి
విధానమ్మది పెట్టుబడిదో
కాకపోయిన నియంతృత్వమొ
పనికి రాదని పలికె నెవ్వరు?

రైతులారా! రండి, రండి
సహకరించి కదిలిరండి
పరపతిదిగొ పంచుకొనుడు
అనుచు పలికిన పెద్ద ఎవ్వరు?

పదవి ప్రజలు రెంటి మధ్యన
ఏది ముఖ్యమొ తేల్చమనగ
ప్రజలె నాకు ముఖ్యమనెడి
వీరుడెవ్వడు? ధీరుడెవ్వడు?

వ్యక్తి ముఖ్యము సంఘమందున
వ్యక్తి స్వేచ్ఛది విలువ కలదని
వ్యక్తి స్వేచ్ఛది నిలువ వలెనని
నొక్కి చెప్పిన నేత ఎవ్వరు?

సతికి భారతి మదికి నచ్చిన
పతిత పావన పూత చరితుడు
పదులు యెనిమిది పైన బడిన
యన్.జి. రంగనామధేయుడు

ఆంధ్ర రైతుల ఉద్యమెల్లను
కొల్లగొట్టిన కృషీ వలునకు
రాజకీయ అడ్డుగోడలు
నిలువ లేదవి అడ్డమెన్నడు.

# కర్షక కళ్యాణము

ఆలోకం పెద్దబ్బయ్య
బి. ఎస్‌సి., బి. ఇడి.

ఉన్నవారికి
లేనివారికి
కలవు కలవని
అండదండలు

మధ్య తరగతి
మంచితనము
నిలుచు నటుల
నడుము గట్టుక
కృషిని సల్పిన
కృషీ వలుడా!

రైతు కొఱకు
కూలి కొఱకు
వారి మేధన
తెలివి కొఱకు
అహరహమ్మదె
విశ్రమించక
అలమటించిన
రైతు రంగా!

నీ నినాదమె
మాఱు మ్రోగెను
గగన వీధుల
అంచులందున
గెలుపు ఓటము
లోకటిగానే
స్వీకరించెడి
మహామానవ
పదవి కొరకని
ప్రాకులాడని
గుండె దిటవది
వున్నవాడా!

నీదు వునికి
ప్రభుత కెప్పుడు
దిక్కు చూపెడి
సూచి గదరా!

నీవు చూపెడి
దిక్కుగానే

రైతులందరు
నడువ నేర్చిన
రైతు కూలీ
రాజ్యమన్నది
వచ్చి తీరును

వచ్చి తీరును
రైతు నాయక
నీకు నేడు
వంద యేడుల

బ్రతుకు కొఱకు
ఇదిగో హారతి
పట్టుచుంటిని

రైతు లోకము
కనుల కద్దుక
నీదు బాటనే
నడచి తీరును
రైతు రాజ్యము
వచ్చి తీరును.

కలవిక ముందు నీ ప్రభకు గంటలు గట్టుక రంగయంచు మా
కులికెడు రోజు లిప్పటికె కొన్ని శతాబ్దులు ముందుకేగి నీ
పలుకులు కొల్పులయి భారతమెల్ల గ్రమించెరా! మహో
జ్జ్వల విజయ ప్రశంస లోకపట్టున గుమ్మయి గుబ్బతిల్లగన్.

కవిబ్రహ్మ
శ్రీ ఏటుకూరి వేంకట నరసయ్య

ఆచార్య రంగాజీకి

# పసిఁడి కాన్క

శ్రీ చెరుకుమల్లి వేంకటయ్య

అలసాని పెద్దనార్యాది సత్కవికోటిఁ
గని పెంచినట్టి బంగారు తల్లి !
కృష్ణరాయాది భూమీద ముఖ్యులఁగూర్చి
గారవించినయట్టి కల్పవల్లి !
మగుచ మంచాలలన్ మల్లమ్మలను బెంచి
రాణకెక్కించు వరాలతల్లి !
యోగివేమన్నల త్యాగరాజాది భ
క్తుల మురిపించెడి కుముదవల్లి !

విశ్వవిజ్ఞాన సాహితీ వెల్లువలను
తేజమెసగంగ జిలికెడు తెలుఁగుతల్లి !
మనుచు గావుత నిరతమ్ము మాన్య చరిత
రైతు-కూలీ ప్రజానేత ! రంగబాబు !

పుట్టితివన్న ! రైతులక్షులముం దిగజారిన దీనజాతులం
గుట్టుగఁ జేరఁదీసి కరకుం బరిపాలనఁజేయు నాంగ్ల సా
మ్రాట్టులఁగూల్చి, శ్రామికుల రాజ్యము గూర్పఁదలచి నీకు జే
వెట్టుదురయ్య ! రైతులకు పెన్నిధి వీవని రంగబాబయా !

కలముబట్టితివేని తెలుగు జాతీయ వి
జ్ఞాన మాధుర్యముల్ జాలువారు;
పలుకనెంచితివేని పంటకాపులశక్తి
ప్రవహించు గంగా ప్రవాహమగుచుఁ
గులుకుచుంటివయేని తొలకరీ మెఱుపులై
పంటపైరుల కాంతి బరగుచుండు;
కాలుకదిపితేని ఖండాతరములైన
తిరుగనేర్తువు యెడతెరిపిలేక;

నిన్నెదిర్చెడు వారి కొక్కింత జంక
వెట్టి సిద్ధాంత పాటవమయ్య నీది;
హర్ష పులకిత గాత్రులై కర్షకాళి
జోతలర్పింతు రివెగొమ్ము! రైతురంగ!

కలదుగదోయి! నీ బహుముఖ ప్రతిభాన్విత 'రైతుయాత్రలం'
దలి నవశక్తి సర్వజనతా హృదయంబుల నాచికొన్న యు
జ్వలదిన, మట్టి నీచరిత శ్రామికజాతికి రాచబాటయై
యలరుచునుండు టబ్బురమె! హాలికనేతృ శిరోమణీ గుణీ!

పల్లెప్రజలదె పెత్తనమెల్ల; తగదు
పట్నవాసుల పాలన పల్లెపైన
రైతుకూలీలదే యీ స్వరాజ్యమనెడి
నీ సుధావాక్కులవి నిజమేనటయ్య!

# జే జే లు

శ్రీ పిళ్ళా కన్నయ్యనాయుడు

సీ. చైతన్య రహితమై - చావంగనున్నట్టి
జాతీయ శక్తులు - జాగ్రుతొంద,

రైతు సమ్మేళనల్ - రయమొప్ప నెలకొల్పి
కార్మిక సంఘాలు - కలుగజేసి,

వర్గ విశిష్టతన్ - వసుధలో గుర్తించి
వర్గసంస్థలు చాల - బరగజేసి,

వేసంగి బడులను - విద్యార్థి సంఘాలు
విజ్ఞాన కేంద్రాలు - వెలయజేసి,

విధి విరామంబు లేకుండ - బుధులు మెచ్చ
సహజ గంభీర ధీరతన్ - జాతిసేవ
జేసి వర్ధిల్లుచున్న మీ - సేవ కివిగొ
గొనుము జేజేలు పదివేలు - కూర్మినేత.

# ఆదర్శ జీవి

యం. వి. శాస్త్రి

సీ॥ ఎవ్వాని చూపులో యెప్పుడు కన్పించు
యేర్వాక రైతు ఉద్వేగశక్తి
ఎవ్వాని రూపులో యెప్పుడు కాన్పించు
కలుపుతీసెడి కూలి కులుకుదనము
ఎవ్వాని మనసులో యెప్పుడు స్ఫురియించు
శ్రామికోద్ధరణ సద్ధర్మనిరతి
ఎవ్వాని యదలోన యెప్పుడు కన్పట్టు
సంక్రాంతి రైతుల సంతసంబు

తే॥ ఎవ్వ రిలలోన రైతాంగ సేవ్యమూర్తి
ఎవ్వ రిలలోన కార్మిక ధ్యేయమూర్తి
ఎవ్వరిలలోన విజ్ఞాన కావ్యకర్త
అట్టి ఆచార్యరంగ ఆదర్శజీవి.

# రైతాంగ యోధుడు

గడ్డం విశ్వనాథరావు

సీ। రైతు కూలీ ప్రజా-రాజ్యంబు నిల్పగా
సతతంబు పోరాడు-సరసు డతడు
వ్యవసాయ కూలీల – భవతాపమును బాప
నెల్ల వేళల పోరు-వీరు డతడు
బీద ప్రజలగోడు-సదయత బాపగా
యోచనల్ సల్పెడి-యోధు డతడు
పెద్దచిన్నల నెల్ల-ప్రేమతో సమకూర్చి
సోదరభావాల-జొన్పు డతడు

తే। గీ॥ విశ్వమానవ కళ్యాణ-విపుల తతిని
యొక్క త్రాటిని నడిపించు యువకుడతండు
కల్ల కపట మెరుంగని-ఘను డతండు
అతడె "ఆచార్య రంగా" మ-హాంధ్ర సుతుడు

తే॥గీ॥ ధన్యతను జెందె నీవంటి-తనయుబడసి
గరిమగాంచిన తెలుగు బం-గారు తల్లి
రైతు కూలీ కళాజన- రాజ్యస్థాప
న కయి లెమ్ము! యాచార్య! య-నఘ చరిత.

తే॥గీ రైతు లోకాలు యెనలేని-రాణకెక్క
ఖ్యాతిగాంచిన భరతమా-గాణమందు
నీదు నిర్మల సేవానుభూతి చేత
ఆయురారోగ్యశాలివై-యలరుమయ్య.

# హారతి

శ్రీ వెల్లంకి బ్రహ్మయ్య

సీ॥ రైతుకూలీ ప్రజారాజ్యమె స్థిరమంచు
మలయించు నీ సుధామధురసోక్తి
నిస్వార్థసేవయె తెలుగు బిడ్డల ధర్మ
మని పల్కు భవదుపన్యాససూక్తి
బాపు బోధలె ధర్మమార్గమని వచించు
భవదీయ యాశయాత్మక వచస్సు
పల్లెసీమలె నవ్యభారత భాగ్యశా
లలను నీదు సుడికారంపు సొంపు

గీ॥ మానవాళికి విజ్ఞాన మలరఁజేసి,
ఎల్లదేశంబుల విశ్రుత కీర్తి గాంచి
తెలుగుతల్లికి ముద్దునుఁ దీర్చుమయ్య!,
రైతు గురుదేవ! ఆచార్య రంగబాబు!

ఉ॥ రైతులఁగాచు ప్రేమ పతితాంధ్ర
జనావళిఁ బ్రోచు యుక్తియున్
అంతములేని త్యాగనిరతమ్మును మన్మనలందు నేర్పునున్
శాంతము, యుష్మదీయములు;
జాతికి మేలునుఁగూర్చు వేళలన్
ఎంతయుఁ జాలినట్టి శుభకీర్తులుఁగా దగునయ్య! రంగజీ!!

ఆచార్య రంగాజీకి

సీ॥ శ్రామిక జనరాజ్య సంధానకర్తకు
విగ్రహంబొకటి కల్పింతుమేమొ?

ప్రథమాంధ్ర కర్షకోద్యమనేతకు సువర్ణ
చిత్రంబు నొకటి రచింతు మేమొ?

అర్థ శాస్త్రాచార్యనామునకు జయంతి
యుత్సవం బిట్లు చేయుదమొ యేమొ?

అనుపమ దేశ సేవా దురంధరునకు
నేపద్యమో కాన్క యిడుదుమేమొ?

గీ॥ ఆంధ్ర రైతాంగ సేవకాగ్రణియింతడు,
యు నుపకృతి కేమిచేసినను లోచ్చె

గాన; భక్తి ప్రపూర్ణ హృత్కమలులమయి,
పాడుదము రెండు మంగళహారతులను

# అభినందన మాల

శ్రీ ముండ్లపాటి రామనాధరావు

గీ। తెలుగుసీమకు వన్నెను । తీర్చిదిద్ది
తెలుగుదేశపు ఖ్యాతిని । తలచి వలచి
తెలుగువారల ప్రతిభను । నిలపి యిలను
ఆంధ్రపీఠము నెక్కుమా । చార్య రంగ

సీ॥ కర్షక కూలీలు । కంట్రోలు బాధతో
కృశియించి తిండికి । కుందునాడు
హెచ్చు పన్నులు శిస్తు । హెచ్చింప మంత్రులు
శాసనాల్ జేయగా । చ టునాడు
సాలీలు మాలలు । సాధింపనేరక
నూలుకై పలుపాట్లు । నొందువాడు
కష్టించి కృష్ణను । కదలించి తమిళులు
దక్షిణాదికి జేర్ప । దలచునాడు

గీ॥ అండమై కొండగానిల్చి ।
ఆంధ్రప్రజల బాధలన్నియు బాపిన । బాంధవుండి
కూలి కర్షక ప్రజ యండ। కూడియుండ
అంతమొందని నీ సేవ । కక్షయంబు

# అభినందన మాల

శ్రీ జ్యోతి ప్రసాద్

సీ॥ భారతాంబ యనుప పాశాల భేదింప
శక్తితో నెదిరిన సైనికుండ
రైతు కూలీలకై రాజ్యంబు సృష్టింప
రంగాన నిల్చిన రైతురాజ!
పరదేశములకేగి భారతీయతఁ జాటి
మన్ననల్ బడసిన మాన్యచరిత!
తెలుగునాటను మేటి ధీరులన్ సృష్టించి
నడపించు జాతీయ నాయకుండ!

తే॥ దిగ్విజయమస్తు! శుభమస్తు! దివ్యమైన
జన్మదినముల వేవేలు జరుపుకొనుము!
హృదయ కుసుమాల నీ దివ్య పదములందు
నర్పణల్ చేసి పూజింతు రాంధ్రప్రజలు.

# "పూలదండ"

**శ్రీ బూదూరు రామానుజులురెడ్డి**

"పూలదండ" ఖండకావ్యం నుండి

ఆర్యులాచార్య రంగాఖ్యతో విల్వనె
  సంగెడు రైతువంశ ప్రభుండు
కర్షకవర్గ భాగ్య విధాతయై వారి
  శ్రేయమెంచెడు జన నాయకుండు
రైతు కూలి ప్రజారాజ్య నిర్మాణ ల
  క్ష్యము దృష్టినింగల యాంధ్ర సుతుడు
మిగుల దుఃఖితులౌ జమీను పాటక జన
  శ్రమల బోకార్చెడు విమల గుణుడు

అహరహం బార్త రక్షణా ధ్వవసితుండు
కాంగ్రెసు రణాగ్రగామి యోగండు మగడు
దేశ కల్యాణ సంధాన దీక్షితుండు
ఈశుదయ మనుగాకః నూరేండ్లదాకః

# పెన్నిధి

విషర్మాగ్రేసర
## కొత్త బాపయ్య చౌదరి

ఈమహిత ప్రపంచమున-నెక్కడ జూచిన నీవయై విమా
నామతితో జరించెదవు-నాతరమౌనె వచింపగా భవఁ
ద్ధి మహిమంబు, కాలిడిన-దేశములెల్లడ బర్వె సత్సభల్।
నీ మనసుం గనుంగొనెను-నేటికి, ధన్యుఁడ వీవు సోదరా।

పుట్టెద రెందరో ఘనులు-బుట్టకపోవరు సద్గుణాఢ్యులున్
గట్టుగ దేశభక్తి తమ-గాఢ హృదంతరమందు నిల్పి యే
దెట్టయినన్ సరేయనుచు-నెక్కుఁడు దీక్ష వహించి త్యాగులై
గట్టిగ సత్ప్రియత్నములఁగాంతురె నీ వలె రంగనాయకా॥

ఏ దేశంబుననున్న కర్షకులుగా-నీ నీకు సన్మాన్యులే।
యే దేశంబుననున్న కార్మికులుగా-నీ గౌరవోదాయకుల్।
యే దేశంబుననున్న నాయకులుగా- నీ నీకు వాత్సల్యులే।
యీ దేశంబున నేల చిత్రమదిగాదే నీదు చారిత్రతన్।

నిత్యము మారు రంగయని-నిన్నొక కొంచెపు సంఘ మెంచినన్
స్తోత్యము జేయుచుండు జన-సంఘము నిన్నొక ప్రక్కనప్పుడే
ప్రత్యహమున్ సమాదరణ-రైతుల కార్మికులెల్ల జూపఁగా
సత్యము గోచరించునట్లు-సాహస కార్యము లెన్నొ జేయవే॥

భారతభూమిఁ 'గమ్యునిజ'-ప్రాభవమేర్పడఁ జాలిపోవు నా।
ధారము గన్నయంత నిజ-ధర్మము దప్పక నైక్య సంఘమున్
జేరి ప్రజానుమోదివయి-చెక్కు చెమర్పక రాజ్యతంత్రమున్
ధీరులుమెచ్చ దేశమును-తిం పగదీర్తువు ఢిల్లి యందునన్॥

నీ యుపకార బుద్ధియును—నీదగు సర్వసమత్వ సిద్ధియున్
నీ యసమాన ప్రజ్ఞయు న—నిందింత వర్తన దివ్యవాక్కు నెం
తే యుపమాన దేశహిత—దృక్కులు జన్మదినోత్సవంబునన్।
మా యభినందనల్ గొని స-మంచిత కీర్తి విశాలు జేయుతన్॥

నీ జన్మ దినోత్సవమున।
బూజింపఁగ వివిధ రాష్ట్ర-పురముల బ్రజలున్।
ధీజన సందేశంబులు।
జేజేలగుగాక నీకు-శ్రేయము లొదవన్॥

# ఈ నా డే...

శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు

అన్నా! ఓయన్నా! రైతన్నా!
నేడే ఈనాడే నోయన్నా!
అంధకార బంధురమగు
ఆమావాస్య బ్రతుకుల్లో
నిరాశతో నిస్పృహతో,
పయనించే మన పథాల
వెయి వెల్గులు నూర్చినట్టి
వేగుజుక్క జన్మదినం

నేడే ఈనాడే నోయన్నా
అన్నా ఓయన్నా రైతన్నా

మసి మన వదనానికి
పూసిన ఈ సంఘానికి
మనమూ మనుషులమేనని
మనదీ ఒక జాతేనని,
తెలిపినట్టి కర్మ వీరు
డు దయించిన పర్వదినం

నేడే ఈనాడే నోయన్నా!
అన్నా ఓయన్నా రైతన్నా

మన జీవన తోటల్లో
మల్లెపూలు పూయించిన
చాచిన మన కరాలందు
మకరందం కురిపించిన
మహితాత్ముడు జన్మించిన
పర్వదినం పుణ్య దినం

నేడే ఈనాడే నోయన్నా!
అన్నా ఓయన్నా రైతన్నా

శాంతి పుష్ప సౌరభాల్ని
లోకాలకు పంచినట్టి,
సత్యాహింసల రెంటిని
సందిట బంధించినట్టి
ముసలి తాత ముద్దు బిడ్డ
ఉదయించిన దివ్యదినం

నేడే ఈనాడే నోయన్నా!
అన్నా ఓయన్నా రైతన్నా

జనుల కొఱకు ప్రగతిపథం
సృష్టించిన మహానేత,
జగతి జనుల ఆవేదన
తనదిగ జీర్ణించుకొన్న
ప్రవక్తొకడు జన్మించిన
పర్వదినం! పుణ్యదినం

నేడే ఈనాడే నోయన్నా!
అన్నా ఓయన్నా రైతన్నా

నియంతృత్వ రక్కసి తన
విషదంష్ట్రిలు నూరుతుంటే
ప్రజాస్వామ్య సిద్ధాంతపు
శాకులతో ప్రకోపించి
ఛానిమీద దాడి వెడలు
కర్మ వీరు జన్మదినం

నేడే ఈనాడే నోయన్నా!
అన్నా ఓయన్నా రైతన్నా

ఒక సిద్ధాంతం పుట్టిన
శుభదిన మీనాడు
ఒక ఆశయ ముద్భవించిన
పర్వదిన మీరోజు
విశ్వనేత రంగాజీ
ఉదయించినదీ దినమే.

# రైతు జూడకపోతే

శెట్టిపల్లి

ఆగునా జీవాలు
సాగునా లోకాలు
రాజుగా మనమెంచి
రైతు జూడకపోతె
దేశాలు తలలెత్తునా
దాస్యపున్ పాశాలు తావీడునా?

ఆవు లంబాయంచు
అరచు రైతుల యిండ్ల
కళ్యాణ దేవతన్
కనుల జూడనినాడు
సౌభాగ్య మేతెంచునా? దేశపున్
సిరిసంపదలు నిల్చునా?

పిల్ల పైరులమీద
చల్ల తెమ్మెర వీవ
గాంచి యానందించు
ఘనుని గాంచకపోతె
సృష్టి నైజము గాంతువా
ప్రకృతిని
"సౌందర్యమిక నిల్చునా?

పగలు రాతిరిలేక
పాటుపడు నా రైతు
కడగండ్లులన్ గాంచి
యాదరించకపోతే
రాజ్యమే యిల నిల్చునా
భూదేవి
భగ్నమై పోకుండునా?

పొలములో రైతుండి
పొలికేక బెట్టగన్
జయభేరి మ్రోతలై
జగతి నిండకపోతె
వీర రక్తము పొంగునా?
ఎల్లెడల
ధీరత్వ మడుగంటదా?

యావద్భారత కర్షకోద్యమ విధాతా! సూత్రధారుండవై
నీ వాడించిన బొమ్మలెన్నో తెరపై నేఁడెక్కె, నీయుద్యమ
ప్రావీణ్యమ్మును నీ పరిశ్రమను నీ పట్టుందలం జూచి మా
దేవుండన్నవి రైతు లోకములు కీర్తించెన్ దిగంతమ్ములున్.

కవిబ్రహ్మ
ఏటుకూరి వేంకట నరసయ్య

# రైతుకూలీ ప్రజారాజ్యం

త్రిపురాన రాఘవదాసు

రారండోయ్ లేలెండోయ్
రంగాజీ మన కండగ నుండగ
రాజ్యస్థాపన జేయండోయ్
కర్షక కార్మిక బుద్ధిజీవుల
రాజ్యస్థాపన జేయండోయ్
కర్షక కార్మిక కళాకారుల
రాజ్యస్థాపన జేయండోయ్ ॥రా॥

పొట్టలు నిండని కర్షకులారా
కడుపులు మాడే కార్మికులారా
వృత్తుల బ్రతికే శ్రామికులారా
బుద్ధిని గలిగిన జ్ఞానులారా
రారండోయ్ లేలెండోయ్
కర్షక కార్మిక బుద్ధిజీవుల
రాజ్యస్థాపన జేయండోయ్
కర్షక కార్మిక కళాకారుల
రాజ్యస్థాపన జేయండోయ్ ॥రా॥

పరాయి ప్రభువుల పాలనలేదని
పరాకు జెందక పనిలేదోయ్
విరామ మొందక నిరాశ జెందక
స్వరాజ్య స్థాపన జేయండోయ్ ॥రా॥

రాజకీయ స్వాతంత్ర్యమందినా
రాజులపాలన మంత మందినా
రైతులు వృద్ధిని పొందిననాడే
జాతికి జీవము కలదంటోయ్ ॥రా॥

ధనిక వారమది దగ్ధమొందినా
దోపిడిదారులు నాశమందినా
కూలీ క్షేమము జూచిననాడే
జాతికి శ్రేయము నిజమంటోయ్ ॥రా॥

యంత్రములన్నిట వృద్ధి బొందినా
నాగరికతమది పెంపు జెందినా
చేతివృత్తులను నిలిపిననాడే
భారత భాగ్యము నమ్మంటోయ్ ॥రా॥

కర్షకు లెంతగ వృద్ధిని బొందిన
కార్మికులెన్నిట లాభములందిన
బుద్ధి జీవులను పెంచిననాడే
జాతికి తేజము స్థిరమంటోయ్ ॥రా॥

# భారతీయ యువకా!

కొత్తపల్లి పున్నయ్య

భారతీయ యువకా-భరత భాగ్య నిర్మాత
భరతదేశ విజయరేఖ-భవ్యముగా దిద్దవోయి ॥భా॥

అరుదెంచుము ధీరతతో—అధిగమించు శూరతతో
పునః ప్రతిష్ఠింపజేయు-భారతీయ సంస్కృతిని
పునర్నిర్మించవోయి—భారతీయ సంఘమును ॥భా॥

వెలిగించుము దేశములో-దివ్య జ్ఞానదీపికలు
తొలగించుము మనుజులలో—అజ్ఞానపు చీకటులు
మరలింపుము జనావళుల—మతోన్మాద భరమునుండి
తరలింపుము నీజాతిని—మహాత్మాజీ మార్గమున ॥భా॥

అదిగో అశోక చక్రం
మానవాభ్యుదయ చిహ్నం
అహింసాత్మక స్వరూపం
అంతర్జాతీయ ధర్మచక్రం!

మానవజాత్యోద్ధరణమె-మన ఆశయం
మానవ కళ్యాణమె—మన ఆదర్శం
ఏక వసుధ నిర్మాణమె—మన సిద్ధాంతం
ఏక సంఘజీవనమె-మన కర్తవ్యం
పూరింపుము విజయ శంఖం-మ్రోగింపుము జయభేరి
సాధింపుము ఘనవిజయం-స్థాపింపుము నవజీవనం ॥భా॥

ఎంత కష్టించినా-ఎంత శ్రమపడినా
ఎంత చమటోడ్చినా-ఎన్నాళ్ళు దొర్లినా

తొలగదా యీ కూటి కరువూ
తొలగదా యీ కడుపు మంట ॥ఎం॥

ఎవరు పాలించినా, ఎవరేమి చేసినా,
ఏ విధానముపోయి, ఏమేమి వచ్చినా?

తొలగదా యీ కూటి కరువు
తొలగదా యీ కడుపుమంట ॥ఎం॥

రక్తమాంసాదులు బలిచేసి నప్పటికి
శక్తి సామర్థ్యాలు-శోషించి నప్పటికి

ఆకలి మంటలు శ్రమజీవికా
భాగ్యభోగములన్ని సోమరులకా ॥ఎం॥

ఇదియేమి ఖర్మమో-ఇదియేమి చోద్యమో
ఇదియేమి నిర్ణయమో-ఇది యేమి ధర్మమో ॥ఎం॥

కష్టపడువారలకు సుఖ మేలలేదు
కష్టించువారలకు సుఖ మేలలేదు ॥ఎం॥

# శుభాకాంక్షలు

-శ్రీ వేములపల్లి రాఘవయ్య

సీ. ఆసేతుశీతా చ – లాంతర రైతాంగ
సేవాధురీణుఁడై – చెలఁగె నెవఁడు
సాహసమ్మున ప్రపం – చ శ్రామికోద్యమ
భారధూర్వహుఁడైన – ధీరుఁడెవఁడు
పార్లమెంటున ప్రజా – ప్రతినిధియై రైతు
పక్షాన వాదించు – ప్రౌఢుఁడెవఁడు
'మార్క్సు' సిద్ధాంత – మార్గాలు ఖండించి
'బాపుజీ' మార్గాలు – బట్టె నెవఁడు

గీ. రైతు కూలీల మధ్య ప – రస్పరంబు
మైత్రి సాధింప శ్రమియించు మాన్యుడెవఁడు
అట్టి, ఆచార్య రంగా మ – హాశయుండు
చిరతరాయుష్య సంసిద్ధిఁ – జెందుఁగాత!

శా. నీవై యిచ్చు నినాద మొక్క టొకటే
నింపాదిగా చట్టమై
రావీలున్నది. రానినాఁడిది ప్రజా
రాజ్యంబు గాబోదులే
నీవే యర్థ శతాబ్ద మాత్ర మిఁకపై
నేతృత్వమున్ గాంచఁగా
దైవానుగ్రహముబ్బుఁ గాత! జనవం
ద్యా! రైతు రంగా! మహాన్.

# రంగాజీ నాయకత్వం:
# ప్రజాకవుల సన్నుతి

## "రైతుపాలిట నేడు రాజుగా నున్నాడు..."

(1934 సెప్టెంబరులో
శ్రీ కొత్త సత్యనారాయణ వ్రాసినది)

రంగ రంగా యంచు ఖంగు మనిపిస్తుంది
ఏ మూల చూచినా ఏ పల్లె చూచినా
ఆబాల గోపాల మందరూ మెచ్చారు
రంగాకె వోటీయుమీ, దేశ భంగాము తేబోకుమీ
గాంధి దేవుడన్న గాంధి చర్యలటన్న
ఆదర్శముగ జూచు సాధువర్తనుడు
కులతత్వ భావాలు కూల దన్నిన మేటి
పేదసాద లటన్న ప్రేమించెడూ వ్యక్తి
రంగరంగాయంచు పొంగిపోయెడు రైతు
బృందంబునకు మేలు పొందించు దిట్టరి
సేద్యమన్నను రైతు శ్రేయ సన్నను చాల
గమనించి మన్నించి గణుతి కెక్కిన దిట్ట
రైతు పాలిట నేడు రాజుగా నున్నాడు
రంగాకె వోటీయుమీ.........

# "కష్టించి దున్నే కులము కాతడు నాయకుండన్నా"

(1934 అక్టోబరులో
జమీను రైతు రామానాయుడుగారు వ్రాసినది)

రంగాకే వోటివ్వ  వలెనన్న - భారత సభకు
రంగనే గెల్పించ గదరన్న
కులముతో మనకేమి జోలన్నా-కష్టించి దున్నే కులము
కాతడు నాయకుండన్నా
కులము కశల పెట్టి మన లోపలను  భేదము రగులజేసి
బలము సంపా
దింప నెంచెడి తులవలను విడనాడి ప్రొఫెసర్ రంగాకే
వోటివ్వ వలెనన్నా
ఓటు విలువను తెలుసుకోరన్నా ఒక పూట తిండికె
ఓటు నిచ్చుట సిగ్గుచేటన్నా
ఓటుతోనే ముందు స్వేచ్ఛా కోటబట్టగవలసి యున్నది
నేటికైనను నిదుర మేల్కొని, దాటి స్వార్థము పౌరుషముతో
రంగాకే వోటివ్వవలెనన్నా.........?

## “ప్రజల క్షేమముగోరు పారమార్థికుడితడు...”

(1934 అక్టోబరులో
శ్రీ దాసరి వెంకట సుబ్బారావు వ్రాసినది)

రైతు గోడంటాడురా, రంగన్న రైతు పక్కుంటాడురా
రైతు లేకుంటేను రాజ్యమే లేదంటు
రైతునూ లెగ్గొట్టి రాజ్య మెక్కిస్తాడు
ఇతనికే వోటివ్వరా, సోదరా, ఇతనె రైతుకు దిక్కురా
పూరించు చున్నాడురా, రంగన్న పూరించు చున్నాడురా
పూరించుచున్నాడు భువి పాంచజన్యంబు
ఆధాటి కెదురొడ్డ గలవారు లేరురా
ప్రతి పక్ష లంతాను వెన్నిచ్చి నారురా
ముంగొంగు బంగారురా, రైతులకు ముంగిటనె కన్పించురా
స్వార్థాలాభిషులకు శ్రమనుందు చూడంగ
ప్రజల క్షేమమె గోరు పారమార్థికు డితడు
ఇతనికే వోటివ్వకా, సోదరా ఇతనికంటె లేడురా!

## "అతనికి మించిన నాయకుడేడీ ఆంధ్రదేశమందు"

(1934 నవంబరులో
జమీన్ రైతు నాయుడుగారు వ్రాసినది)

నూటికి యనభై రైతు జనానికి కూటికి దిక్కేది
అర్థిక మాంద్యం ముంచేస్తుంటే అడిగే దిక్కేదీ
పండిన పంటకు ధర లేకుంటే పలికే దిక్కేదీ
పండిందంతా పన్ను తినేస్తే పళ్ళే దిక్కేది
రైతు కొంపలు కూలుతు ఉంటే రైతుకు దిక్కేది
రాత్రి పగలు ప్రజకై పోరే రౌతును పిలవండి
రైతు రక్షణలబెట్టి కష్టముల రచ్చ చేయువాడు
శిస్తు తగ్గుదల సేయుట విధియని చింత సేయువాడు
జమీందారుల దుండిగంబుల సహియంపనివాడు
జంకూగొంకూ లేనివాడు సరసుడు మొనగాడు
రంగ నాయకుడు రైతు బాంధవుడు రైతు రక్షకుండు
అతనికి మించిన నాయకుడేడీ ఆంధ్రదేశమందు
రైతు కష్టముల నెరిగినవాడు రైతే అయినాడు.

* * * *

(1934 నవంబరులో
శ్రీ బత్తుల రామదాసు వ్రాసినది)

కపటము లేనివాడు, మదిగర్వము బూననివాడు సతతం
బుపకృతి సేయువాడు విజయోన్నతి బొల్చెడువాడు
యెన్నడున్
కుపిత మెరుంగబోడు రిపుకోటికి లొంగనివాడు దీనులన్
కృపగను రంగనాయకుల కోటు నొసంగగదోయి సోదరా!

# రైతు పుట్టినరోజు

డాక్టరు జె. బాపురెడ్డి

పందొమ్మిది వందల నవంబరు ఏడు
పాతబడ్డ చరిత్ర పుటల్లో
మూతబడ్డ తారీఖు కాదని

నడుస్తున్న చరిత్రలో
నాయకుడై వెలుగుతున్న
నీవు పుట్టిన రోజని గుర్తించి
పులకించి పోతున్నాం
పూజ్య రంగాజీ!

గోగినేని రంగనాయకులుగా
గుంటూరు మండలంలో పుట్టి
తెలుగు తల్లికి భరతమాతకు
వెలుగు తోరణాలు కట్టి

ప్రగతి యాత్ర సాగిస్తున్న ప్రజానాయకా!
నామ మాత్రపు నాయకుండను కానని
నీ పేరులోని 'నాయక' శబ్దాన్ని వ్యంజించి
రంగాజీగానే రాణిస్తున్నావు.

నీ కళ్ళముందే పుట్టింది
నేడు జీవిస్తున్న భారతజాతి
నిరాడంబర ప్రజాసేవే
నీ జీవితాన్ని వెలిగిస్తున్న ఔషధం
ఇరువై యవ శతాబ్దాన్ని
ఆవిష్కరించిన నీ జీవితం
ఇరువయొకటవ శతాబ్దానికి కూడా
స్వాగతం పలుకుతున్నది.

నిటారుగా నీవు నడుస్తుంటే
నింగినీ నేలనూ కలుపుతున్నట్లుంటుంది.
మట్టిని నమ్మిన రైతుగోడు
మాధవునికి తెలుపుతున్నట్లుంటుంది.

ఓ నిర్మల సేవాభావాంత రంగా!
సమ సమాజ సముజ్వల భవిష్యత్
రచనాచార్య రంగా!
నీవు పుట్టిన రోజు
రైతు పుట్టిన రోజు

# నాయకుల నాయకుడు

బొద్దులూరు నారాయణరావు
వల్లభరావుపాలెం

పరిపూర్ణ గంగా ప్రవంతికా గమకమ్ము
        నర్తించు నెవ్వాని నాల్కయందు
గంభీర భావనాక్రాంత సౌజన్యమ్ము
        మెదలాడు నెవ్వాని మేధయందు
రైతు కూలీ ప్రజా రాజ్యాభిలాషమ్ము
        స్ఫురియించు నెవ్వాని సూక్తులందు
నిర్నిద్ర భారతీ నిజ రాజకీయమ్ము
        కనిపించు నెవ్వాని కర్మమందు

అతడు సామాన్యుడా! ప్రజాహిత విధాన
నిర్ణయోద్దీప్త నిర్ణీత నిపుణ తంత్ర
మంత్రి మణులకు మకుటాయ మానమైన
నాయకుల నాయకుడు రంగనాయకుండు

జయజయ భారతీ హృదయ జాతి పరీమళ భావబంధురా!
జయజయ రాజకీయ పరిసర్పిత సార వికీర్ణ కంధరా!
జయజయ యావదాంధ్ర జన సంభృత నిర్మల వేషభూషణా!
జయజయ దేశదేశ పరిషజ్జన మోద సమగ్ర భాషణా!

రాజకీయ మంట రంగనాయకులంట
బిడ్డ చదువు మట్టిగడ్డయయ్యె
నన్ను తల్లిదండ్రులు లానోటి తోడనే
మెచ్చుకొనిరి సతులు మెటికలైన.

రాయలసీమలో కఱవు రక్కసి డొక్కలు అక్కునాడు—మా
కాయవు మూడె నెట్లనుచు—ఆరట చెందిన పల్లె పల్లె కుం
బోయిన పోకడల్—ప్రజకు బుంగల నంబలి దెచ్చిపోయు మీ
సాయమునెంచి నేడును ప్రశంసల గుప్పును రాలు రప్పలున్

మచ్చలేని చందమామయై సామియై
గుండెలందు కుదురు కొన్నవాడు
రైతు బాంధవుండు రంగాజీ యొక్కడే
వేయునేల నదియె వేదవాక్కు.

కాని లాభమేమి కాలమట్లే యుండె
పొగరుబోతు దొరలు భూములేల
ఒక్కరైతు బ్రతుకు బండల పాలయ్యె
కూలి నాలి జనము గోడు హెచ్చె

రైతు రాజ్య మంచు రామరాజ్యమ్మంచు
పల్కగానె మిడిసి పడితి రపుడు
రామరాజ్య మిపుడు స్వామి రాజ్యమ్మాయె
కొఱవి తోడ తలను గోకికొనిరి.

కూడు గుడ్డలు-పడియుండ గూడులేని
కూలి బాబును పరికించు జాలిగుండె
లేని దొరలతో నే డేగ లేమటంచు
పరితపించుచు నున్నదీ భరతభూమి.

గురువులకు పంగనామాల గుర్తు బెట్టు
శిష్యులెవ్వరు తమ పేరు చెప్పుకున్న
పరమ పదముల సోపాన పటము లెక్క
నేతలను దిద్దితీర్చిన నేతవీవు.

బంధుప్రీతిలేని పక్షపాతములేని
కుచ్చితమ్ములేని కుళ్ళు లేని
పాలనమ్ము వలయు భారతావని కంచు
అలమటించుచుండి రధిక జనులు.

# ఓ టు పా ట

రైతుకే ఓటివ్వవలెనన్నా!
నీ కష్ట సుఖములు రైతు ప్రతినిధి చెప్పగలడన్నా!
రైతునని ఓట్లడిగి తీసుక రైతు కొంపల గూల్చుపల్లును నీతి
గాదను జ్ఞానము వనివ్ గోతిలోపల ద్రోయకుండెడు ॥రైతు॥

దారిడొంకలు లేనియూళ్ళన్నా!
మన పల్లె కొంపలు దమ్మిడీకి పనికి రావన్నా
దారిడొంకలు లేక ధాన్యపు ధరలు తగ్గియు పంటపాడై
తెరికొనుటకు శక్తినా దారి రైతుకు తెన్ను జూపే ॥రైతు॥

శిస్తు భారము హెచ్చె గదరన్నా!
పంటెల్ల పూడ్చిన శిస్తుమట్టుకే లోటు గదరన్నా
శిస్తు భారము హెచ్చె రయితుల చిక్కులెల్ల మిన్నుముట్టె
కస్తి హెచ్చెను ద్రవ్యమునకి కష్టమును దేర్చేటి యోధుడు
॥రైతు॥

విందు, తిండికి లొంగ వలదన్నా!
ఒక పూట తింటే ముందు ఆకలి తీరుటెట్లన్నా!
విందు తిండితో మోసపోయి మందమతులకు వోట్లనిచ్చి అందు
లోపము దెలిసి వెనుక కుందలాభము లేదు నిజమగు ॥రైతు॥

మంచిచెడ్డలు నరయవలెనన్నా!
లోకమ్ము నడవడి కొంచమైనను తెలియవలెనన్నా
మంచిచెడ్డల జోలిమాని వంచెనచె నీ కడుపు నింపిన
పొంచి నన్ను అధోగతికిద్రో యించుకాలము వచ్చుచున్నది
॥రైతు॥

ఓటు విలువ తెలుసుకోరన్నా!
ఒక పూట తిండికే ఓటు యిచ్చుట సిగ్గుచేటన్నా!
ఓటుతోనే ముందు స్వేచ్ఛా కోటపట్టగ వలసియున్నది
నేటికైనను నిదుర మేల్కొని దాటి స్వార్థము పౌరుషముతో
॥రైతు॥

ముందు నాలుక జారవలదన్నా!
అభ్యర్థులెవరో ముందుగా యోచించి చెప్పన్నా!
ముందు నాలుక జారి యోగ్యుల క్రిందజేసియు పరుల కొనగిన
అందుకలిగెడి చెరుపుకై మనమందరము కుందుదము గావున
॥రైతు॥

ముందు కాలము రైతుదేనన్నా!
నిదురించకను నీ వందు పోల్గొన సిద్ధపడుమన్నా!
ముందుకాలములోన నీవానందపడగల రేఖలున్నవి
కందువదెతెల తెల్లవారక ముందు స్థానము నాక్రమింపను
॥రైతు।

పాలనము నీ చేతిలోదన్నా
నీ వెన్నుకొన్న ప్రతినిధియె పెత్తనదారన్నా!
పాలనంబునకెవడు యోగ్యుడో ప్రథమమున యోచించకుండిన
పాలనము చెడి పోగ యిప్పటి పాలనమె మేలంద్రు గావున
॥రైతు॥

కులముతో మనకేమి జోలన్నా!
కష్టించి దున్నే కులము ఒక్కటె తెలుసుకోరన్నా!
కులము కక్షల బెట్టి మనలోపలను భేదము రగులజేసి
బలము సంపాదింపనెంచెడి తులువతనము వీడి మన ॥రైతు॥

## ఏరువాక

జి. జోసపుకవి

కారులు దొల్కరించినవి
కావ్యపు భూముల రాజకీయ శ్రం
గారనవీన భావముల
గంధపు మొక్కలనాట నెడ్ల కో
డేరుల బన్నినాడు, ప్రక
టీకృత రమ్యపు పేరుక బం
గారపు మేడితోఁ దెనుఁగు
గండఁడు రంగడు పూలరంగఁడై.

# నా లు గు పూ లు

శ్రీ క వి వ ర్మ

శ్రీయుత గోగినేని కుల-
సింధు సుధాకర వాక్యధాటి, చే
మాయల మారి నాయకుల-
మాటల కోటలు గోటమీటి; మీ
తీయ మరంద ధారలను-
త్రేన్చుచు, గ్రోలుచు, భారతావనిన్
హాయిని బొందు వారయిరి-
హాళిక లోకము రంగనాయకా.

నారి వర్గపు సద్గుణ
సారమె రూపొందె ననగ - జన్మించిన, మా
భారతి కీరితి గోరుచు
నారీమణియయ్యె నమ్మ - యన్ జీ రంగా.

శతవత్సర పర్యంతము
సతి, సుత వర్గమునుగూడి - సౌఖ్యశ్రీలన్
బ్రతుకుచు, వలచిన సాయము
కుతుకంబున గూర్చుమయ్య-కృషికులకెల్లన్.

అఖిలభారత, రైతు సం-ఘాధి నేత
నాయకాగ్రణి మనరంగ - నాయకుండు
జన్మదిన పండుగలు మెండు - జరుపుకొండు
రమ్య గుణులార! సోదర - రైతులార!

# మందారమాల

మధురాంతకం రాజారాం
(1955)

ఎరుపెక్కె నా కనులు చండ భానుడవు,
తే నవ్వు విరిసెగా పూర్ణ సోముడవు,
ఏండ్లు ఏబది యైదు గడిచిన నేమి
జరయు రుజయును లేని యువమూర్తి వీవు

ఆచార్య రంగా! మ
హా నాయకాగ్రణీ!

అందుకో అందుకో మందార మాల!
ఆనంద ముప్పొంగు ఈ మంచివేళ!

రైతుకూలీ ప్రజారాజ్యాధి నేతా!
నవ భారతాభ్యుదయ కావ్య ప్రణేతా!
సకలోర్వి కర్షక లోక సంఘటితా!
అఖిలాంధ్ర జగతి కానంద ప్రదాతా!

అభ్యుదయ పథగామి!
ఆచార్య రంగా!

అందుకో అందుకో మందార మాల !
ఆనంద ముప్పొంగు ఈ మంచివేళ !

విశ్వరూపమ్మెత్తి అధికార కాంక్ష,
వికటించుచుండ వినాయకులందు నేడు
అధికార మొల్లని సేవా జీవి వీవు
ఓహో మహాత్యాగి ! ఓహో విరాగి !

ఆంధ్ర నోముల పంట !
ఆచార్య రంగా !

అందుకో అందుకో మందార మాల !
ఆనంద ముప్పొంగు ఈ మంచివేళ !

నిడుబ్రోలులో పుట్టి, నిఖిల జగతిని మెట్టి
పూజ్య భారతిదేవి కరము చేపట్టి
దీన హీన ప్రజానీకమ్ము బ్రోవంగా
నీ నిండు బ్రతుకునే మీదు కట్టావహో !

విమల తేజోనిధీ !
ఆచార్య రంగా !

అందుకో అందుకో మందార మాల !
ఆనంద ముప్పొంగు నీ మంచివేళ !

భక్తితో హృదయాలు తొణికిసలాడ
కవులు నీదు యశోగీతమ్ము పాడ
వేలుగా లక్షలుగ నీరాజనము లెత్తి
నీదు జన్మోత్సవము నెరపుకొనుచున్నాము

ఆచార్య రంగా! మ
హా నాయకాగ్రణీ !

అందుకో అందుకో మందార మాల !
ఆనంద ముప్పొంగు ఈ మంచివేళ !

# నీరాజనం

శ్రీ విద్వాన్ వేణు

జయంతి జయంతి
రైతుబాంధవుడు
రంగాజీకి
జయంతి జయంతి

అతడు మహావ్యక్త
భారతరైతు
ఉద్యమ ప్రవక్త
రంగాజీ వ్యక్తిగాదు
మహాశక్తి.

తరతరాల
వేదనతో
యుగయుగాల
రోదనతో,
వెతల బడలి
బ్రతుకు సడలి
బాధలతో
అలమటించు
పీడిత రైతాంగ
విముక్తియతడు.

సుకృతియే
ప్రకృతి యు
త్సంగంబున
పరవశమొందెడి
పల్లెసీమ
పసిడి భోషాణంలో
భద్రముగా
నిద్రాణమైయుండు
పల్లె సాహిత్యానికి
ప్రాణం పోసిన
కావ్యజీవి యతడు.

అతడు సంగీత ప్రియుడు
"తిరుతని" రైతాంగ
శిక్షణ శిబిరంలో.
సంగీత సభ
సభా యేర్పరింప
'భారతి' నా పజ్జనున్న
కోటికోట్ల స్వర్గములను
కొల్లగొందు నేనని
గొల్లున నవ్విన రసికుడు

సుతిమెత్తని
చిత్తము వా డాతడు
అతని చల్లని గుండెలపై
రైతాంగము
ఒడలు మఱచి
నిదురించును.
రైతుప్రజల యుల్లములో
రంగాజీ యిల్లు కట్టుకొన్నారు
అతని పలుకులలో
పంకజాత భవాండ
కర్పూరము వగుల
పిడుగుల జడివాన
హోరున వర్షించును
రంగాజీ యెడదకన్న
నవనీతము కఠిన తమము
రంగాజీ పలుకుకన్న
వజ్రమే మెత్తందనము

కర్షక, కార్మిక
ప్రజారాజ్య సాధన
రంగాజీ లక్ష్యం.
అసాధనలో
తామరపంతరలా
సాగర తరంగచ్ఛటలలా
అడుగడుగున
అవాంతరాలు
వేలు, లక్షలు, కోట్లు
అత దజాత శత్రుడు
కాని యనుచరులే
యాతని శత్రువులు
వైరుధ్యాల వురవడిలో
సైతం మేరుపులా
నిలిచే ధైర్యం
చుక్కానిని చక్కగ
బట్టే స్థైర్యం
అతనికే దక్కింది.

వెలుగును వెన్నాడే
నీడకు మల్లే
సుఖ దుఃఖాల మథనం
మంచివెంట పయనించే
చెడుగులాగ
చరిత్ర కథనం
స్వార్థంతో
ఒడుదుడుకులుగా
తిరోగమిస్తుంది.
మానవ జీవన రథచక్రం
తిరోగతిని నిరోధించి

చరిత్రలోన వ్యాధ్యాయాన్ని
సృష్టించాడు రంగాజీ
ప్రగతి మార్గగామి
''రంగాజీ''

జయంతి రోజున
అంబా! యను
లేగల కిరలై
శృంగారము లొలుకబోయు
కృషీవలుల
గృహప్రాంగణాల
కాపుకన్య
హస్తన్యస్త
పసిడి కంకణరవమ్ము,
చరణ మంజీర
స్మంజు పుంజశింజితమ్ము
చెలగ 'నీరాజన'
మిచ్చుగాక!

రైతుబాంధవా!
మీ జయంతు
లక్షయమై
వచ్చుగాక
మీ జీవన మమృతత్వ
మొందుగాక!



Sundarayya Vignana Ke...
Library
(A ....
H...

# రైతు నేత!

సోంపల్లి బాపయ్య

సీ. సాహసంబును జూపి సమరంబు సాగించు
సరదారు లచ్చన్న సరసనుండె
ఆనతిచ్చినతోనె అంబుధి లంఘించి
పయనించు రాజగోపాలుడుండె
నీ సహచారుడై నిరతంబు నిలుగొల్పి
పేరుగాంచిన యతడు పెద్దిరెడ్డి
సేవా దళంబుల సేనగా గూర్చియు
దిశలెల్ల దిరుగెడు ధీరుడుండె

గీ. రైతుసేవలు జేయగా రైతువీరు
లింద రుండంగ నీకెంతో నిండుపేరు
భరత సౌజన్య పుత్ర ఓ భవగాత్ర
రైతు జననేతవైన మా రైతు రంగ.

# భారతీదేవి రంగా

డా॥ చిట్టూరి సత్యనారాయణ
(మద్రాసు)

భారత భారతి, సంస్కృతీ భారతి
భారతీ దేవి రంగా

రంగా పూదోట అయితే
అందులోని ఎర్ర గులాబీ భారతి
రంగా పద్మమైతే
దానిలోని కేశరం భారతి—

రంగా అనే రైతు ఉద్యమ సముద్రంలో
రక్షా ద్వీపం భారతి
ఆ వుద్యమాలకి త్యాగాలకీ
రంగా జీవమైతే
దాని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భారతి

ఆమె అతని జీవం
జీవ నాళంలోని జనం

రంగా, భారతీ సూర్య చంద్రులు
భారత స్వాతంత్ర సమరమనే
సముద్రం మథించినపుడు
ఎక్కడో చిందిన

అమృత బిందువులు నాకి
అమరులైన రాహు కేతువులు
ఎన్ని కాట్లు వేసినా
తరగనిది వారి కాంతి

నీతి నిజాయితీ ఆదర్శంగా ఉన్న
వారి సహజీవనం అద్భుతం, ధన్యం

కాలమనే ప్రవాహంతో
ఎన్నో కథలు కలిసిపోతాయి
కాని మీ కథ చాలా పెద్దది—
మీ కథ చాలా సున్నితమైనది.

మరచి పోలేని మీ కథను చిన్ని
గొంతుతో నిర్మలంగా పాడాలి.
అది వీణా స్వరంలా ఉంటుంది-

ఎంచేతంటే :

అందులో అహంభావం లేదు.
కీర్తి దాహంలేదు.
వినయం ఉట్టిపడుతూ ఉంటుంది.

అతిథి అభ్యాగతులకు
అర్ఘ్య మిచ్చేదీ దేశం
నూరు మంది రంగా శిష్యులు

అర్థరాత్రి వచ్చినా
అన్నపూర్ణలా పంచ భక్ష్యాలు
తినిపించేది భారతి.

స్వాతంత్ర్యోద్యమానికి
జీవశక్తినంతా అర్పించింది.
ధనం, బలం—ఇంకా శరీరారోగ్యం
జయిళ్ళల్లో క్రుగ్గి.

ఆమె అడగలేదు నాకిది కావాలని
మంత్రి పదవి నాకెందుకు?
గౌరవించవలసిన వారిని గౌరవించండి
అనేసింది- ఆ తల్లి-త్యాగశీలి.

ఆమె నిర్మలమైన సత్యాగ్రహం
అచంచలమైన అహింస దీక్ష
ఎవరినైనా ముగ్ధుల్ని చేస్తాయి.

బాపూజీ అన్నారు:

ఓయి రంగా!
ఈ భారతి ఇక నా కూతురు! అని
ఆయన కంత నచ్చింది
ఆమెలోని నిర్మలత్వం.

ఏ ఇజాలతోనూ నీకు సంబంధం లేదు
అన్ని నిజాలలోనూ నీకు చోటుంది.

అందం అంటే నీకు ప్రాణం
కవిత అంటే నీకు యిష్టం
బొమ్మ అంటే నీకు ప్రేమ
స్వరాజ్యానికే మారు పేరు నీవు.

ఈ దేశాన్ని
స్వర్గమయం చేయాలని
ఎంత తపించేవు?
ఎంత కష్టించేవు?
గోవుల్ని పెంచావు.
గోపాలకుల్ని పోషించావు
గోభూమిని ప్రేమించావు.

నీవు మహిళా లోకానికి
కిరీటానివి
కిరీటంలోని శిరోమణివి
నీ ఆదర్శాలకు జై

అక్కా!

నిన్ను ఎప్పుడూ తలుస్తాను
ఈ వర్థంతిలో మరీనూ
నీవు రంగా హృదయానివి.
నీవు మా ప్రియమైన అక్కవి,
నీ యస్థి కృష్ణార్పణం
నీ ఆత్మకు శాంతి తర్పణం.

# అమ్మ భారతి

శ్రీ గుత్తా వీర రాఘవయ్య చౌదరి
( మద్రాసు )

ఎత్తు చక్కగుండి ఎంచదగు జడయుండి
మేని చామన చాయ మెరపుయుండి
కనులు విశాలమై కరుణ భావంబుండ
భారతాంబె యనగ పేరు బడసె॥

విద్యాలయము లందు వందలుగ పిల్లల
విద్య గరపి ఏట వృద్ధి పరుప
చల్లనైన చూపె తల్లిగా చూడగా
మరువ భారతి దేవి (తా) మరుపురాదు॥

భార్య లేడురైన భర్త సామాన్య మగు-
భర్త లేడురైన భార్య అటులె
ఇరివు రధికులగుచు ఎంచదగు రీతిగా
పవిత్ర నేతలైరి ప్రజలు మెచ్చ॥

వంద లొందలుగను రైతు బిడ్డల చేర్చి
అందమైన శిక్షణపుడు ఇవ్వ

కన్నతల్లి బోలు కరుణతో మము చూడ
మరచుట నిన తల్లి మరపురాదు॥

రాచకీయ మెరిగి రైతు సేవలు చేసి-
రైతు రంగాకున్న రమ్య తెరిగి
అండగాను నిలచి దండిగా పోరాడి
భర్త కీర్తి పెంచె భక్తి దెలిపి।

అమిత శాంతముండి అందమగు మనసుండ
అందె వేయు రూప మమరియుండి
కరుణ భావమైన కాంతి యౌకనులుం
గర్వమందె ఆంధ్ర మనత దెలిసి

కులము మతములను గొప్పలొప్పగ బోక
మెరిటు కలుగు వారి మెచ్చుకొనుచు
పైకి తీసినంత ప్రతి భెరిగి ఆచార్య
రంగాజీ నొప్పుదురు రైతులంతా॥

రాచకీయ మెరిగి రైతు సేవలు చేసె
రైతు వృత్తియందు రాటుదేలి
ధైర్య మెనగ రంగా ధర్మపత్ని యటుంచు
ముక్త కంఠంబుతో మెచ్చి రంతా॥

నిండు జీవితంబు పండగా తాగడిపి
రైతు ఉద్యమాల రాటుదేలి
రైతు బిడ్డలనగ అహరహమ్ము ను మెచ్చి
పైకి తీసినట్టి ప్రతిభశీలి॥

తమదు కులమె అనెడి తపన చెందగ బోక
అన్ని కులములందు ఐఖ్య తెరిగి
బడుల పెట్టి వారి ప్రతిభావంతుల చేసె
వందలాది యువకులపుడు చదువ।

రైతు బాంధవునకు రమ్య మౌ పత్నివై
రాత్రి బవలు చేసి రైతు సేవ
స్థిరత కీర్తి నీవు చేపట్టు విడువక
ఆంధ్రనారి రత్న మనగ నొప్పె॥

మంచి ఆదర్శాల మించు గృహిణై యున్నా
దేశ శేవలందు దీప్తి యున్నా
అరవై నాలుగేండ్ల ఆమె భువిపై నుండి
శత వత్సరంబు లటు శేవచేసే।

మారు చుండు జగము మారుదురు, జనులెపుడు
మారనట్టి దేది మహినెలేదు

మారకుండు నదియు మహిని ఒక్కటె గలమ
అదియే దేశసేవ దొడ్డ భక్తి

బంగరు తల్లనుచు భారతీ దేవినే
పలుమారు ప్రజలెపుడు బలుకుచుండ
ఆమె మన శ్యాంతి అధికమౌ చుండునని
ఒప్పితీర వలయుగొప్ప దెలిసి

నేత బోసు పోయె నిండక యె నూరేండ్లు
కవిత భారతటులె కన్ను మూసె
ఆంధ్ర రత్నమటులె అవని గర్భము కలిసె
అటులె భారతీ దేవి అమరజీవి॥

# అశ్రుతర్పణ

కవిరాజు—కళాప్రపూర్ణ
## శ్రీ కొండవీటి వేంకటకవి

రాలిపోయినది తారా పథమ్మున నుండి
మెఱుపు దీవియవోలు మేలిచుక్క
రాలిపోయినది వజ్రాల హారములోని
నైగనిగ్యము లీను నాయకమణి
రాలిపోయినది శారద కంఠసూత్రాన
పోహణించిన నడిబొడ్డు రాయి
రాలిపోయినది మా రైతు వర్గమునకు
జిగిబిగి గలిగించు జీవశక్తి

తను ధన మనమ్ము లెల్ల నర్పణము చేసి
కన్నబిడ్డలవలె శిష్యగణము బెంచి
అతి రథ మహారథులుగాగ నరయు జనని
పాంచ భౌతిక దేహమ్ము భస్మమగుట.

గొంతెత్తి నలుదెసల్ గుబ్బటిల్లగ జేయు
కవితల్లజుల నోళ్ళు కట్టువడియె
బ్రతుకు భారమును వీడితి మంచు భావించు
కూలినాలి జనమ్ము గుండె పగిలె

తల్లిగా పాలించి తడబాటు మదివీడు
కష్టజీవుల కొడల్ కమిలిపోయె

దైవసమైన స్వేచ్ఛా వాయువుల వీల్చి
వీదవిక్కి జనమ్ము వెలుపడియె

తరతరమ్ముల నుండి బంధముల జిక్కి
నోరువాయి మెదల్పగ నోచుకొనని
పీడిత జనమ్ము మిపుల బెంబేలు పడియె
తల్లినిం గోలుపోయిన పిల్లలవుట.

జగముద్ధరింపగా మగడు సాగినవేళ
ధైర్య మిచ్చిన యశోధరవు నీవ
నిజదేశ దాస్యబంధముల ద్రెంపెడి వేళ
స్రగ్గని రాణి రుద్రమవు నీవ
బరిమీద మాఱాడు పగఱ మూర్కొనువేళ
బంకుగొంకెఱుగని ఝూని వీవ
పతిపదాబ్జములె సద్గతి కూర్చు ననువేళ
భవ్యయౌ కస్తూరిబాయి వీవ

భారతీదేవి! నీవ మా భారతాంబ
వనుచు బుధులెల్ల నీ గొప్పతనము పొగడ
వెలుక బాఱెను నేడు మా తెలుగునాడు
వందన శతమ్ము గొమ్ము దీవనల నిమ్ము.

ఆచార్య రంగ నీ యాంతర్యము నెఱింగి
మసలు కొన్నాడమ్మ నినువు రీతి
మాతృభావము చూపి మరియాద లందించి
యుత్సాహమందె నీ యువతరమ్ము
నీవె భారతివి వేఱేవారు లేరంచు
పొగడికల్ పచరించె బుధగణమ్ము
నిఱుపేద జనులకై చెఱసాలలో గ్రుమ్మగ్గి
నిలిచితీవని మెచ్చె నిఖిల జగము

పుట్టినింటను మెటిన యట్టి యింట
నవధులే లేని సత్కీర్తి నందితీవు
పండుముత్తైదువుగ భర్త పదములకడ
నసువులర్పించి ధన్యాత్మ వైతివమ్మ.

వినిపించితివి వేనవేల సత్సభలలో
గాంధీ మహోదయు గాథలెల్ల

పలికించితివి మూగపడ్డ గొంతులు విప్పి
కోటి వీణెలు గోలమీటినట్లు

తిలకించితివి దేశదేశాలలోగల
వెలలేని తులలేని లలిత కళల

మఱిగి పోతివి జాతిమత భేదములతోడ
తడబాటు చెందు సోదరుల గాంచి

నిట్టనిలువున నీఱయి నిలువ నీడ
కట్టగుడ్డయు లేని సంఘముల నరసి
యెంత ఘూర్ణిల్లినదొ నీ హృదంతరమ్ము
దయను గైకొమ్ము మా యశ్రుతర్పణమ్ము.

# స్మృత్యంజలి

### శ్రీ చిన్నము రామయ్యాచౌదరి

కుంకుమ బొట్టుతో, సవురు గూర్చెడి ఖద్దరు చీరతోడ, దీ
క్షాంకిత దేశభక్తియె త్వదాకృతి గన్నది యన్నభాతి, క్షే
మంకరియైన మా భరత మాతవుగాఁ గనిపింతువమ్మ! స్మృ
త్యంకము మాకిఁకేమి కలదమ్మ! దివమ్మున కీవు చేరగా?

చామన చాయతో మిసమిసల్ పచరించెడి మేని తీవతో,
కోమలమైన పెన్నెఱుల క్రొమ్ముడితో, చిఱునవ్వు పూలతో,
ఆమని తోఁటవౌచు పతి కబ్బుట నాతఁడు రైతుబాంధవుం
డై మహిమంగనెన్; విధురుఁడై యింకనెట్లు భరించునో వ్యథల్!

గోసదనమ్ము శోకముల కుంపటి యయ్యెను. వియోగ సం
త్రాసము కాఱుచీఁకటుల రాసులు వోసె ప్రజా శిరస్సులన్,
భాసిలు దేశ మాతృపదపద్మములం దొక అర్చనాసుమం
బై, సరిలేని సౌరభ గుణాళిని జిమ్మెడి నీవు పోయినన్.

ఆసలు రేపి భవ్య కవితామృత ధారలు జాలువాఱఁగా
జేసెదు! ప్రోత్సహించెదవు, శీర్షమునన్ భరియించి సత్కవిన్;
భాసితమైన నీ హృదయ పద్మములోని దయా మరంద ధా
రాసవమిచ్చి ప్రోతువుగదమ్మ! యింకెవ్వరు దిక్కు వానికిన్?

నీ రమణీయ భావనలు నిర్మలమై ప్రవహించు వాహినీ
పూరములై తెలుంగుధర పొంగఁగ పర్మలు వాఱె నల్దెసల్
కోఱలు నూఱి మృత్యువను కోల్పులి నీహృదయమ్ము చీల్చెనా?
మారణహోమముల్ మణుల మాలలుగా విధి దాల్చుచేలొకో!

# అమ్మ

కె. సబా

అవునా?
అమ్మ చనిపోయిందా?
నిజంగా అమ్మ చనిపోయిందా?
ఆనాటి స్వాతంత్ర్య సమరాంగణంలో
గర్జించిన కనకదుర్గ
అమ్మ అస్తమించిందా?

వీర భారత నారీలోకంలో
విద్యుల్లతలా మెరసిపోయిన అమ్మ!
జమీందారీ రైతుల పోరాటంలో
చండ ప్రచండంగా విజృంభించిన అమ్మ!
అమ్మ చనిపోయిందా?
అవునా?
అమ్మ నిజంగానే మరణించిందా?

రైతాంగ చరిత్రను సృష్టించిన చైతన్యశక్తి
రాజకీయ రంగంలో అంచల నైతిక శక్తి
విశ్వ కర్షకాధినేత ఆచార్యరంగా ఆత్మశక్తి
అమ్మ కనుపించదా?
అవునా?
నిజంగా అమ్మ కనిపించదూ?

తెలుగునాట నాలుగు చెరగులా
పల్లె పల్లెలో వాడ వాడలో ధ్వనించిన రైతాంగవాణి
ప్రతి ధ్వనించిన ప్రజాశక్తి పరాశక్తి దివ్యవాణి
అమ్మమాట విన్పించదా?
నిజంగా
అమ్మ మనకిక కనిపించదా?
పల్లెరైతుల పంటతల్లి ప్రజల పాలిటి కల్పవల్లి
కరుణ రసముల పాలవెల్లి కర్షకుల బంగారు తల్లి
రైతురంగా జాజిమల్లి రైతు నేతల కన్నతల్లి
అమ్మ యిక లేదా?
అవునా?
అమ్మ యిక లేదా?

ఏది నాన్నా అమ్మ ఏదీ?
ఏది అన్నా అమ్మ ఏదీ?
ఏది చెల్లీ అమ్మ ఏదీ?
అమ్మ లేదా అమ్మ రాదా?
అమ్మ నెవ్వరు చూపగలరిక?
అమ్మ నెవ్వరు తెచ్చువారిక?
ఏది ఏదీ అమ్మ ఏదీ?
ఎక్కడున్నది అమ్మ ఏదీ?

రైతు కంటి పాపలోనా పంట పొలమున గాలిలోనా?
కల్పవృక్షము నీడలోనా కామధేనువు చూపులోనా?
నాకలోక పథములోనా? నాగేటి చాలులోనా?

దిక్తటాల దిగంచలాల దేవదేవుని ఆత్మలోనా?
భారతావని రైతు గుండెల పరువులెత్తే శక్తిలోనా?
బాపూజీ త్యాగమందున ప్రభవించిన చరితలోనా?
నాలోనా ఆత్మలోనా కవితలో ఈ కలములోనా?
జగజ్జనని దివ్య శక్తి సాక్షాత్కారంబులోనా
జ్యోతి జ్యోతి పరంజ్యోతి భారతావని భారతి
జ్యోతి జ్యోతి జగజ్జ్యోతి భారతావని భారతి!

ఏది జ్యోతి పరంజ్యోతి
ఏది జ్యోతి జగజ్జ్యోతి!
భారతీ? మా భారతీ!

మూగవోయినదేల గళము?
మొద్దుబారినదేల కలము?
ముందు సాగదదేల హలము?
ఎందుదాగెను రైతు బలము?

అమ్మా!
అమ్మ ఏమైనది?
ఎందుకలా మాయమైనది?
అమ్మ ఎక్కడా కనిపించక ఏమైపోయినది!

అమ్మ ఎక్కడా కనిపించదా?
అమ్మ జాడే స్ఫురియించదా?
అమ్మ గొంతే వినిపించదా?

అమ్మ చూపే ప్రసరించదా?
అమ్మ అమ్మ అమ్మ అమ్మ ఏదీ?
అమ్మ లేదా అమ్మ రానేరాదా?
అమ్మ అమ్మ అమ్మ అమ్మ
అమ్మా!......

పాంచ భౌతిక శక్తులన్ని
పంచ భూతములను కలిసి
అమ్మ ప్రకృతి రూపమెత్తి
అంతటా తా నవతరించి
అంధకారము నెల్ల చీల్చి
ఆశీస్సులిచ్చెను ఆదిశక్తి?
అమ్మ ఎవరోకాదు శక్తి!
అమ్మ నిజమిది పరాశక్తి!
అమ్మ లేని తావెక్కడ?
అమ్మరాని చోటెక్కడ?
ఎందుగన్నను ఎటను విన్నను
అమ్మ రూపము అమ్మ స్వరము
అమ్మ సాక్షాత్కారము
దివ్యమంగళ స్వరూపము!
దేదీప్యమాన ప్రకాశము
భారతీదేవి ప్రజ్వలిత జ్వలన తేజము!

# సంస్మరణ

## వల్లభనేని కాశీవిశ్వనాథ్

సీ॥ పంటకాపుల యింట చంటిపాపై నట్టి
రైతాంగ భారత రాజ్ఞి యెవరు?
గ్రామీణ కర్షక గారాబు పట్టియై
రైతు బాంధవియైన రమణి యెవరు?
పలుకుల జవరాలు కులుకు లెరుంగక
కర్షకోద్యమ విద్యుత్కండ యెవరు?
మహనీయుడౌ గాంధి మార్గానుగామినై
శ్వేతాంగ ప్రభుతను చెండెనెవరు?

తే॥గీ॥ క్షాత్రమనగ నేనేయనుటన్న క్షేత్ర లక్ష్మి
రైతు రంగాజి కర్ధాంగి లక్ష్మియామె
పంట బంగారమగుట నాకంట నొలుక
జాతిరత్నంబు లానంద జలకణమ్ము.

# అమ్మ

శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు
(పల్నాటి సోదర కవులు)

ఈ కవి, మా కుమారుఁడని, యెల్లరకున్ దెలియంగఁబల్కి, న
న్నా కిరణిం గనుంగొనుచు హర్షపయోనిధిఁ దేల్చుతల్లి సు
శ్లోక చరిత్ర, భారతి, వసుంధర వీడి వియత్పథంబునన్
నాకముఁజేరు వార్తవిని నా హృదయమ్ము తపించె నక్కటా!

పతి కనుసన్నలం గదలి భారతభవ్య మహోద్యమమ్ములన్
సతతము సాగఁజేయుచుఁ బ్రజాహృదయమ్ముల మేలుకొల్పి య
ప్రతిహతశక్తిఁ జూపితి వపార కృపామతి, భారతీ! పతి
వ్రతవు, సమస్త ధర్మములు వర్ధిలుచుండు భవనమ్మునన్.

నీవును నీ మనోహరుఁడు నేర్పు విధానములం గ్రహించి మే
భావులు సంతసించిరి సుధామయి! మీ మధుర ప్రబోధ గీ
తావళి నాలకించి ప్రముదమందిరి మానవులంత, భారతీ
దేవి! మదంబ! మీ పసిడి దీవెనలంగొనె సర్వ సంఘముల్.

శీలము మీ గుణమ్ముల వసించు నజస్రము, మాయరాజకీ
యాలకుఁ దావువీని హృదయమ్ములు మీయవి, పొందుకష్ట న
ష్టాలకు నించుకంతయును జంకరు మీరలు, మిమ్మునెవ్వరుం
బోలరు తల్లిరో! విడచిపోయితివా! మము, స్వర్గసీమకున్.

నాయకులంత మీప్రవచనమ్ముల ఁ ఱ్మక నాటి మీ యభి
ప్రాయములం గ్రహింపక యపాయమ్ములంబడి గౌరవమ్ముఁగో
ల్పోయిరి నేడు కూలబడిపోయరి హేతువులేక సీతువుల్
కూయవటంచుఁ బల్కితివి కొంకక ముందుగనీవు భారతీ!

ఓ మహిళా శిరోమణి మహోన్నత భాషిణి! నీ ప్రియుండు రం
గా మహనీయుఁ డింకెటుల కాలముఁ బుచ్చును
నిన్ను బాసి హా,
మే మెటు చింత బాసెదము! మేలగు తల్లివి నీవు స్వర్గం స
ధామముఁ జేరియుంట, నిది ధర్మ మటంచు దలంచుచుంటివా!

26433.

గ్రంథావళి - 3



" కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్ సిద్ధాంత ప్రవక్త "